नमस्ते

UGCNET SANSKRIT- 25 (TELUGU MATERIAL)

Don't

Here in these Pdfs whatever content used are copied .This is not my own. These are all gathered and kept in one file for usage purpose from following websites. So Don't use commercial purpose.

1. **https://sites.google.com/site/sairealattitudemanagement/Telugu-Devotional-Spiritual-Free-eBooks**
2. **https://archive.org/search.php?query=sanskrit**
3. **https://www.teluguthesis.com/p/var-startindex-1var-maxresults-150var_1.html**
4. **http://www.sanskritebooks.org/**
5. **SOME OTHER OLD TEXT BOOKS FROM GOOGLE.**

@pavansamskruth

Dr.Rayavarapu Pavan kumar

pavansamskruth@gmail.com

పురాణాలు

వేదాలల్లో నిక్షిప్తమైన జ్ఞానసంపదే పురాణాలల్లో కథలరూపంగా వ్యాఖ్యానింప బడింది. వైదిక యుగం నాటి ధార్మిక, సాంఘిక పరిస్థితులు పురాణాల కాలం నాటికి చాల మార్పులకు లోనైనవి. పౌరాణిక యుగం నాటికి అనేక విదేశీయజాతులు భారతదేశాన్ని తమ స్వదేశంగా చేసుకొని స్థిరపడినవి. వారు ఇక్కడి ధార్మిక జీవనాన్ని గ్రహించటమే కాక తమ ధార్మికాలోచనల ప్రభావాన్ని కూడ ఇక్కడి మతధర్మాల మీద వేసారు. వైదికయుగంలో ప్రాధాన్యం వహించిన అగ్ని ఇంద్ర వరుణాది దేవతలు పురాణాల కాలం నాటికి గౌణమై వారి స్థానాన్ని విష్ణువు శివుడు మొదలైనవారు గ్రహించారు. ఒకవైపు వేదవిజ్ఞానాన్ని, దార్శనికాభిప్రాయాలను వ్యాఖ్యానిస్తున్నా పురాణాలు విష్ణు శివుల ప్రాధాన్యతను, సత్తాను ఒక విధంగా స్థాపిస్తున్నవి. ఆ ఉద్దేశంతోనే విష్ణు, శివ, శాక్తమొదలైన దేవతాసంప్రదాయాలకు చెందిన వివిధ పురాణాలు ఆవిర్భవించినవి.

పురాణాలల్లోవైదికానంతర యగం నాటి భారతీయుల ఆచార వ్యవహార విచారాలు, ధార్మిక సాంఘిక రాజకీయ జీవిత విధానాలు, దార్శనిక సిద్ధాంతాలు ప్రతిబింబించినవి. పురాణాలు భారతీయుల ధార్మిక, సాంఘిక, రాజకీయ, దార్శనిక జీవనానికి విజ్ఞానకోశ గ్రంథాలని చెప్పవచ్చును.

పురాణాల ప్రాచీనత

ప్రాచీన భారతీయ సంప్రదాయాన్ననుసరించి వేదాలు ఎంత ప్రాచీనమైనవో పురాణాలు అంత ప్రాచీనమైనవి, అథర్వ సంహితను బట్టి పురాణ, ఋక్, సామ, ఛంద, యజుస్సులు - అన్నీ ఒకేసారి ఆవిర్భవించినవి. తడిసిన కట్టె నుంచి పొగలేచినట్లుగా మహాభారతం నుంచి వేదాలు, ఇతిహాస, పురాణ, ఉపనిషత్, సూత్ర, ఆఖ్యాన, వ్యాఖ్యానాలు ఉద్భవించినవని శతపథబ్రాహ్మణం, బృహదారణ్యకాలు చెప్తున్నవి. దీనికి భాష్యం చేస్తు శంకరాచార్యులు - పురుషున్నించి అప్రయాసంగా నిశ్వాసం ఎట్లా వెళ్లుతుందో అట్లా అనాయాసంగా ఇవి ఆవిర్భవించినవని అన్నాడు. పురాణాలు ప్రాచీనమైనవని బ్రాహ్మణ, ఉపనిషత్తులు అంగీకరించినవి. పురాణాన్ని పంచమ వేదంగా ఛాందోగ్యోపనిషత్తు అంగీకరించి నాలుగు వేదాల పక్కన దానికి

స్థానాన్ని ఇచ్చింది. చతుర్దశ విద్యలల్లో పురాణ విద్య ప్రముఖమైందని యాజ్ఞవల్క్యస్మృతి కారుడు చెప్పాడు. పురాణ, న్యాయ, మీమాంస, ధర్మశాస్త్రం మరియు నాలుగు వేదాలు, షట్ వేదాంగాలు - ఇవి స్మృతికారుని దృష్టిలో చతుర్దశవిద్యలు. మొదట బ్రహ్మ పురాణాలను స్మరించి తర్వాత వేదాది శాస్త్రాలను స్మరించాడని బ్రహ్మాండపురాణంలో చెప్పబడింది. పురాణాలను అధ్యయనం చేయంది వేదాల తత్త్వాన్ని తెలుసుకోవటం కష్టం అని ప్రాచీన భారతీయుల అభిప్రాయం.

పురాణాలు అర్వాచీన రచనలని, గుప్తరాజుల కాలంలో అవి వ్రాయబడినవని కొందరు ఆధునికుల అభిప్రాయం. కాని బ్రాహ్మణ, ఉపనిషత్తుల్లో పురాణాల ప్రశంస వుండగా పురాణాలు క్రీ.శ. 400 ప్రాంతం రచనలని చెప్పటం సమంజసం కాదని ఆధునిక విమర్శకుల్లో చాలామంది అభిప్రాయ పడేవారున్నారు. చారిత్రకమైన మౌర్య, ఆంధ్ర, గుప్తరాజుల ప్రశంస పురాణాల్లో వున్నది. కాబట్టి పురాణాలు ఏదో ఒక్క కాలంలో రచింపబడినవని నిర్ణయించటానికి వీల్లేదు. ఉపనిషత్తుల రచనలవలె పురాణాలు వివిధ కాలాల్లో వ్రాయబడినవని చెప్పవలసివుంటుంది. పురాణాల సంప్రదాయం మౌఖికంగా అతిప్రాచీనకాలం నుంచే ప్రచలిత రూపంలో వుండివుంటుంది. అంటె వేదమంత్రాల రచనాకాలంలోనే పురాణ సంప్రదాయం మౌఖికంగా ప్రచారంలో వుండివుంటుంది. మత్స్య, శివపురాణాల ననుసరించి మొట్టమొదట ఒక్కటే పురాణం వుండేదని తెలుస్తున్నది. ఆ ఒక్క పురాణం నుంచే ఇతర పురాణాలు ఆవిర్భవించి వుంటవి. నాలుగు లక్షల శ్లోక పరిమితమైన ఆ మొదటి పురాణాన్ని వ్యాసుడు 18 భాగాలుగా విభాగించాడని, ఆ 18 విభాగాలే 18 పురాణాలు అయినవని అంటారు. పురాణాలన్నిటిలోని విషయం, నిర్మాణ విధుల్లో వున్నసామ్యాన్ని పరిశీలించి పై కథను అనుసంధానించుకొన్నట్లయితే పురాణాలన్నీ ఏదో ప్రాచీనమైన ఒక్క పురాణాన్ని ఆదర్శంగా పెట్టుకొని వేరు వేరు సంప్రదాయాలకు అనుగుణంగా ఆయా దేవతల మహత్తతను స్థాపిస్తు ఆవిర్భవించినవని చెప్పవచ్చును. బ్రాహ్మణ కాలంలోను పురాణ విద్య వున్నది. మరియు గుప్తవంశజుల ప్రసక్తి పురాణాలల్లో కన్పిస్తున్నది. దీన్ని బట్టి పురాణాల రచనాకాలం బ్రాహ్మణ కాలం నుంచి గుప్తరాజుల పరిపాలనాకాలం వరకు విస్తరించిందని చెప్పవచ్చును. అంటె అప్పుడు ఆ కాలాన్ని దాదాపుగా క్రీ.పూ. 1200 నుంచి క్రీ.శ. 500 వరకు అని నిర్ణయించవచ్చును. ఆ తర్వాత కూడ వ్రాయబడిన పురాణాలు వున్నవి. ఉదా॥కు భాగవతపురాణం అర్వాచీన రచన అని చాలా మంది విమర్శకుల అభిప్రాయం. అర్వాచీన కాలంలో చాలా సంఖ్యలో స్థానిక దేవతల, క్షేత్ర, వ్రత మాహాత్మ్యాలను తెలిపే ఉపపురాణాలు వ్రాయబడినవి.

వేదాలల్లో సంక్షేపంగా చెప్పబడిన విషయాలే పురాణాలల్లో విశదీకరింపబడి వ్యాఖ్యానింపబడి ప్రస్తుతీకరింపబడినవి. అయినా వివిధ జాతుల సమ్మేళనం వల్ల హిందూమతంలో వచ్చిన మార్పులను అంటె వైదికానంతర మతధర్మాలను పురాణాలు ప్రస్తుతీకరిస్తున్నవి. వైదిక దేవతలను, వైదిక యజ్ఞయాగాదులను పురాణాలు ప్రశంసించటం లేదు. వీటిల్లో ప్రశంసింపబడిన దేవతలు వైదిక యుగానంతరం ప్రచారంలోకి వచ్చినవారు. అంటె పూర్తిగా యజ్ఞయాగాది సంస్థ నశించిన తర్వాత పురాణాలు ఆవిర్భవించినవని చెప్పటం కాదు. ఒకవైపు యజ్ఞయాగాది కర్మలు వ్యాప్తిలో వున్నప్పుడే ఆ మతానికి సమానాంతరంగా విష్ణు, శివ, శక్త్యారాధనలు బయలు దేరినవి. ఒకవైపు వేదాలల్లోని జ్ఞానాన్ని పురాణాలు విశదీకరించి, వ్యాఖ్యానించి బోధిస్తున్నా ఇంకొకవైపు అవి కొత్త దేవతల ఆరాధనా విశేషాలను బోధిస్తున్నవి. గుప్తుల కాలంలో ఇంకా ఆ తర్వాత ప్రచలితమైన వైదిక దేవతారాధనకు భిన్నమైన హిందూ సంప్రదాయానికి పురాణాలు ప్రతినిధిత్వాన్ని వహిస్తున్నవి. బ్రాహ్మణ భక్తి, దానాలు, దక్షిణలు, క్షేత్రాలు, క్షేత్రమాహాత్మ్యాలు, వ్రత, పూజావిధానాలు, దేవతామాహాత్మ్యాలు, శివ విష్ణు శక్త్యారాధనలతో కూడిన హిందూమత విశేషం పురాణాలల్లో కన్పిస్తున్నది కాబట్టి వైదికానంతర మతధర్మాలను పౌరాణికమతం పేరుతో పిలుస్తున్నాం. పౌరాణిక మతవికాసంతోనే దేవతల విగ్రహాలు, దేవాలయాలు, దేవాలయనిర్మాణశిల్పం మొదలైనవి ఆరంభమై వికసించినవి. వైదికమతంలో ప్రకృతి శక్తులనే ఆరాధించి యజ్ఞక్రియల ద్వారా ఆ దేవతలకు హవిస్సులను అర్పించారే కాని ప్రకృతి శక్తులకు అధిష్ఠాతలైన అగ్ని వరుణాదులకు విగ్రహకల్పన చేయబడలేదు.

పురాణాల సంఖ్య

మత్స్య శివపురాణాలను బట్టి మొదట ఒకే ఒక్క పురాణం వుండేదని, తర్వాత దాని నుంచి వివిధ పురాణాలు ఆవిర్భవించినవని తెలుస్తున్నది. ఇప్పుడు పురాణాలను రెండుగా విభజిస్తున్నారు. మహాపురాణాలు, ఉపపురాణాలు. ప్రసిద్ధమైన మహాపురాణాలు- మత్స్య, మార్కండేయ, భవిష్య, భాగవత, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, బ్రాహ్మ, వరాహ, వామన, వాయు (దీనికే శివపురాణమని పేరు), విష్ణు, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కంద. మహాపురాణాలు ఏవి అన్న నిర్ణయంలో అభిప్రాయ భేదాలు కన్పిస్తున్నా మహాపురాణాలు 18 అని ప్రసిద్ధి. విష్ణుపురాణంలో అష్టాదశ పురాణాల సూచి, క్రమం ఇట్లా ఇయ్యబడింది. బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, భాగవత, నారద, మార్కండేయ, అగ్ని, భవిష్య, బ్రహ్మవైవర్త, లింగ, విష్ణు, వరాహ, స్కంద, వామన, కూర్మ, మత్స్య, వరుణ, బ్రహ్మాండ.

భాగవతం అన్నప్పుడు విష్ణు, కృష్ణుల భక్తి మాహాత్మ్య చరిత్రలను చెప్పే భాగవతమా లేక దేవీ మాహాత్మ్యాన్ని చెప్పే దేవీభాగవతమా అనే విషయంలో తర్జన భర్జనలు జరిగినవి. దేవీమాహాత్మ్యాన్ని చెప్పే దేవీభాగవతపురాణమే అష్టాదశపురాణాలల్లో చేరుతుంది కాని కృష్ణుని లీలలను వర్ణించే భాగవతం కాదని కాశీనాథ భట్టు మొదలైన పండితుల అభిప్రాయం. దేవీభాగవతమే ప్రామాణికమైందని, అదే "ఆర్ష"మని నిర్ణయిస్తు కాశీనాథభట్టు "దుర్జనముఖ చపేటిక" అనే గ్రంథాన్ని రచించాడు. భాగవతాన్ని వోపదేవుడనే వైయాకరణుడు వ్రాసాడని ఒక వాదం వున్నది. భట్టోజి దీక్షితుని శిష్యుడు రామాశ్రమ పండితుడు భాగవతం వోపదేవకృతం కాదని అది ఆర్షమని, అదే మహాపురాణాలల్లో చేరుతుంది కాని దేవీభాగవతం కాదని "దుర్జనముఖ చపేటిక" గ్రంథాన్ని ఖండిస్తూ ఒక గ్రంథాన్ని రాసాడు. మరొక పండితుడు ఈ ఖండన గ్రంథాన్ని ఖండిస్తు దేవీభాగవతమే మహాపురాణాలల్లో పరిగణింపదగిందని "దుర్జన ముఖ పద్మపాదుక' అనే గ్రంథాన్ని వ్రాసాడు. రామానుజాచార్యులు విష్ణుపురాణాన్నే కాని భాగవతాన్ని అధికారికం (authority) గా తీసుకోకపోవటంచేత అప్పటికది బాగా ప్రచారంలోకి రాలేదని, కాబట్టి తద్రచనాకాలం క్రీ.శ. 10-12 శతాబ్దాల నడుమ కావచ్చునని నిర్ణయించవచ్చునని పండితవిమర్శకుల అభిప్రాయం. మిగతా పురాణాల కన్న భాగవతంలో వస్త్వైక్యత, సాహిత్యపు విలువలు కన్పిస్తున్నవనటంలో సందేహం లేదు. దాని రచనాపద్ధతి కూడా మిగతా పురాణాల కన్న కొంత భిన్నంగా వున్నదనటం స్పష్టం. పద్దెనిమిది మహాపురాణాలల్లో 7 ఐతిహాసిక వృత్తాంతాలను కూడా చెప్తున్నవి. మిగిలినవి కేవలం ధార్మిక విషయాలను ప్రతిబింబింపజేసేవి. కొన్నిటిలో కేవలం వ్రతాలు, క్షేత్రమాహాత్మ్యాలు, తత్సంబంధి కథలు మాత్రమే వున్నవి. అష్టాదశ పురాణాలను మూడు విధాలుగా విభజించటం కన్పిస్తున్నది - విష్ణువు ఆధిక్యతను చెప్పే పురాణాలు. వీటిని సాత్త్విక పురాణాలని అంటారు. అవి - విష్ణు, నారద, భాగవత, గరుడ, పద్మ, వరాహ పురాణాలు. శివుని ఆధిక్యతను చెప్పేవి. వీటిని తామసపురాణాలని అంటారు. అవి - మత్స్య, కూర్మ, లింగ, శివ, స్కంద, అగ్ని పురాణాలు. బ్రహ్మ ఆధిక్యతను చెప్పేవి. వీటిని రజోపురాణాలని అంటారు. అవి- బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, మార్కండేయ, భవిష్య, వామన, బ్రహ్మ పురాణాలు.

గరుడ పురాణంలో ఉపపురాణాల పేర్లు ఈ విధంగా ఇయ్యబడినవి. సనత్కుమార, స్కాంధ, శివధర్మ, ఆశ్చర్య, నారదీయ, కాపిల, వామన, ఔశనస, బ్రహ్మాండ, వారుణ, కాశిక, మాహేశ్వర, సాంబ, సౌర, పారాశర, మారీచ, భార్గవ పురాణాలు. దేవీభాగవతంలో ఇయ్యబడిన ఉపపురాణాల పేర్లు భిన్నంగా వున్నవి. అవి - స్కాంద, వామన, బ్రహ్మాండ, మారీచ, భార్గవ పురాణాల స్థానంలో శివ, మానవ, ఆదిత్య, భాగవత, వాశిష్ఠ పురాణాలు.

ఇంకా వివిధ పురాణాల్లో ఇయ్యబడిన పేర్లను బట్టి ఉపపురాణాల సంఖ్య 30 వరకు పోతున్నది - సనత్కుమార, నరసింహ, నారదీయ, శివధర్మ, దుర్వాస, కపిల, మానవ, ఉషనస, వారుణ, కాళికా, సాంబ, నందికేశ్వర, సౌర, పారాశర, ఆదిత్య, బ్రహ్మాండ, మాహేశ్వర, భాగవత, వాశిష్ఠ, కౌర్మ, భార్గవ, ఆది, ముద్గల, కల్కి, దేవి, మహాభాగవత, బృహద్ధర్మ, పరానంద, పశుపతి, హరివంశ పురాణాలు. వీటిల్లో హరివంశపురాణం మహాభారతానికి ఖిలపర్వంగా అంగీకరింపబడుతున్నది. ఉపపురాణాలల్లో ఎక్కువ క్షేత్ర, దేవతల మాహాత్మ్యాలు, వ్రతపూజావిధానాలు, దేవతాస్తోత్రాలు వున్నవి.

పురాణాల రచనాకాలం

పురాణాల ప్రాచీనతనుగూర్చి చర్చించేటప్పుడు కొంతవరకు పురాణాల రచనాకాలాన్ని గూర్చి చర్చించివున్నాం. కాని ఇక్కడ కొన్ని చారిత్రకాధారాలతో పురాణాల రచనాకాలాన్ని నిర్ణయించడానికి పూనుకొనటం జరుగుతున్నది. పురాణాల రచనాకాలాన్ని నిర్ణయించటానికి కొన్ని విషయాలు మనకు తోడ్పడుతున్నవి - 1) కుమారిలభట్టు, శంకరాచార్యులు (క్రీ.శ. 8, 9 శతాబ్దాలవారు) పురాణాలను గూర్చి చర్చించారు. బాణుడు (క్రీ.శ. 7వ శ॥) కాదంబరి, హర్షచరిత్రల్లో పౌరాణికులను గూర్చి ప్రసంగించాడు మరియు వాయుపురాణ పఠనాన్ని గూర్చి పేర్కొన్నాడు. దీన్నిబట్టి ఆ కాలంనాటికి పురాణాలున్నవని, వాటిని జనులకొరకు చదివే పౌరాణికులుండేవారని, ప్రజలు పురాణాలను జ్ఞానం కొరకేకాక శ్రద్ధాభక్తులతో తమ అభీష్టసిద్ధికై చదివేవారు, వినేవారని తెలుస్తున్నది. కాదంబరిలోని చంద్రాపీడుని తల్లి సంతానప్రాప్తి కొరకు పురాణ శ్రవణానికి పోయేదని బాణుడు చెప్పాడు.

2. విష్ణు పురాణంలో మౌర్య రాజుల, మత్స్య పురాణంలో ఆంధ్రరాజుల, వాయుపురాణంలో గుప్తరాజుల ప్రశంస వున్నది. ఒక్కొక్క రాజు ఎన్ని సంవత్సరాలు పరిపాలించాడనే విషయాన్ని కూడా ఈ పురాణాలు పేర్కొంటున్నవి. దీన్ని బట్టి ఈ పురాణాలు ఆయా రాజవంశాల కాలంలో వ్రాయబడినవని చెప్పవచ్చును.

3. పురాణాలల్లో మహాభారతంలోని ఆఖ్యానాలు వున్నవి వున్నట్లుగా చెప్పబడినవి. దీన్ని బట్టి పురాణాలు మహాభారతం తరువాతి రచనలని మాక్ డొనెల్ నిర్ణయించాడు.

4. కౌటిల్యుని అర్థ శాస్త్రంలో పురాణాల ప్రసక్తి కన్పిస్తున్నది. రాజకుమారులకు పురాణాల జ్ఞానం అవసరమని అతడు చెప్పాడు.

5. సూత్ర గ్రంథాలల్లో పురాణ సంహితల ప్రసక్తి వున్నది. వాటి నుంచి ఉద్ధరణలు కూడ ఇయ్యబడినవి. ఆపస్తంబ ధర్మసూత్రంలో పురాణాల నుంచి ఉద్ధరణలు వున్నవి.

గౌతమ ధర్మసూత్రంలో రాజులు న్యాయనిర్ణయంలో పురాణాలను కూడా అధికార గ్రంథాలుగా గ్రహించాలని చెప్పబడింది.

6. ఉపనిషత్తుల్లో ఇతిహాస పురాణ ప్రసక్తి వున్నది. అవి పంచమవేదంగా కూడ అంగీకరింపబడినవి.

7. అథర్వ సంహితలో చతుర్వేదాల తర్వాత పురాణాల ఉత్పత్తి జరిగిందని చెప్పబడింది.

ఈ విధంగా పురాణ రచనా సంప్రదాయం వైదిక సాహిత్య యుగం వరకు పోతున్నది. అయితే పురాణాలల్లో గుప్త వంశ ప్రశస్తి, హర్షవర్ధనుని ప్రసక్తి వుండటం చేత క్రీ.శ. 7వ శతాబ్దం నాటివరకు ప్రముఖమైన పురాణాల కూర్పు జరుగుతూనే వున్నదని చెప్పవచ్చును. క్రీ.శ. 7వ శతాబ్దం తర్వాత కూడ పురాణాలు రచింపబడక పోలేదు.

ఋషి వంశాలకు సంబంధించిన బిరుదావళి వేదాల్లో వుండగా రాజవంశాల బిరుదావళి పురాణాలల్లో వున్నదని పార్జిటర్ అభిప్రాయం. "ఏనిషంట్ ఇండియన్ హిస్టారికల్ ట్రాడిషన్స్" అన్న గ్రంథంలో పార్జిటర్ భారతీయచరిత్ర రచనలో పురాణాలకు మహత్త్వ పూర్ణమైన స్థానాన్నిచ్చాడు. పురాణాల రచనా సంప్రదాయం విలక్షణమైంది. ఈజిప్టు, సుమేరియన్ వ్రాతలు గాని గ్రీకు, రోమనుల వ్రాతలు గాని వారి వారి సంప్రదాయానుసారం చరిత్రను చెప్తున్నవి. వాటికి భిన్నమైన ఒక విలక్షణమైన పద్ధతిలో పురాణాలు వ్రాయబడినవి. ప్రత్యేకమైన భారతీయుల పురాణాల సంప్రదాయాన్ని అర్థం చేసుకోలేనివారు వాటిల్లో చరిత్ర లేదని, అవన్ని ఒట్టి కల్పనలని అంటున్నారు. పురాణాల సంప్రదాయ పద్ధతిని అవగాహన చేసుకొని భారతీయ చారిత్రక సత్యాలను నిర్ణయించవలసిన అవసరం ఇంకా ఎంతో వున్నది. పురాణాలల్లో పేర్కొనబడిన జాతులు, వంశాలు, వంశచరిత్రలు, రాజులు, రాజవంశచరిత్రలు, రాజ్యాలు, జనపదాలు ఎన్నో పరిశీలింపవలసిన అవసరం వున్నది. పురాతత్త్వ ఆధారాలు లేవని, పురాణాలల్లో చెప్పబడిన చారిత్రక విషయాలెన్నో అబద్ధాలని, కల్పితాలని, అతిశయోక్తులని తోసిపుచ్చబడినవి. కాని పురాతత్త్వ వస్తుప్రాప్తితో వాటిల్లో కొన్ని విషయాలు చారిత్రక సత్యాలని పునఃపరిశీలింప బడిన ఘట్టాలు కూడ వున్నవి. అట్లాంటప్పుడు పురాణాలల్లోని చారిత్రక విషయాలు సత్యాలు కావని పూర్తిగా నిరాకరించటం సమంజసం కాదు. ఏదో ఒకనాడు పురాతత్త్వ వస్తువుల సహాయంతో పురాణాలల్లోచెప్పబడిన విషయాలు సంపూర్ణ సత్యాలుగా బయటపడగలవని ఆశించవచ్చును. పురాణాలల్లో ఒక్కొకసారి విషయాలు విభిన్నంగా, పరస్పర విరుద్ధంగా చెప్పబడక పోలేదు. అంటె కొన్ని విషయాలల్లో అభిప్రాయభేదం వున్నది. మరియు రాజుల, రాజ్యాల చరిత్రలు

ఒక్కొకసారి కల్పితేతివృత్తాలవలె అద్భుతంగా చెప్పబడినవి. ఇంకా కొన్ని సార్లు చెప్పే విషయంలో అస్పష్టత, గందరగోళం లేక పోలేదు.

వి.ఏ. స్మిత్ అనుసారం విష్ణుపురాణం మౌర్యవంశ క్రమాన్ని (క్రీ.పూ. 374-190). మత్స్య పురాణం ఆంధ్రవంశ క్రమాన్ని (క్రీ.పూ. 212-క్రీ.శ. 338), వాయుపురాణం గుప్తవంశ క్రమాన్ని (క్రీ.శ. 275-510) చాల చక్కగా సత్యంగా వివరిస్తున్నవి. ప్రసిద్ధమైన ఈ వంశాల, రాజుల చరిత్రలే కాక శూద్ర మ్లేచ్ఛరాజుల అంటే ఆభీర, గర్దభ, శక, యవన, తుషార, హూణవంశ రాజులను గూర్చి కూడ పురాణాలు చెప్తున్నవి. హిందూ మతాన్ని అంటే వైదిక, పౌరాణిక మతాన్ని అంగీకరించి అనుష్ఠించి, వ్యాపింపజేసిన రాజుల చరిత్రలను పురాణాలు చెప్తున్నవి. హిందూమతం కాక జైన, బౌద్ధామతాలను అనుష్ఠించి వ్యాపింపజేసిన రాజులను ఒకొకసారి పేర్కొన్నా వారి చరిత్రలకు పురాణాలు ప్రాధాన్యాన్ని ఇయ్యలేదు. ఒకొకసారి వైదికేతరమతాలను అనుసరించిన రాజులను దుర్మార్గులుగా, రాక్షసాంశ సంభూతులుగా కూడ పురాణకారులు చిత్రించారు. ఒకొకసారి భారతీయ చరిత్రలో అంతగా ప్రాముఖ్యం వహించని రాజుల, రాజవంశాల చరిత్రలను గొప్పగాచేసి వర్ణించారు. ఆ రాజులు వైదిక మతానుయాయులు కావటమే దానికి ప్రధాన కారణమని చెప్పవచ్చును.

పార్జిటర్ పురాణ గ్రంథాలను బాగా అధ్యయనం చేసినవాడు. ప్రదానమైన పురాణాలన్ని క్రీస్తు శకారంభం నాటికే వ్రాయబడినవని అతడు అభిప్రాయపడినాడు. క్రీ.శ. 2వ శతాబ్దం నాటికి పురాణాల రచన సమాప్తమైందని బాల గంగాధర తిలక్ అభిప్రాయం. అట్లా పూర్తి అయినట్లయితే హర్షవర్దనుని నాటి వరకు గల రాజవంశాల చరిత్రలు వాటిల్లో వుండటం అసంభవమౌతుంది. పురాణాలల్లో అగ్ని పురాణం అన్నిటికంటే ప్రాచీనమైందని చాలామంది పండితుల అభిప్రాయం. విమర్శకులు దాని రచనాకాలం విషయంలో భిన్నాభిప్రాయాలు కలిగి వున్నారు. కాణే అగ్ని పురాణం క్రీ.శ. 700 నాటి రచన అని, దానిలోని కావ్యశాస్త్ర సంబంధి విషయాలు క్రీ.శ. 900 తర్వాత చేర్చబడినవని అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అగ్ని పురాణంలోని కావ్యశాస్త్ర సంబంధి విషయాలు దండి తర్వాత, ఆనందవర్ధనునికి పూర్వం క్రీ.శ. 9వ శ॥ ప్రాంతంలో వ్రాయబడినవని సుశీలకుమార్ డే అభిప్రాయం. కన్హయ్యాలాల్ పోద్దార్ అగ్ని పురాణంలోని కావ్యశాస్త్ర విషయాలు విలక్షణంగా వున్నవని, ఆ భాగం నాట్యశాస్త్రం తర్వాత భామహ దండ్యాదులకు పూర్వమే వ్రాయబడినవని అన్నాడు. హజారా పురాణాలను గూర్చి చాల కృషి చేసినవాడు. అతడు మార్కండేయ, బ్రహ్మాండ, విష్ణు, మత్స్య, భాగవత, కూర్మ పురాణాలు ప్రాచీనమైన మహాపురాణాలని గంభీర పరిశోధన పూర్వకంగా స్థాపించాడు. విష్ణుపురాణం క్రీ.శ. 400, వాయు పురాణం క్రీ.శ. 500, భాగవత పురాణం క్రీ.శ. 600-700, కూర్మ పురాణం క్రీ.శ.

700 ప్రాంతంలో వ్రాయబడినవని అతడు చెప్పాడు. అగ్ని పురాణం క్రీ.శ. 800 ప్రాంతం రచన అని, కాని దానిలోని కొన్ని భాగాలు ప్రాచీనమైనవని అతడు అంగీకరించాడు. నారదీయ, బ్రహ్మ పురాణాలు క్రీ.శ. 10వ శ॥ రచనలు అని మూల నారదీయ పురాణం ఇప్పుడు అలభ్యమైనా అది క్రీ.శ. 10 వ శ॥ నాటి కూర్పు అని అతని అభిప్రాయం. స్కంద పురాణం క్రీ.శ. 8వ శ॥ నాటి రచన అని దానిలోని కొన్ని భాగాలు అర్వాచీనాలైనవని హజారా అభిప్రాయం. గరుడ పురాణం క్రీ.శ. 10వ శ॥లో పద్మ పురాణం క్రీ.శ. 1200-1500 నడుమ వ్రాయబడినవని అతని అభిప్రాయం. బ్రహ్మ వైవర్త పురాణం క్రీ.పూ. 700 నాటి రచన అయినా ప్రస్తుత రూపం క్రీ.శ. 16వ శ॥లో ఏర్పడిందని హజారా అభిప్రాయం. ఈ పురాణం మీద జయదేవుని గీతగోవిందం ప్రభావం కన్పిస్తున్నదనీ, దీనిలో క్రీ.శ. 16 శతాబ్దం నాటి సాంఘిక జీవనం ప్రతిబింబించి కన్పిస్తున్నదని పండితుల అభిప్రాయం. విష్ణు ధర్మోత్తర పురాణం రచన క్రీ.శ. 7వ శ॥లో జరిగిందని, ఇది కాశ్మీర దేశంలో వ్రాయబడిందని బ్యూలర్ అభిప్రాయం. నృసింహపురాణం క్రీ.శ. 400-500 నడుమ, సౌరపురాణం క్రీ.శ. 950-1050 నడుమ వ్రాయబడినవని విద్వాంసుల అభిప్రాయం.

ఇదంతా పరిశీలించినట్లయితే మూలపురాణవిద్య వేదకాలంలోనే ఆరంభమైందని, కాని ఆ విద్య మౌఖికరూపంలోనే వుండేదని లిఖితరూపంలో అవి క్రీ.శ. 400 ప్రాంతం నుంచి రూపొందుతూ వచ్చి క్రీ.శ. 16వ శ॥ వరకు కొనసాగినవని చెప్పవచ్చును. మొదట ఒకటి రెండు గ్రంథాల రూపంలో వున్న పురాణాలు భిన్న భిన్న కాలాల్లో భిన్న భిన్నమైన పేర్లతో వ్రాయబడుతూ విస్తరించినవి. మౌఖికంగా వున్న ఒక పురాణం అనేక ప్రక్షిప్తాలతో విస్తరింపబడి మరొక పేరుతో మరొక పురాణంగా వికసించేది. వ్రాతసామగ్రి అభివృద్ధి చెందింతర్వాత పురాణాలు వ్రాత రూపాన్ని సంపాదించుకొన్నవి. అయినా అప్పుడు కూడ స్థిరరూపాన్ని ధరించలేదు. కాలక్రమంగా ప్రక్షిప్తాలతో ప్రాచీన పురాణాలు పెరగటమే కాక కొత్త కొత్త పురాణాలుగా కూడ క్రీ.శ. 11వ శతాబ్దం వరకు రూపొందుతూనే వున్నవి. ఆ తర్వాత వాటి రచనల ఉద్ధృతత్వం తగ్గినా ఆగిపోలేదు. క్రీ.శ. 16వ శతాబ్దం వరకు వాటిల్లో ప్రక్షిప్తాలు, చేరుతూనే వున్నవని చెప్పవచ్చును.

పురాణ లక్షణాలు

పురాణం పంచలక్షణమని ప్రసిద్ధం. మహా పురాణాలల్లో చెప్పబడిన ఐదు విషయాలు ఇవి - సర్గ (సృష్టిజ్ఞానం), ప్రతిసర్గ (పునఃసృష్టి), వంశ (ఋషుల వంశావళి), మన్వంతర (విభిన్న మనువుల కాలగణన), వంశానుచరిత్ర (సూర్యచంద్ర వంశజుల చరిత్ర)-

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్.

పై ఐదు విషయాలేకాక పురాణాలల్లో శివ, విష్ణు పారమ్యాలను చెప్పే అనేక కథలు, ఆ దేవతల మహిమలు తర్వాత వర్ణాశ్రమధర్మం, శ్రాద్ధాదికర్మలు, వ్రతనియమ మాహాత్మ్యాలు, సాంఖ్యయోగాదిదర్శన సిద్ధాంతాలు వివరింపబడినవి. మొదట పురాణం అంటే పైన పేర్కొన్న సృష్టిప్రతిసృష్టుల విధం, ఋషుల, రాజుల వంశ చరిత్రలు, మన్వంతర వృత్తాంతాలు మాత్రమే వుండేవి కాని తర్వాత తర్వాత ఆయా దేవతా మాహాత్మ్యాదులు చేర్చబడి విస్తరించినవి కావచ్చును. ప్రాచీనకాలంలో పురాణవిద్య అంటే పై ఐదు విషయాల వివరణయే కావచ్చును. కాని క్రమంగా పురాణాల స్వరూపం మారిపోయి దేవతామహిమ, క్షేత్రవ్రత మాహాత్మ్య ప్రతిపాదకాలు అయినవి. అందుకే మొదట ఒకటి రెండు సంఖ్యతో పరిమితమై పై ఐదు విషయాల వివరణతో కూడిన పురాణాలు రాను రాను ఆయా సాంప్రదాయికుల సిద్ధాంతాలను ప్రతిపాదించేవిగా మారి సంఖ్యలో పెరుగుతూ వచ్చినవి.

పురాణాన్ని ఇతిహాసంగా కూడ పేర్కొంటూ పురాణేతిహాసం లేక ఇతిహాస పురాణం అని అనటం కూడ వున్నది. అసలైతే ఇతిహాసం, పురాణం రెండు భిన్నమైన విషయాలు; అవి రెండు స్వతంత్ర ప్రక్రియలు. శంకర, సాయణాచార్యుల వంటి భాష్యకారులు ఇతిహాసం, పురాణం రెండింటిని భిన్నమైన ప్రక్రియలుగానే పేర్కొన్నారు. వేదాలల్లోని దేవాసుర సంగ్రామాదులు ఇతిహాసమని, సృష్టిక్రియాదులను చెప్పే అంశాలు పురాణమని వ్యాఖ్యాతలు చెప్పారు - "జగతః ప్రాగవస్థామనుక్రమ్య సర్గ ప్రతిపాదకం వాక్యజాతం పురాణమ్" (ఐతరేయ బ్రాహ్మణానుక్రమణిక). దీన్నిబట్టి కూడ సృష్టి ప్రతిసృష్టులను చెప్పేదే పురాణవిద్య అని క్రమంగా దీనిలో సూర్యచంద్ర వంశజుల చరిత్రతో కూడిన ఇతిహాస భాగాలు కూడ అధికంగా చేర్చబడటంచేత పురాణేతిహాసమన్న పేరు వచ్చిందని తెలుస్తున్నది. కాలక్రమంగా పురాణేతిహాసాలల్లో ధార్మికత్వం పెరిగిపోయి అవి ధార్మిక గ్రంథాలుగా రూపాన్ని ధరించినవి. సృష్టి క్రియాదులను చెప్పే రూపంలో పురాణవిద్య వైదికకాలంలో ఆరంభమైవుంటుంది. తర్వాత దీనిలో మన్వంతరాలు, ఋషుల రాజుల వంశ చరిత్రలు చేర్చబడి పురాణేతిహాసాలుగా పరిణమించినవి. తర్వాత దేవతామాహాత్మ్యాదులు చేర్చబడి ధార్మిక గ్రంథాలుగా రూపొందినవి.

పురాణాల కర్త

విష్ణుపురాణంలో చెప్పబడిన కథనుబట్టి వేదవ్యాసుడు పురాణాన్ని నిర్మించి తన శిష్యుడు సూత లోమహర్షణునికి చెప్పాడు. లోమహర్షణుడు తిరిగి పురాణాన్ని తన

ముగ్గురు శిష్యులు అకృతవ్రణ, సావర్ణి, శాంశంపాయనులకు చెప్పాడు. లోమహర్షణుడు చెప్పిన మహాపురాణాన్ని ముగ్గురు శిష్యులు మూడు పురాణ సంహితలుగా వ్యాపింపజేసారు. తర్వాత తర్వాత శిష్య పరంపరలో ఆ మూడు- అష్టాదశ పురాణాలుగా, ఉప పురాణాలుగా విస్తరించినవి. ఈ పురాణ పరంపరలో బ్రహ్మపురాణం మొదటిదని చెప్పబడింది. మరొక కథను అనుసరించి కల్పాంత సమయంలో ఒక్కటే పురాణం వుండేది. దాన్ని బ్రహ్మ ఋషులకు చెప్పాడు. అట్లా బ్రహ్మ బోధించిన పురాణం బృహద్రూపంలో వుండటంచేత మనష్యుల అవగాహనకు దూరమౌతుందని ఆలోచించి వేదవ్యాసుడు 4 లక్షల పరిమితమైన ఆ బృహత్ పురాణాన్ని 18 భాగాలుగా విభాగించాడు. ఆ భాగాలే అష్టాదశ పురాణాలుగా ప్రసిద్ధమైనవి. ఒక్క మూలపురాణ సంహితయే వేదవ్యాసునిచేత 18 భాగాలుగా విభాజితమై అష్టాదశపురాణాలుగా ప్రచలితమైనవన్న వృత్తాంతం దేవీ భాగవతం, భాగవతం, వరాహ, పద్మ పురాణాలల్లో చెప్పబడివున్నది. దీన్నిబట్టి వేదం వలెనే పురాణ విద్య బ్రహ్మ చేత ఇయ్యబడిందని, క్రమ క్రమంగా పురాణ విద్య విస్తరించిందని, వేదవ్యాసుడు విస్తరించిన పురాణాన్ని, వేదాలవలెనే సంపాదీకరించి 18 భాగాలుగా విభాజించాడని చెప్పవచ్చును. పై కథలను బట్టి పురాణాలు కాలక్రమంగా మారుతూ వచ్చినవని ఎన్నో నూతన విషయాలు వాటిల్లో చేరుతూ పోయినవని తెలుస్తున్నది. వేదాలు ఒక అక్షరం మారకుండా ప్రాచీన ఋషులు ప్రకృష్టంగా దాన్ని నిర్మించారు. పదక్రమాది పాఠాది కవచాలను ఏర్పరిచి వేదంలో మార్పు రాకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. కాని పురాణవిద్య లౌకిక విద్య. అందుకే అది కాలానుగుణంగా కొత్త విషయాలను చేర్చుకుంటూ పోయి పెరుగుతూ వచ్చింది. అష్టాదశ పురాణాలను సూక్ష్మంగా పరిశీలించినట్లయితే వాటి వర్ణ్య విషయంలో, నిర్మాణ శైలిలో సామ్యాలు కన్పిస్తవి. అవన్నీ ఒక్క మూల పురాణ సంహిత నుంచి విస్తరించినవే కాబట్టి సామ్యాలు కన్పిస్తున్నవి. ప్రస్తుతం పురాణాలల్లో విభిన్నత కన్పిస్తున్నదంటె వాటిని విస్తరింపజేసిన అజ్ఞాత వ్యక్తులు భిన్న భిన్న సంప్రదాయాలకు చెందినవారు కావటమే కారణం. విష్ణుపురాణం, శివపురాణం, బ్రహ్మపురాణం, దేవీ భాగవతం మొదలైనవి ఆయా సంప్రదాయాల ననుసరించే నామకరణం చేయబడినవి.

జైన పురాణాలు

హిందువుల వలెనే జైనులు, బౌద్ధులు కూడ తమతమ ధార్మిక, దార్శనిక సిద్ధాంతాలను ప్రతిబింబింప జేసే పురాణాలను నిర్మించుకొన్నారు. అష్టాదశ పురాణాల లాగానే జైనుల్లో చతుర్వింశతి పురాణాలున్నవి. ఈ చతుర్వింశతి పురాణాలల్లో వారి చతుర్వింశతి (24) తీర్థంకరుల చరిత్రలు నిబద్ధమైనవి. హిందూపురాణాలవలె జైనపురాణాలు పంచలక్షణ

సమన్వితాలు కావు. " పురాతనం పురాణం స్యాత్తన్మహ దాశ్రయాత్" అంటె పురాణం మహాపురుషుల ప్రాచీన కథలను చెప్పేది అని అర్థం. జైనుల 24 పురాణాల పేర్లు - అది పురాణం, అజిత నాథ పురాణం, సంభవనాథ పురాణం, అభినందపురాణం, సుమతినాథ పురాణం, పద్మ ప్రభపురాణం, సుపార్శ్వపురాణం, చంద్రప్రభపురాణం, పుష్పదంతపురాణం, శీతలనాథ పురాణం, శ్రేయాంశపురాణం, వాసుపూజ్యపురాణం, విమలనాథ పురాణం, అనంతజిత పురాణం, ధర్మనాథ పురాణం, శాంతినాథ పురాణం, కుంథునాథ పురాణం, అరనాథ పురాణం, మల్లినాథ పురాణం, మునిసువ్రత పురాణం, నేమినాథ పురాణం, నేమినాథ పురాణం, పార్శ్వనాథ పురాణం, సమ్మతి పురాణం. ఈ 24 పురాణాలల్లో ఆదిపురాణం, పద్మప్రభ పురాణం, అరిష్టనేమి పురాణం (దీనికే హరివంశపురాణమని పేరు), ఉత్తరపురాణం సుప్రసిద్ధమైనవి. వీటిల్లో ఆది, ఉత్తరపురాణాలు జైనులకు విశేషమహత్త్వ పూర్ణమైనవి.

ఆది పురాణంలో జైనులకు ప్రథమతీర్థంకరుడైన ఋషభదేవుని చరిత్ర వున్నది. అతని జీవిత విశేషాలకు సంబంధించిన కథలెన్నో దీనిలో నిబద్ధింపబడినవి. ఋషభదేవుడు ఇక్ష్వాకువంశరాజు. నాభిరాజుకు మరుదేవి రాణికి జన్మించినవాడు. ఋషభదేవుడు 84 లక్షల సంవత్సరాలు జీవించి మోక్షప్రాప్తిని చెందాడట. భాగవతంలో కూడ ఇతని మహిమగాథ చెప్పబడింది. భాగవతంలో భగవంతుని 22 అవతరాలు గణింపబడినవి. అప్పుడు 22 అవతారాలల్లో ఋషభ దేవుడు ఎనిమిదవ అవతారంగా చెప్పబడినాడు. ఋషభదేవుని భార్య ఇంద్రుని కూతురు జయంతి అని చెప్పబడింది. ఆమెవల్ల అతనికి భరత, కృశాశ్వ మొదలైన నూరుగురు కుమారులు ధర్మాత్ములు, వేదజ్ఞులు, భాగవత ధర్మానుయాయులైన వారు జన్మించారు. ఋషభదేవుడు కూడ భగవద్గుణ సంపన్నుడుగా చెప్పబడినాడు. ఆదిపురాణంలో 47 పర్వాలున్నవి. దీని రచయిత జినసేనుడు. పురాణారంభంలో కవి నయకేశరి, సిద్ధసేన. వాదిచూడామణి, సమంతభద్ర, శ్రీదత్త, యశోభద్ర, చంద్రోదయకర, ప్రభాచంద్ర, మునీశ్వర, శివకోటి, జటాచార్య, కథాలంకార కార, కాణభిక్షు, కవితీర్థ, భట్టారక, వీరసేన, జయసేన మొదలైన గురుజనులను స్మరించాడు. దీనివల్ల ఆదిపురాణ రచనా కాలాన్ని నిర్ణయించవచ్చును. ఈ పురాణంలో శంకరుని అద్వైత ఖండన కన్పిస్తున్నదని కాబట్టి ఇది అతని తర్వాతి రచన అని పండితుల అభిప్రాయం. క్రీ.శ.942 లో కన్నడ కవిపండితుడు కన్నడ భాషలో ఒక ఆదిపురాణాన్ని రచించాడు. అది పూర్తిగా జినసేనుని పురాణానికి అనువాదం కాకపోయినా దాన్ని అనుసరించినటువంటిది. కాబట్టి క్రీ.శ. 942 కి పూర్వమే ఆదిపురాణ రచన జరిగిందని చెప్పవచ్చును.

ఆదిపురాణం యొక్క ఉత్తర భాగమే ఉత్తర పురాణం. జినసేనుడు ఆదిపురాణంలో 44 పర్వాలు వ్రాసిం తర్వాత పరమపదించాడు. ఆ తర్వాత మూడు పర్వాలను మరియు చివరి భాగమైన జినచరిత్రను అతని శిష్యుడు గుణభద్రుడు వ్రాశాడు. దానికే ఉత్తర పురాణమని పేరు. ఇది జైనుల 24 పురాణాలకు సారరూపమైంది. అంటే దీనిలో అన్ని పురాణాల సారం కన్పిస్తున్నది. దీనిలో రెండవ తీర్థంకరుడు అజితనాథుని మొదలుకొని మహావీరుని వరకు గల తీర్థంకరులను గూర్చిన కథలు వున్నవి.

జైన బౌద్ధ పురాణాల్లో ఎక్కువ అతిశయోక్తులు లేవని చెప్పవచ్చును. ముఖ్యంగా చారిత్రక సంఘటనలను చెప్పేటప్పుడు వారు సత్యానికి సమీపంగా వున్నారు. తేదీలు సంవత్సరాలు చెప్పేటప్పుడు కూడ వారు చెప్పినవి విశ్వసనీయంగా వున్నవి. అందుకే రాధాకుముద ముఖర్జీ వంటి భారతీయ చరిత్రకారులు ప్రాచీన భారతదేశ చరిత్ర నిర్మాణంలో బౌద్ధ జైన రచనలను విశ్వాసపాత్రమైన ఆధారాలుగా తీసుకొన్నారు.

మహాభారతం

ప్రపంచ సాహిత్యంలోని ఐతిహాసిక కావ్యాలల్లో (Epics) మహాభారతం అతివిశాలమైంది. గ్రీకుభాషలోని ఇలియడ్, ఒడిస్సీ అన్న ఐతిహాసిక మహాకావ్యాలను రెండింటిని కలిపినా అవి మహాభారతం కన్న చిన్నవే. ప్రాచీన జర్మన్ భాషలోని నిబిలుంగెన్, పర్షియన్ భాషలోని షానామాలకన్న మహాభారతం విశాలమైందేకాక అతి ప్రాచీనమైంది. మహాభారతంలో లక్షకుపైగా శ్లోకాలున్నవి. బొంబాయి మహాభారత సంస్కరణ ప్రతిలో ఒక లక్ష మూడువేల ఐదువందల యాభై శ్లోకాలున్నవి. కలకత్తా సంస్కరణప్రతిలో ఒక లక్ష ఏడువేల నాలుగు వందల ఎనభై శ్లోకాలున్నవి. వీటిల్లో హరివంశం కూడ చేరివున్నది. ఇంతటి బృహద్రూపం ప్రపంచంలో మరే కావ్యానికి లేదు. మహాభారతానికి మొదట ఇయ్యబడిన పేరు "జయ" అని దానిలోని మంగళాచరణ శ్లోకమే చెప్తున్నది.

"నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్."

పాండవుల విజయగాథ దీనిలో చెప్పబడటంచేత మహాభారతానికి "జయ' ' అని నామకరణం చేయబడిందేమో! "జయ" ఇతిహాసానికి కొంతకాలం తర్వాత "భారత"మని పేరు ప్రచారంలోకి వచ్చింది. భరత వంశీయులైన కౌరవ పాండవుల కథ దీనిలో చెప్పబడటంచేత దీనికి భారతమనే పేరు కలిగింది. అదే కారణం ఆదిపర్వంలో చెప్పబడింది - "భరతానాం మహజ్జన్మ మహాభారత ముచ్చతే" (ఆది 62-39) " భరతానాం యతశ్చాయ మితిహాసో మహాద్భుతః" (ఆది 62-40) కాలక్రమంగా వివరణకొరకు అనేక నైతిక ఆఖ్యానాదులు, ధర్మోపదేశాలు మొదలైనవి చేర్చబడి భారతం విశాలకాయాన్ని సంతరించుకొన్నది. అప్పుడు దానికి "మహాభారత" మనే పేరు వచ్చింది. పాణిని (క్రీ.పూ. 5వ శ॥) అష్టాధ్యాయిలో భారత, మహాభారతాలను రెండింటిని గూర్చి ప్రసంగించటంచేత అప్పటికే భారతం మహాభారత రూపాన్ని ధరించిందని చెప్పటానికి వీలవుతున్నది. జయేతి హాసంలోని

8800 శ్లోకాలు భారతంలో 24000 శ్లోకాల వరకు పెరిగినవి. ఇక మహాభారతంలో లక్ష శ్లోకాలకు పైగా వున్నవి. దీన్ని బట్టి జయేతిహాసం కాల క్రమంగా ఎంతగా పెరిగిందో తెలుసు-్నది.

మహాభారత రచయిత

జయేతిహాసాన్ని రచించింది వేదవ్యాసుడనటంలో ఏమి సందేహం లేదు. అతడు గ్రంథకర్తే కాక ప్రత్యక్షంగా కౌరవపాండవులకు బంధువు. వ్యాసుడు సత్యవతి, పరాశరులకు జన్మించినవాడు. సత్యవతి దాశరాజు కూతురు. ఆమెకు మత్స్యగంధి అని పేరు. పరాశరుడు ఆమె మత్స్యవాసనను పోగొట్టి సువాసన కలదానిగా చేసాడు. అప్పుడు ఆమెకు యోజనగంధి అని పేరు కలిగింది. ఆమెను తర్వాత కురురాజు శంతనుడు వివాహమాడాడు. అప్పుడు ఆమె పేరు సత్యవతి అయింది. పరాశరుడు గొప్ప ఋషి. ఆ ఋషికి సత్యవతికి వ్యాసుడు ఒక ద్వీపంలో జన్మించాడు. అందుకే అతనికి "ద్వైపాయను" డని పేరు. 'కృష్ణ' అన్నది అతని అసలు పేరు. వేదవిభజన చేయటం చేత అతనికి "వేదావ్యాసు" డని పేరు వచ్చింది. వ్యాసుడు సద్యోగర్భంలో పుట్టినవాడు. పుట్టుకతోనే పండితుడు. కావ్యంలోని సంఘటనలను వ్యాసుడు ప్రత్యక్షంగా చూచినవాడు. మహాభారతంలో అనేక సందర్భాలల్లో అతడు రంగస్థలంపైకి ప్రవేశిస్తాడు. పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు వ్యాసుడు వారి దగ్గరికి పోయి ఉపదేశం చేసి వారిని ఆశ్వస్తులను చేస్తాడు. పాశుపత ప్రాప్తికై ఉపాయాన్ని చెప్తాడు. దుర్యోధనునికి యుద్ధం చేయవద్దని నచ్చచెప్తాడు. కురుక్షేత్ర యుద్ధ సమయంలోను వ్యాసుడు చాలసార్లు కనిపిస్తాడు. యుద్ధానంతరం ధర్మరాజుకు వ్యాసుడు ఆశ్వాసనమిచ్చి అతన్ని శరీరత్యాగ ప్రయత్నం నుంచి మరలించి, రాజోచిత కర్తవ్య పాలనను బోధిస్తాడు. వ్యాసుని తపః ప్రభావం చేత కురుక్షేత్ర యుద్ధంలో మరణించిన కౌరవ పాండవ వీరులు గంగాజలాలల్లో కనిపిస్తారు. కృష్ణ ద్వైపాయనుడని పేరుగల వేద వ్యాసుని చేత వ్రాయబడటం చేత మహాభారతానికి "కార్ష్ణవేద" మని కూడ పేరు.

అక్షుద్రాన్ దాన శీలాంశ్చ సత్య శీలా నథాస్తికాన్
కార్ష్ణం వేదమిమం విద్వాన్ శ్రావయిత్వార్థమశ్నుతే

అది 61-18

సమస్త వేదోపనిషత్తుల జ్ఞానరహస్యాలను, సమస్త శాస్త్రసారాన్ని ఈ మహాకావ్యంలో గుప్త పరిచానని వ్యాసుడే స్వయంగా బ్రహ్మతో ఇట్లా అంటాడు-

బ్రహ్మన్ ! వేద రహస్యంచ యచ్చాన్యత్ స్థాపితం మయా
సాంగోపనిషదాం చైవ వేదానాం విస్తర క్రియా. అది 1-62

అంతేగాక ఇతిహాస పురాణాలను మథించి వాటి సారాన్ని దీనిలో పొందు పరచాడట! భూత వర్తమాన భవిష్యత్తుల వర్ణనలు కూడ దీనిలో వున్నవట!

ఇతిహాస పురాణానా ముమ్మేషం నిర్మితం చ యత్
భూతం భవ్యం భవిష్యం చ త్రివిధం కాలసంజ్ఞితమ్. ఆది 1-63

మహాభారతంలో ప్రధానంగా కౌరవ పాండవుల చరిత్ర వున్నా సందర్భానుకూలంగా దేవతల, మహర్షుల, చక్రవర్తుల, మనువుల, గంధర్వ, రాక్షసుల చరిత్రలు కూర్చబడినవి. ధర్మ స్వరూప దర్శనం దీనిలో చేయబడింది. పుణ్యక్షేత్రాల, వన పర్వత నదుల, సముద్రాల మాహాత్మ్య ప్రతిపాదన కూడ దీనిలో వున్నది. అందుకే మహాభారతమొక జ్ఞాన భాండాగారం వంటిది. అది ఒక విశ్వకోశం వంటిది. విజ్ఞాన సర్వస్వం వంటిది.

యథా సముద్రో భగవాన్ యథా మేరుర్మహా గిరిః
ఉభేఖ్యాతే రత్ననిధీ తథాభారత ముచ్యతే. ఆది 62-48

మహాభారత రచనా కాలం

మూల మహాభారతాన్ని వ్యాసుడు ఎప్పుడు రచించాడన్న విషయాన్ని నిర్ణయించి చెప్పటం కష్టం. అందులో ప్రక్షిప్త భాగాల కాల నిర్ణయాన్ని చేయటం ఇంకా దుస్సాధ్యమైన పని. మహాభారతంలో కనిపించే రాజుల, వంశాల, కొందరు వ్యక్తుల పేర్లు, కథలు వేదకాలంలో ప్రసిద్ధికెక్కినవి వున్నవి కాని అంతమాత్రాన మహాభారతం వేదకాలానికి సంబంధించిందని చెప్పటానికి వీల్లేదని వింటర్‌నిట్స్ అభిప్రాయం. భాషాదృష్టితో పరిశీలిస్తే మహాభారతం వైదిక సాహిత్య యుగానికి అర్వాచీన రచన అని చెప్పవచ్చును. మహాభారత కర్త వ్యాసుడు వేదాలను క్రమపద్ధతిలో విభజించి కూర్పు చేసినటువంటివాడు. ఈ కూర్పు బుక్కుల రచన జరిగిన చాలా కాలానికే జరిగి వుంటుంది. వేద వ్యాసుడు కౌరవ పాండవులకు సమకాలికుడు. కురుక్షేత్ర యుద్ధానంతరం కొద్ది కాలం తర్వాతనే వ్యాసుడు ఈ గాథను రచించి వుంటాడు. కాని కురుక్షేత్ర యుద్ధ కాల నిర్ణయంలోను విమర్శకులల్లో, చారిత్రకులల్లో చాల మతభేదాలున్నవి.

మహాభారత యుద్ధకాలం

వాకాటకవంశానికి చెందిన సర్వసేనుడు (క్రీ.శ. 330-345) ప్రాకృత కావ్యం హరివిజయాన్ని హరివంశం ఆధారంగా రచించాడు. దీన్నిబట్టి మహాభారతం అనుబంధంతో సహా క్రీ.శ. 2వ శతాబ్దం నాటికి ఇప్పటి లక్ష శ్లోక పరివ్యాప్త రూపాన్ని ధరించిందని చెప్పవచ్చును. భాసుడు మహాభారత కథను తీసుకొని మధ్యమవ్యాయోగ, ఊరుభంగాది

నాటకాలను వ్రాసాడు. క్రీ.పూ. 5వ శతాబ్దం నాటి పాణిని నాటికి మహాభారతమున్నది (6-2-38). అశ్వలాయన గృహ్యసూత్రంలో భారతం, మహాభారతం (3-4) రెండు పేర్లు పేర్కొనబడినవి. సాంఖ్యాయన శ్రౌతసూత్రంలో భారతయుద్ధ ప్రసక్తి ఉన్నది. యజుర్వేదానికి చెందిన కాఠక సంహితలో విచిత్ర వీర్య ధృతరాష్ట్రుల పేర్లున్నవి. ఛాందోగ్యోపనిషత్తులో దేవకీపుత్రుడు కృష్ణుడు పేర్కొనబడినాడు. వీటన్నిటినిబట్టి మహాభారత కథ దాదాపు క్రీ.పూ. 10 వ శతాబ్దానికి పూర్వమే జరిగిందని తెలుస్తున్నది. క్రీ.శ. 634 నాటిదైన రెండవ పులకేశి ఐహోళెశాసనంలో భారతయుద్ధ ప్రసక్తి వున్నది.

త్రింశత్సుత్రి సహస్రేషు భారతాహవాదిత:
సప్తాబ్దశతయుక్తేషు గత్వేషబ్దేషు పంచసు
పంచాశత్సు కలౌకాలే షట్సు పంచశతాసు చ
సమాసు సమతీతాసు శకానామపి భూభుజామ్. 33, 34 శ్లోకాలు

క్రీ.శ. 634 నాటికి మహాభారతయుద్ధం జరిగి 3735 సంవత్సరాలు అయిందట. అంటే అప్పుడు మహాభారతయుద్ధం 3735-634 = 3101 క్రీస్తుపూర్వం నాడు జరిగిందని తేలుతున్నది. మహాభారతంలోని అంతస్సాక్ష్యాలను బట్టి ముఖ్యంగా నక్షత్రస్థానాలను బట్టి భారతయుద్ధకాలాన్ని నిర్ణయించటానికి కొందరు ప్రయత్నించారు. భారత యుద్ధారంభ సమయంలో గ్రహాలన్నీ అశ్వినీ నక్షత్రానికి దగ్గరగా ఉన్నట్లు మహాభారతంలో చెప్పబడిందని, ఇటువంటి నక్షత్రస్థితి క్రీస్తుపూర్వం 3101 ప్రాంతంలోనే సంభవించిందని పండితుల అభిప్రాయం. చంద్రగుప్తుని అస్థానంలో ఉన్న గ్రీకు రాయబారి మెగస్థనీసు హెరక్లిస్ అంటే శ్రీకృష్ణుడు సంద్రకొట్టస్ అంటే చంద్రగుప్తునికి 138 తరాల క్రిందవాడని పేర్కొన్నాడు. తరానికి 20 సంవత్సరాలు వేసుకొన్న శ్రీకృష్ణుని సమయం క్రీ.పూ. 3080 అవుతుంది. వరాహమిహిర, కల్హణుల మతానుసారంగా భారతయుద్ధం క్రీ.పూ. 2449 నాడు అయింది. ఆర్యభటానుసారంగా క్రీ.పూ. 3102.

భారత రచన క్రీ.పూ. 3100లో జరిగిందని, క్రీ.పూ. 2000 వరకు సౌతి మొదలైన వారిచే అది మహాభారత రూపాన్ని ధరించిందని సి.వి. వైద్య అభిప్రాయం. బాలగంగాధరతిలక్ అభిప్రాయానుసారం - మహాభారత రచన క్రీ.పూ. 5000 వరకు వెళ్ళింది. కాని పాశ్చాత్యులు మహాభారతానికి ఇంత ప్రాచీనతను ఇయ్యటానికి అంగీకరించలేదు. మహాభారతం జయేతిహాస రూపంగా కూడ వైదిక యుగంలో లేదని వారి నిశ్చితాభిప్రాయం. కాబట్టి భారతీయ సంప్రదాయానుసారం కలియుగ గణన క్రీ.పూ. 3102లో ఆరంభమైనది.

ఆ ప్రాంతంలోనే అంటె అంతకు కొద్దికాలంముందే భారత యుద్ధం జరిగిందని శ్రీకృష్ణుని నిర్యాణంతో ద్వాపరయుగమంతమై కలియుగారంభం జరిగిందని భారతీయ సాంప్రదాయం. దీన్ని పాశ్చాత్యులుగాని, కొందరు భారతీయ విమర్శకులు గాని అంగీకరించటంలేదు. మహాభారతంలో యవన. మ్లేచ్ఛులు చెప్పబడటంచేత అలెగ్జాండరు (క్రీ.పూ. 4వ శ॥) దండయాత్రతోనే భారతీయులకు యవనులతో సంపర్కం కలిగిందని భారతరచన ఆ తర్వాత జరిగిందని కొందరు పాశ్చాత్య విమర్శకులు ఊహ చేసారు. యవనమ్లేచ్ఛులు తర్వాత ప్రక్షిప్తమైన జాతిపేర్లు కావచ్చునని మరికొందరు పాశ్చాత్య విమర్శకులు ఈ వాదాన్ని నిరాకరించారు. మహాభారతంగాని భారతంగాని జయేతిహాసంగాని వైదిక యుగంలో లేకున్నా కొన్ని గాథలు ఆ కాలానికి చెందినవి. దీనిలో పేర్కొన్న కొందరు రాజులు వేదాలల్లో పేర్కొనబడినారని వింటర్‌నిట్స్ అభిప్రాయం. మహాభారతంలోని కథలు కొన్ని రూపాంతరం చెంది బౌద్ధ జైన సాహిత్యంలో చేరినవి. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దానికి పూర్వమే దీని రచన జరిగింది కాని అంతగా ప్రచారం పొందలేదని వింటర్‌నిట్స్ అభిప్రాయం. పురాణాలనుబట్టి యుధిష్ఠరునికి చంద్రగుప్తమౌర్యునికి నడుమ 36 తరాలు గడిచినవి. తరానికి 20 ఏండ్లుతీసుకొన్న 36×20 = 720 ఏండ్లు. చంద్రగుప్తుని కాలం క్రీ.పూ. 322 ప్రాంతం. అప్పుడు 322+720 = 1042 క్రీ.పూ. భారత యుద్ధకాలమని తేలుతున్నది. సాంఖ్యాయన శ్రౌతసూత్రంతో భారత యుద్ధ ప్రసక్తి వున్నది. కాబట్టి సూత్రగ్రంథాల రచనాకాలానికి పూర్వమే భారత రచన జరిగిందని చెప్పాలి. ఇది దాదాపు క్రీ.పూ. 11, 12 శతాబ్దాలని చెప్పవచ్చును. ఈ లెక్క పురాణాల లెక్కకు సరిపోతున్నది. చారిత్రకులు, పురాతత్త్వవేత్తలు మహాభారతకథ ఇనుపయుగానికి చెందిందని అందుచేత భారతయుద్ధం క్రీ.పూ. 1200-1000 ప్రాంతంలో జరిగివుంటుందని అభిప్రాయపడ్తున్నారు. వీరి గణన పురాణాలు చెప్పిన కాలానికి దాదాపుగా సరిపోతున్నది. కాబట్టి కేవలం ఉహలకు తావీయకుండ చారిత్రకుల గణనను మాత్రమే తీసుకుంటె మహాభారత యుద్ధకాలం క్రీ.పూ. 1200-1100 నడుమ జరిగిందని, వ్యాసుడు దాదాపుగా అదే సమయంలో మహాభారత కావ్యాన్ని రచించాడని అంగీకరించవలసి వుంటుంది. క్రీ.శ. 7వ శ॥ నాటికి అంటే బాణుని కాలంలో మహాభారతం దేవాలయాలల్లో పవిత్ర గ్రంథంగా పరిగణింపబడసాగిందని తెలుస్తున్నది. క్రీ.శ. 500 నాటికి మహాభారతం పవిత్ర గ్రంథంగా పరిగణింపబడసాగిందని దానికి శాసనాధారాలున్నవని వింటర్ నిట్స్ చెప్పాడు. క్రీ.శ. 700 ప్రాంతంవాడైన కుమారిలుడు మహాభారతాన్ని అధికారగ్రంథంగా ఉద్ధరణలు కూడా ఇచ్చాడు. అప్పటికే అది స్మృతిగ్రంథంగా గౌరవాన్ని పొందసాగింది.

మహాభారతకథ సత్యకథేనా?

మహాభారతకథ నిజంగా జరిగిందా లేక కవి కల్పితమా అన్న విషయంలో పండితులల్లో అభిప్రాయ భేదాలున్నవి. మహాభారతంలో పాండవులు ఇంద్రాదుల వంటి దేవతల కుమారుల కావటం, ఇంకా అనేక దివ్యసంఘనటలు దానిలో వుండటంచేత మహాభారత కథ చారిత్రక సంఘటనకాదని కొందరంటారు, ఇలియడ్‌వంటి గ్రీకు మహాకావ్యంలోను దేవతలు పాల్గొనే ఘట్టాలు, అతిమానుష సంఘటనలున్నవి. అయినా ఇలియడ్‌లో వర్ణింపబడిన ట్రాయ్ యుద్ధం నిజంగా జరిగిందని, అది చారిత్రక సత్యమని ఋజువైంది. హోమర్‌చేత వర్ణింపబడిన ట్రాయ్‌యుద్ధం కవిమాత్ర కల్పనకాక సత్యసంఘటనకాగా వ్యాసవర్ణితమైన కురుక్షేత్రయుద్ధం కవిమాత్రకల్పనగా తోసిపుచ్చటానికి వీల్లేదు. వ్యాసుడు స్వయంగా తన కృతిని "ఇతిహాసం"గా చెప్పుకున్నాడు. "ఇతి హాస" (ఈ విధంగా జరిగింది) అని ఇతిహాసానికి అర్థం. జరిగిన సంఘటనలను గ్రంథస్థం చేయటమే ఇతిహాసం యొక్క లక్ష్యం. అటువంటప్పుడు భారతకథను కేవలం కల్పనామాత్రంగా చెప్పటానికి వీల్లేదు.

మహాభారతకథ కేవలం కవికల్పిత కావ్యంగా భారతీయ సంప్రదాయం ఎప్పుడు అంగీకరించలేదు. ఈ కథ, కథలోవచ్చే వ్యక్తులు, సంఘటనలు సంహిత, సూత్ర, వ్యాకరణాది గ్రంథాలల్లో పేర్కొనబడి లభిస్తున్నవి. యజుర్వేదానికి చెందిన కాఠకసంహితలో విచిత్రవీర్య, ధృతరాష్ట్రుల పేర్లు పేర్కొనబడినవి. అథర్వవేదంలో పరీక్షిత్తు రాజ్యపరిపాలన ప్రసక్తివున్నది. కాని ఆ వ్యక్తులు మహాభారతానికి సంబంధించినవారే అని గట్టిగా చెప్పలేము. ఛాందోగ్యోనిషత్తులో దేవకీపుత్రుడైన కృష్ణుడు పేర్కొనబడినాడు. సాంఖ్యాయన శ్రౌతసూత్రంలో కురుక్షేత్రయుద్ధం, దానిలో కౌరవులు నశించినట్లుగా చెప్పబడింది. అశ్వలాయన గృహ్యసూత్రంలో "భారత, మహాభారతా" లు గ్రంథంగా పేర్కొనబడినవి. పాణిని యుధిష్ఠర, భీమ, విదుర పేర్లనుగూర్చి చర్చించాడు. "మహాభారత" మన్న సమాసాన్ని గూర్చి వివరించాడు. (6-2-38). పాణిని పేర్కొన్న "శిశుక్రందీయ" మన్న ఉపాఖ్యానం బాలుడైన శ్రీకృష్ణునికి సంబంధించిందిగా కన్పిస్తున్నది. అర్థశాస్త్రకారుడు కౌటిల్యుడు దుర్యోధునుడు ఇతరుల రాజ్యాన్ని కబళించటంచేత వినాశాన్ని పొందాడని చెప్పాడు. పతంజలి భీమ నకుల సహదేవులను పేర్కొన్నాడు. కౌరవ పాండవుల నడుమ జరిగిన యుద్ధాన్ని గూర్చి ప్రసంగించాడు. ఇంకా అతడు పేర్కొన్న "కంసవధ" అన్న నాటకం కృష్ణునికి సంబంధించిందని పేరునిబట్టి స్పష్టంగా చెప్పవచ్చును. మహాభారత యుద్ధం చారిత్రక సత్యమేనని బౌద్ధ జైన సంప్రదాయాలు అంగీకరిస్తున్నవి. జైన సంప్రదాయానుసారంగా 22వ తీర్థంకరుడు నేమినాథుడు శ్రీకృష్ణునికి చిన్నాయన కొడుకు.

బౌద్ధసాహిత్యంలో కురుజనపదం కీర్తింపబడింది. కురుధమ్మ జాతక కథ కురుప్రజల శీలాన్ని పొగడుతున్నది.

భారత కథలోని కురుక్షేత్రప్రాంతం కురుజనపదంగా ప్రసిద్ధమైంది. చాల ప్రాచీనమైంది. వేదాలల్లో కురుజనపదం చాలసార్లు పేర్కొనబడింది. పాండవుల ప్రసక్తి మాత్రం మనకు ఎక్కడా వేదాలల్లో కనిపించదు. కురుజనపదంతోపాటు పాంచాల జనపదం సంహితాదుల్లో చెప్పబడుతూ వుంటుంది. ఈ రెండు "కురు పాంచాల జనపదం' 'గా పేర్కొనబడినవి. ఈ రెండు జనపదాలు కలిసి ఒక్క గణసంఘం (Confederation) గా ఏర్పడి వుండేవి. ఏ కారణం చేతనో ఈ రెండు జనపదాల నడుమ యుద్ధం చెలరేగిందని ఆ వైరకథయే మహాభారత మూలరూపమని సి. లాస్సన్, ఏ. వేబర్, మాక్‌డొనెల్ వంటివారు అభిప్రాయపడినారు. భారత కథ కురుపాంచాలుర మధ్య జరిగిన ఒకానొక చిన్న యుద్ధమై వుంటుందని అదే రానురాను మహాకథగా పెంచబడిందని, ద్వంద్వయుద్ధం మాత్రం చేతనే జాతుల చరిత్ర గతి నిర్ణయింపబడే కాలంలో కోట్లకొలది సైన్యం పాల్గొని 18 రోజులు యుద్ధం చేసినారనటం అసంభవమని హెచ్.డి. సంకాలియా అభిప్రాయం. మహాభారత కథ ఆరంభంలో ద్రోణాచార్యుడు ద్రుపదుని మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకోవటం, కురుపాండవులకతడు అస్త్రవిద్యా గురువుగా వుండి గురు దక్షిణగా ద్రుపదుని బంధించి తెమ్మనటం, ద్రుపదుని కూతురు ద్రౌపది వివాహం, ద్రౌపది పాత్ర ప్రాధాన్యం మొదలైన ఘట్టాలు పై విమర్శకుల, చారిత్రకుల అభిప్రాయాలను బలపరుస్తున్నాయేమో చెప్పలేము.

మహాభారత కథ ప్రతీకాత్మకమా?

జె. డాల్‌మన్, ఏ. లుద్విగ్‌వంటివారు మహాభారత కథ ధర్మాధర్మాల, చీకటి వెలుగుల నడుమ జరిగిన సంఘర్షణకు ప్రతీక అని భావించారు. హెచ్. ఓల్డన్‌బెర్గ్ అభిప్రాయంలో మహాభారత మూలకథలో కృష్ణపాత్ర లేదు. కృష్ణుని పూజ, ప్రాధాన్యాలు హెచ్చింతర్వాత ఆ పాత్ర కథలో చొప్పింపబడి, మూలకావ్యం పెంచబడిందని అతని అభిప్రాయం. కాని ఇప్పుడు మనం కృష్ణుడు లేని మహాభారతాన్ని ఊహించలేము. కౌరవులు రాక్షసాంశసంభూతులు పాండవులు ఇంద్రాది దేవతలకు పుట్టినవారు. దీన్ని బట్టి కౌరవులు విజాతీయులైతే పంచ పాండవులు ప్రముఖమైన ఐదు భారతీయ రాజవంశాలకు ప్రతీకలు కావచ్చును. విజాతీయుల నెదిరించటానికై శ్రీకృష్ణుడు భారతీయ రాజులను సంఘటితం పరిచాడేమో! ఇక ద్రౌపది సామ్రాజ్యలక్ష్మికి ప్రతీక. మహాభారతంలో ద్రౌపది పంచభర్తృక ఎట్లా అయిందో వివరించే కథలో ఆమె సామ్రాజ్యలక్ష్మిగాను, పంచపాండవులు ఐదుగురు ఇంద్రులుగాను చెప్పబడినారు కూడ.

మహాభారత బృహద్రూపం

మహాభారత మూలకావ్యమైన జయేతిహాసం వేదాలల్లోని "నారాశంసి" రూపానికి దగ్గరగా వుండి తర్వాత బృహద్రూపాన్ని ధరించిందని విమర్శకుల అభిప్రాయం. హోమర్ రచించిన ఇలియడ్, ఒడిస్సీ అనే గ్రీకు మహాకావ్యాలను రెండింటిని కలిపినా మహాభారతం వాటికన్నా ఎనిమిదంతలు పెద్దది. గ్రీకుభాషలోని ఇలియడ్, జర్మన్ భాషలోని "నిబిలుంగెన్ ' మరణాంత గాథవంటిదే మహాభారతవీరుల కథ అని వింటర్‌నిట్స్ అభిప్రాయం. ఒక పక్షానికి విజయం లభించినా సర్వవినాశం మధ్య ఆ విజయం వారికి సుఖశాంతులను ఇయ్యలేక పోయింది.

వేదవ్యాసప్రోక్తమైన జయేతిహాసకావ్యం మహాభారతం యొక్క మూలరూపం-మొదటి సంస్కరణ అని చెప్పవచ్చును. దీన్ని అతడు తన నలుగురు శిష్యులు పైల, సుమంత, జైమిని, వైశంపాయనులకు మరియు తన కొడుకు శుకునికి చెప్పాడు. వారు తర్వాత దాన్ని నలుమూలల వ్యాపింపజేసారు. వారిలో జైమిని, వైశంపాయనప్రోక్తమైన మహాభారతాలు ఇప్పుడు మనకు దొరుకుతున్నవి. వాటిల్లో జైమిని మహాభారతంలో అశ్వమేధపర్వం మాత్రమే దొరుకుతున్నది. ఈ లబ్ధపర్వాన్నే వైశంపాయనుని కథతో పోలిస్తే కథా సంవిధానంలో చాల భేదం కన్పిస్తున్నది. అటువంటప్పుడు మూలగ్రంథం నలుగురు శిష్యుల చేతుల్లోనే చాల రూపం మారిందని ఊహించవచ్చును. అర్జునుని ప్రపౌత్రుడు జనమేజయుడు సర్పయాగం చేసాడు. ఆ యాగానికి వేదవ్యాసుడుకూడ వచ్చాడు. అప్పుడు జనమేజయుడు కౌరవ పాండవుల కథను వినిపించమని వేదవ్యాసుణ్ణి కోరాడు.

కురూణాం పాండవానాంచ యథాభేదోZ భవత్ పురా
తదస్మై సర్వమాచక్ష్వ యన్మత్తః శృతవానసి

ఆది 60-22

"వైశంపాయన! కౌరవ పాండవుల కథను నా ద్వారా నీవు వినివున్నావు కదా. ఇప్పుడు దాన్ని జనమేజయునికి వినిపించు" అని వేదవ్యాసుడు ఆ కథాశ్రవణ భారాన్ని వైశంపాయనునికి అప్పగించాడు.

వైశంపాయనుడు కథను వినిపించేటప్పుడు జనమేజయునికి కొన్ని సందేహాలు కలిగినవి. వైశంపాయనుడు ఆ సందేహ నివృత్తి చేసిన భాగాలు కూడ ఆ కావ్యంలో చేరినవి. అంటే వైశంపాయనునిచేత చెప్పబడిన భారత కథ మహాభారతం యొక్క రెండవ సంస్కరణరూపమని చెప్పాలి. ఈ సమయంలోనే జయేతిహాసానికి భారతమని పేరు

కలిగిందేమో! జయేతిహాసంలో 8800 శ్లోకాలుండగా, భారతంలో 24000 వరకు పెరిగినవి. జనమేజయుని సర్పయాగ సమాప్తి తర్వాత కొంతకాలానికి నైమిశారణ్యంలో ద్వాదశ సంవత్సరాలవరకు సాగే యజ్ఞ మొకటి ఆరంభమైంది. ఆ యజ్ఞానికి అనేక మహర్షులు విచ్చేశారు. వారిలో రోమహర్షణుని కొడుకు సౌతి ఉగ్రశ్రవుడు కూడ వున్నాడు. ఈ సౌతి జనమేజయుని సర్పయాగ సందర్భంలో వైశంపాయనుడు చెప్పిన భారత కథను వినివున్నాడు. శౌనక మహర్షి ప్రార్థనను అంగీకరించి దాన్ని సౌతి మహర్షులకు వినిపించాడు. ఆ కథాశ్రవణ సందర్భంలో శ్రోతలకు కలిగిన అనుమానాలను తీర్చటానికై, తాను మంచి పౌరాణికుడు కావటంచేత అనేక అభిప్రాయాలను, వివరణలను, ఉపాఖ్యానాలను చేర్చివున్నాడు. ఇది మహాభారతం మూడవ సంస్కరణరూపం. వైశంపాయన, సౌతుల ఉపోద్ఘాతం, ప్రాక్కథనాలే మహాభారతం ఆదిపర్వంలో చాలా భాగాన్ని ఆక్రమించినవి. ఆదిపర్వం 63వ అధ్యాయంలో వున్న వ్యాసుని జన్మకథతోనో, 94వ అధ్యాయంలోని పురువంశ వర్ణనతోనో భారత కథ ఆరంభమైవుంటుందని సూక్ష్మ పరిశీలనచేత చెప్పవచ్చును. మహాభారతాన్ని 18 బృహత్పర్వాలుగా, తిరిగి పర్వాలను అధ్యాయాలుగా విభజించి ఇప్పుడున్న క్రమరూపాన్నిచ్చింది సౌతియే అని పండితుల అభిప్రాయం. ఇప్పుడున్న బృహద్రూప మహాభారతమంతా వైశంపాయన సౌతుల చేతుల్లోనే ఏర్పడి స్థిరపడిందనలేము. సౌతి తర్వాత కూడ అనేక ఉపాఖ్యానాలు, వ్యాఖ్యానాలు, ఉపదేశాలు దానిలో చేర్చబడినవి. క్రీ.పూ. 6వ శతాబ్దం తర్వాత బౌద్ధ జైన నీతి కథలు కూడ దీనిలో చోటు చేసుకున్నవని వింటర్‌నిట్స్ అభిప్రాయం. మహాభారతం విష్ణుపారమ్యాన్ని బోధించేదని, కాని తర్వాత తర్వాత మధ్య మధ్యలో శివసంబంధ కథలు కూడ చేర్చబడినవని కూడ అతని అభిప్రాయం. పాణిని నాటికి (క్రీ.పూ. 5వ శ॥) భారతానికి మహాభారతమనే పేరు కూడ వచ్చింది. అప్పటికే మహాభారతం యొక్క రూపం చాలా మట్టుకు స్థిరపడింది. మహాభారతంలో పేర్కొనబడిన యవనకాంభోజాదిజాతులు వారి నివాసాదులను గూర్చిన ప్రసక్తి బుద్ధుని జననానికి పూర్వమున్న పరిస్థితులకు దగ్గరగా వున్నది. కాబట్టి మహాభారతం పెరుగుదల చాలమట్టుకు బుద్ధుని జననానికి కించిత్పూర్వం అంటే క్రీ.పూ. 6వ శ॥ నాటికి జరిగిందని చెప్పవచ్చును. అయినా దాని పెరుగుదల మాత్రం ఆగలేదు. క్రీ.శ.2వ శతాబ్దం వరకు అనుబంధరూపంగా హరివంశం కూడా మహాభారతానికి చేర్చబడిందని నిశ్చితంగా చెప్పవచ్చును. క్రీ.పూ. 6 క్రీ.శ. 2 శతాబ్దాల నడుమ మహాభారతంలో ఆఖ్యానాలు, కథలే ఎక్కువ చేర్చబడినవి కాని రూపంలో ఎక్కువ గంభీరమైన మార్పులు జరుగలేదు. క్రీ.శ. 330-345 నడుమ పాలించిన వాకాటకరాజు సర్వసేనుడు హరివంశం ఆధారంగా హరివిజయమనే ప్రాకృతకావ్యాన్ని రచించాడు. అంటే క్రీ.శ. 330కి పూర్వమే హరివంశం సంస్కృతంలో వున్నదని చెప్పవలసి

వుంటుంది. అంటే కనీసం క్రీ.శ. 2 వ శతాబ్దం నాటికి హరివంశం రచన జరిగిందని నిర్ణయించవచ్చును. శ్రీకృష్ణభక్తులు శ్రీకృష్ణుని మహత్త్వాన్ని తెలిపే ఘట్టాలను చేర్చినట్లుగానే శివభక్తులు శివుని ప్రాధాన్యాన్ని తెలిపే ఘట్టాలను, కథలను మహాభారతంలో చేర్చారు. ద్రోణపర్వంలో అర్జునుడు కృష్ణుని సలహా ననుసరించి శివున్ని ధ్యానిస్తు సమాధిగతుడు కావటం, వన పర్వంలో అర్జునుడు శివున్ని మెప్పించి పాశుపతాస్త్రాన్ని పొందటం, సౌప్తిక పర్వంలో అశ్వత్థామ శివుని అనుగ్రహంతో ఖడ్గాన్ని పొందటం, కృష్ణుడు శివభక్తునిగా పేర్కొనబడటం, గదా పర్వంలో లింగపూజ మహిమాదులు చెప్పబడటం మొదలైనవెన్నో ఘట్టాలు శివసంబంధమైనవి వున్నవి. కృష్ణ, శివ ప్రాధాన్యాలను తెలిపే ఘట్టాలే కాక దేవి, కార్తికేయ, సూర్యాది దేవతల ప్రభావాలను తెలిపే కథలు మహాభారతంలో చేర్చబడినవి. భగవద్గీతలో ఉపనిషత్తుల సారం నిక్షిప్తమైంది. ఈ విధంగా మహాభారతం సర్వమతతత్త్వ అనుయాయులకు చదువదగిన గ్రంథంగా ఏర్పడి విస్తరించింది. మహాభారతం ఆదిపర్వం పౌష్యోపాఖ్యానాదుల్లో నగ్నక్షపణకుల ప్రసక్తి వున్నది. క్షపణకులని జైన సన్యాసులననే వారు. నగ్నక్షపణకులంటె నగ్నజైన సన్యాసులై వుంటారు. బౌద్ధ మత ప్రసక్తి మహాభారతంలో స్పష్టంగా లేకున్నా శాంతిపర్వంలో కొంతవరకు బౌద్ధ ధర్మ ప్రసక్తి అస్పష్టంగా వున్నది. ఈ భాగాలన్నీ బౌద్ధజైనమత వ్యాప్తి తర్వాత అనగా క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం తర్వాత ప్రక్షిప్తాలని చెప్పవచ్చును. ఈ విధంగా మహాభారతం పెరిగి పెరిగి లక్ష శ్లోకాలతోకూడి బృహద్రూపాన్ని ధరించింది. ప్రధానంగా ఉత్తర, దక్షిణ భారతదేశాలల్లో మహాభారతం యొక్క విభిన్నమైన ప్రతులు దొరికినవి. వాటినిబట్టి అసలు మహాభారతంలో కొత్త విషయాలను చేర్చటం అనేది క్రీ.శ. 2వ శతాబ్దం తర్వాత కూడ పూర్తిగా ఆగలేదనే చెప్పవలసి వుంటుంది.

ప్రధానకథకు సంబంధంలేని ఆఖ్యానాలు, వృత్తాంతాలు కూడ మహాభారతంలో చేర్చబడినవి. ఉదా॥కు ఆదిపర్వంలోని పౌష్య, పౌలోమి ఆఖ్యానాలు, గదాపర్వంలో సరస్వతినది పుట్టుక, అది ప్రవహించే పుణ్య క్షేత్రాల వర్ణనలు, వనపర్వంలో 750 శ్లోకాలల్లో విస్తరించిన శ్రీరాముని కథ, భీష్మపర్వంలో భూప్రమాణ వివరణ, ద్రోణపర్వంలో త్రిపురాసురసంహారం ఇంకా ఎన్నో. ఇటువంటి ప్రక్షిప్తాలతో మహాభారతం పెరిగిపోయి తన కావ్యత్వాన్ని కోల్పోయింది. జయేతిహాసమన్న పేరునుబట్టి పాండవుల విజయంతోనే కథ ముగియవలసి వుండగా ఇంకా పాండవుల స్వర్గారోహణ వరకు కథ పెరిగింది. పాండవుల విజయంతో కథ ముగిసినట్లయితే భారతకథా రూపమే వేరుగా ఉండేది. అప్పుడు దానిలోని అంగి రసరూపమే మారివుండేది. ఇప్పటిలాగ శాంతరసం ప్రధానం కాక వీరరసం ప్రధానమై అంగిరసంగా వుండేది. కురుక్షేత్ర యుద్ధానంతరం పాండవుల దుఃఖం,

రాజ్యాన్ని పాలించినా వారిలో ఆవరించిన నిరాశా నిస్పృహ నిస్తబ్దతలు, వారి మరణవృత్తాంతం పాఠకుల్లో ఒక విధమైన నిర్వేదాన్ని నింపుతున్నవి. శత్రువినాశం చేసిన పాండవుల తర్వాతి వృత్తాంతం నీరసమై, అధ్యాత్మిక జ్ఞానబోధనలతో నిండి వీరరసపోషకంగా లేదు. పాండవులు శత్రువులను వినాశం చేయటంతో పాఠకుల్లో నిండిన ఉత్సాహమనే స్థాయిభావం ఈ తర్వాతి వృత్తాంతాలవల్ల ప్రశమింపబడు తున్నది. యుద్ధంవల్ల కలిగిన దుష్ఫలితాలు అనేక రకాలుగా చిత్రింపబడటంచేత పాఠకుల్లో నిరీహత్వం లేక శమం లేక తృష్ణాక్షయమనే స్థాయిభావం నిలిచిపోతున్నది. ఒకవేళ పాండవుల శత్రువిజయంతో కథ ఆగిపోయినట్లయితే శత్రువినాశానికి, ధర్మకార్యసాధనకు పాఠకుల హృదయాలు ఉత్సాహపూర్ణమై వుండేవి. ఇప్పుడు అది సాధ్యంకాదు. పాండవులను గూర్చి జనమేజయుని జిజ్ఞాసే మహాభారతం పెరుగుదలకు కారణం కావచ్చును. చివరి పర్వాలల్లో అనేక ధర్మశాస్త్ర సంబంధ విషయాల సుదీర్ఘ వర్ణనలున్నవి. వీటిల్లో కొన్ని భాగాలు వైశంపాయన సౌతుల తర్వాత శ్రవణకుల జిజ్ఞాసను, సందేహాలను తీర్చటానికై పౌరాణికులచేత చేర్చబడినవి కావచ్చును. అంతేగాక మహాభారతంలో ఒకే వృత్తాంతం మళ్ళా మళ్ళా చెప్పబడటం కూడ జరిగింది. ఉదా॥కు ఆస్తీకుని కథ, పాండురాజు ఋషిని చంపేఘట్టం, కర్ణుని జన్మవృత్తాంతం, సృంజయుని కథ, అణిమాండవ్యుని కథ, ద్రోణద్రుపదుల వృత్తాంతం, కర్ణుని కుండలాలను ఇంద్రుడు గ్రహించటం, శ్యమంత పంచకవృత్తాంతం మొదలైనవి. ఇవేగాక కొన్ని అసంభవమైన వృత్తాంతాలు, శ్రోతల అభిరుచిననుసరించి పుట్టినవి మహాభారతంలో చోటు చేసుకొన్నవి. ఉదా॥కు వనపర్వంలో భీమాంజనేయుల కలయిక, యుద్ధం. ఇక మహాభారతంలో నాయకుడైన శ్రీకృష్ణునిబాల్యాది వృత్తాంతాలేవి మహాభారతంలో చెప్పబడలేదు. ఆ లోటును తీర్చటానికై హరివంశం ప్రత్యేకంగా వ్రాయబడి మహాభారతానికి అనుబంధంగా చేర్చబడింది. ఈ విధంగా అనేక ప్రక్షిప్తాలతో జయేతిహాసం బృహద్రూపాన్ని ధరించి మహాభారతంగా పరిణ మించింది. జయేతిహాసం తన మూలరూపాన్ని పూర్తిగా మార్చుకొన్నది. ఇప్పుడు ప్రక్షిప్తాలేవి, మూల వ్యాసరచన ఏది అని నిర్ణయించి కచ్చితంగా చెప్పటం సాధ్యం కాదు.

మహాభారత వస్తువైశిష్ట్యం

మహాభారతంలో భరతవంశానికి చెందిన కౌరవపాండవుల కథ ప్రధానంగా వున్నది. ఈ ప్రధానకథ కాక నీతి ధర్మ మత సంబంధమైన ఉపాఖ్యానాలెన్నో దానిలో వున్నవి. రాజుల, ఆశ్రమవాసుల యొక్క కర్తవ్యాదులెన్నో విస్తృతంగా వర్ణింపబడినవి. మహాభారతంలోని శాంతి, అనుశాసనిక పర్వాలు పూర్తిగా పారమార్థిక విషయాలతో నిండి వున్నవి. ఇంతేగాక

ప్రసిద్ధమైన భగవద్గీత మహాభారతాంతర్గతమైందే. కురుక్షేత్రయుద్ధారంభ సమయంలో మిత్ర బంధువర్గాన్ని చూచి యుద్ధమంటె రోసి నిరీహుడైన అర్జునునికి శ్రీకృష్ణుడు ధర్మబోధన చేసి కర్తవ్యోన్ముఖుని చేసాడు. అటువంటి భగవద్గీత తర్వాత అన్ని హిందూమత సంప్రదాయాలకు పఠనీయగ్రంథమైంది. దీనికి బ్రహ్మసూత్రాలతో పాటు శంకర రామానుజుల వంటి ఆచార్యులందరూ వ్యాఖ్యానాలు వ్రాసారు. సమస్త మానవధర్మం దీనిలో ఇమిడివుండి, ఇది మానవులందరికి అవశ్యపఠనీయ గ్రంథంగా వున్నది. జీవాత్మ, పరమాత్మ, ప్రకృతుల స్వరూపం, మానవుని కర్తవ్యం, భౌతిక ఆధ్యాత్మిక ఔన్నత్యాదుల రూపం-వీటి విస్తృత వివేచన దీనిలో చేయబడింది. సమస్తవేదధర్మ శాస్త్రాదుల సారం దీనిలో ఇమిడి వుండటంచేత హిందువులకిది అతిపవిత్ర గ్రంథమైంది.

మహాభారతంలోని శ్లోకాలను రోజుకొకటియైనా చదవాలని, మహాభారత శ్రవణం చేత శుభాలు కలుగుతాయని ఆ గ్రంథంలోనే ఇట్లా చెప్పబడింది -

శ్లోకం వాప్యనుగృహ్ణీత తథార్థ శ్లోకమేవవా
అపిపాదం పఠేన్నిత్యం నచ నిర్భారతో భవేత్ ఆది 62-42

మహాభారతకథ ప్రాచీనకాలంలోనే ద్వీపాంతరాలకు పాకింది. కంపూచియా దేశంలోని శిలాశాసనం ద్వారా మహాభారత ప్రతులు రెండు క్రీ.శ. 600 ప్రాంతంలో అక్కడి దేవాలయాని కియ్యబడినట్లుగా తెలుస్తున్నది. మరియు ఆ దేవాలయంలో ప్రతినిత్యం మహాభారత పఠన శ్రవణం జరిగేటట్లుగా నియమం చేయబడిందట. క్రీ.శ. 990 ప్రాంతంనాటికే మహాభారతం జావాభాషలోకి అనువాదం చేయబడింది. మహాభారతంలోని ఉపాఖ్యానాలెన్నో బౌద్ధ గ్రంథాలల్లో చోటుచేసుకొని మధ్య ఏశియా, చైనా, జపాన్, మంగోలియా మొదలైన దేశాలల్లో వ్యాపించినవి. మహాభారతం క్రీ.శ. 17వ శ॥లో పర్షియన్ భాషలోకి అనువదింపబడింది. అదేకాక క్రీ.శ. 1982లో డా. సయ్యద్ మహమ్మద్ రెజా జలాలీనయనీ మరియు డా. ఎన్.ఎస్ శుక్లాలు కలిసి మహాభారతాన్ని పర్షియన్ భాషలోకి అనువదించి ప్రచురించారు.

వైదికయుగానంతరపు భారతీయ సంస్కృతి చరిత్రలను తెలుసుకోవటానికి మహాభారతం చాల తోడ్పడుతున్నది. ఆనాటి రాజకీయాలు, రాజ్య పరిపాలన విధానాలు, యజ్ఞయాగాది కర్మలు, మతం, ధర్మం, నీతి, దర్శనతత్త్వ రహస్యాలు, సాంఘిక జీవనవిధానం, వర్ణవ్యవస్థ మొదలైన ఎన్నో విషయాలు మహాభారతంలో ప్రతిబింబించినవి. అంతేగాక మానవుని ఆంతర ప్రవృత్తుల వైవిధ్యం చాల సహజంగా దీనిలో చిత్రింపబడింది. వ్యక్తిలో వుండే లోభం, ఈర్ష్య, కాంక్షాదుల స్వరూపాలు చక్కగా చిత్రింపబడి కన్పిస్తున్నవి.

మహాభారతంలోని పాత్రలు నిత్యజీవితంలోని మానవులుగానే కన్పిస్తారు కాని ఆదర్శ వ్యక్తులుగా కాదు. ఇటువంటి సహజ మానవ నైజచిత్రణతో కూడిన పాత్ర చిత్రణ భారతీయ సాహిత్యంలో చాల తక్కువగా కన్పించేటటువంటిది. కాల విపర్యయం, మానవ జీవితంలోని ఒడిదుడుకులు, మానవప్రకృతి వైవిధ్యం, సంభాషణలు సహజంగా గొప్పగా చిత్రింపబడినవి. రాజకీయపుటెత్తులు, పైయెత్తుల విధానం చెప్పబడింది. ఆయా సందర్భాలలో ధర్మసత్యాల రూపనిర్ణయం దీనిలో చేయబడింది. అనేకోన్ముఖమైన హిందూధర్మం యొక్క స్వరూపం దీనిలో చక్కగా ప్రకటింపబడింది. వీటితోపాటు ఆర్థిక, భౌగోళిక, సామాజిక మొదలైన లౌకిక శాస్త్రసంబంధ విషయాలెన్నో దీనిలో ప్రకటింపబడినవి. లౌకిక, ఆధ్యాత్మిక, పారలౌకిక విద్యలన్నీ దీనిలో వున్నవి. అందుకే మహాభారతం విజ్ఞాన సర్వస్వమనటానికి తగివున్నది.

అనంతర కావ్యనాటకాదుల్లో కనిపించే కేవలం ఆదర్శవ్యక్తి చిత్రణలు మహాభారతంలో కనిపించవు. దీనిలోని పాత్రలు మానవ సహజమైన లోటుపాట్లతో కన్పిస్తవి. మానవ జీవితంలోని ఉత్థానపతనాలు అతి సహజంగా చిత్రింపబడినవి. దీనిలోని పాత్రలు కర్మసిద్ధాంతాన్ని నమ్మి నిర్వీర్యులుకాక ధర్మం, సత్యాలకు కట్టుబడి సమర్థులైవుండికూడ కష్టాలను అనుభవిస్తారు. ఇట్లా కష్టాలను అనుభవించినా చివరకు ధర్మసత్యాలకే విజయం లభించినట్లుగా కవి చిత్రించాడు. మానవులు లోభమోహాదులకులోనై ఎట్లా దుర్గతిపాలవుతారో కవి కౌరవాపజయంతో సూచించి కావ్యాన్ని ధర్మనీతి బోధకంగా సాధించాడు. మహాభారతంలోని ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క ప్రత్యేక వ్యక్తిత్వాన్ని తీసుకొని మనముందు నిలుస్తుంది. ధర్మరాజు ధర్మమూర్తి అయినా అతనిలోను మానవసహజమైన కొన్ని లోపాలున్నట్లుగా చిత్రింపబడినవి. ద్రౌపది, శకుంతలలు నిస్సహాయలైన సుకుమార సుందరీ మణులు కారు. అదేవిధంగ దుర్యోధన కర్ణ. ధృతరాష్ట్ర, భీష్మ, ద్రోణ, అశ్వత్థామ, భీమార్జునాది పాత్రలెన్నో నిత్యజీవితంలోని వ్యక్తులల్లో కన్పించే లోపాలతో కన్పిస్తవి.

మహాభారతంలో ఆనాటి సాంఘిక, సామరికపరిస్థితులెన్నో ప్రతిబింబించి కన్పిస్తున్నవి. బహుభార్యాత్వంతో పాటు బహుపతీత్వం ప్రచారంలో వుండేది. ఇప్పటికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉత్తరప్రాంతంలోని గఢ్‌వాల్‌లో అన్నదమ్ములు ఉమ్మడిగా భార్యను లేక భార్యలను కలిగివుండటం ప్రచారంలో వున్నది. నాగరికత కలిగినచోట్ల ఆచారం సన్నగిల్లినా ఇంకా ఆ ఆచారం ప్రచారంలో కన్పిస్తున్నది. దక్షిణదేశంలోని నీలగిరికొండల్లో వుండే తోడా జాతిలోను బహుపతీత్వం ప్రచారంలో వున్నది. ద్రుపదుని పాంచాల దేశం ఇప్పటి ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ఉత్తర భాగాలల్లో వ్యాపించి వుండేది. కాబట్టి బహుపతీత్వం పాంచాలదేశంలో ప్రచారంలో వుండేదని, ఆ ఆచారాన్ననుసరించే ద్రౌపది పాండవులను

భర్తలనుగా గ్రహించిందని చెప్పాలి. ప్రాచీన కాలంలో వంశాభివృద్ధికొరకు సంతానం గృహస్థునకు చాల ప్రధానమైంది. సంతానం లేని ముఖ్యంగా పుత్రుడులేని, వారికి ప్రత్యేకంగా ఒక నరకం కూడా వుండేది. సంతానం లేకపోతే ఇహలోకంలోగాని పరలోకంలోగాని సద్గతుల్లేవని మన పూర్వికుల అభిప్రాయం. జీవితంలో సంతానాన్ని పొందటం ఒక అతి ప్రధానాంశం. కాబట్టి సంతానం లేనివారు సంతానం కాకముందే భర్త చనిపోతే వంశాభివృద్ధిని కోరేవారు నియోగపద్ధతిని అవలంబించటానికి ధర్మశాస్త్రాలు అనుమతి నిచ్చినవి. భర్త అనుమతితో, పెద్దల అభిమతంతో పరపురుషుని ద్వారా సంతానం పొందటమే నియోగపద్ధతి. దీనికొరకు నీరీహులైన, సాత్త్వికులైన, కామాసక్తులుకాని వ్యక్తులనే ఎన్నుకొనేవారు. పిల్లలు లేకపోతే దత్తత తీసుకోవటం, వెలనిచ్చి కొనుక్కోవటం, కూతురు కొడుకును గ్రహించటం మొదలైన దశవిధ సంతానంలో నియోగ పద్ధతి నవలంబించి పొందిన సంతానం కూడ చేర్చబడింది. ఈ నియోగ పద్ధతి నవలంబించియే అంబిక, అంబాలిక, కుంతి మొదలైనవారు సంతానవతులై భర్తల వంశాన్ని నశించకుండ కొనసాగించారు. మహాభారతం కాలంనాడు యుద్ధవిద్య చాల అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ధనుర్విద్య పరాకాష్ఠ నందుకొన్నది. వివిధ శస్త్రాస్త్రప్రయోగాలు అద్భుతమైనవి వుండేవి. రథాలను యుద్ధరంగంలో ఎక్కువ ఉపయోగించేవారు. గుర్రాలను నడిపే విద్యగాని, యుద్ధంలో వాటిని ఎక్కువ ఉపయోగించటం కాని కనిపించదు. రథాలను వివిధ గతులతో నడిపే విద్య చాల అభివృద్ధి చెందింది. రథాలను నడిపేందుకు ప్రత్యేకంగా ఒక వర్ణమే ఏర్పడింది. కృష్ణుడు, శల్యుడు రథచోదక విద్యలో ఆరితేరినవారు అని చెప్పబడింది. చతురంగబలంలో రథాలే ప్రాధాన్యం వహించేవి. గుర్రాలతో పాటు ఏనుగులు చతురంగబలంలో చేరినా గుర్రాల వలెనే ఏనుగుల ఉపయోగం కూడ ఎక్కువ వున్నట్లు కన్పించదు. తర్వాత మగధ సామ్రాజ్య కాలంలో ఏనుగులను యుద్ధంలో ప్రయోగించినంతగా మహాభారత కాలంలో ప్రయోగించినట్లు లేదు. గజబల ప్రాశస్త్యాన్ని వారు అంతగా గుర్తించలేదు. మహాభారత కాలం తర్వాత గజబల ప్రాధాన్యం ఎక్కువైంది. గ్రీకువీరుడు అలెగ్జాండరు అశ్వసైన్యం భారతీయుల గజసైన్యం ముందు నిలువలేకపోయింది. పూరుడు (పోరస్) అలెగ్జాండర్‌ను తన గజసైన్య బలంతోనే ఎదిరించగలిగాడు. మగధదేశపు గజబల విస్తారాన్ని గూర్చి విని అలెగ్జాండరు తన విజయయాత్రను కొనసాగించకుండ వెనుకకు తిరిగి పోయాడు. ఈనాడు యుద్ధంలో ట్యాంకులెట్లాంటివో ఆనాడు గజబలం అట్లా పనిచేసేది. తర్వాత తురుష్కుల దండయాత్రలు సాగినవి. వారు తీవ్రవేగంగల గుర్రాలకు ప్రాధాన్యమిచ్చారు. పాతదైన సామరిక పద్ధతులతోకూడిన హిందూ రాజుల సైన్యం రాటుదేరిన తురుష్కులను, వారి అశ్వసైన్యాన్ని ఎదిరించలేక వీగిపోయారు. అశ్వబల

ప్రాధాన్యాన్ని తర్వాత హిందూ రాజులు కూడ గుర్తించి తమ అశ్వసైన్యాన్ని పెంపొందించుకొన్నారు. మహాభారత కాలంలో విలువిద్య తర్వాత గదాయుద్ధం, మల్లయుద్ధం ఎక్కువ ప్రాధాన్యం వహించినవి. ఖడ్గవిద్య చాల తక్కువ. యుద్ధరంగంలో వ్యూహాలను పన్నటం ప్రధానాంగం. యుద్ధం చేసే సమయం పగలు. పగటిపూట కూడ నిర్ణీతకాలంలోనే యుద్ధం జరిగేది. రాత్రిపూట యుద్ధం భారతీయ సంప్రదాయ ప్రకారం వర్జితం. యుద్ధపు కట్టుబాట్లను తుచ తప్పకుండ అందరూ పాటించేవారు. అలెగ్జాండరు హఠాత్తుగా జీలం నదిని దాటి అర్ధరాత్రి పూరుని (పోరస్) సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. వర్షంలో రాత్రి యుద్ధానికి సిద్ధపడని పౌరవ వంశ రాజు చాల కష్టనష్టాలను ఎదుర్కోవలసి వచ్చినది. ఇటువంటి అధర్మ యుద్ధాలను భారతీయులు అనుసరించలేదు.

మహాభారతంలో ఉపాఖ్యానాలు

మహాభారతంలో 4/5 భాగం ఉపాఖ్యానాలు నిండివున్నవి. కౌరవ పాండవుల విశాలమైన కథలో పాఠకులకు విసుగుకలిగించని అనేక ఉపాఖ్యానాలు చేర్చబడినవి. సత్యధర్మాదుల స్వరూపనిరూపణకొరకు, వివరణ వ్యాఖ్యానాల కొరకు తర్వాత ఎన్నో ఉపాఖ్యానాలు మహాభారతంలో చేర్చబడివుంటవి. గంగావతరణ, శకుంతల, సావిత్రి, దమయంతి, త్రిపురాసుర సంహార, యయాతి, శిబి, శ్రీరామ, పరశురామ, ఋష్యశృంగాదుల కథలెన్నో రమ్యమైనవి మహాభారతంలో వున్నవి. వీటిల్లో కొన్ని వేదవ్యాసుడే రచించినవై వుంటవి. మహాభారతంలోని ఉపాఖ్యానాలెన్నో తర్వాత కవులకు కావ్యేతివృత్తాలుగా ఉపయోగపడినవి. ఎన్ని ఆఖ్యానోపాఖ్యానాలున్నా మహాభారతంలోని ప్రధానకథ ఎప్పుడూ తన ప్రాధాన్యాన్ని కోల్పోలేదు. ఉపాఖ్యానాలనే మహారణ్యంలో పాఠకుడెప్పుడూ ప్రధానకథ అనే రాజమార్గాన్ని విడిచిపెట్టి తప్పిపోడు. అనేక పాత్రలు, అనేక సంఘటనలతో కూడిన కథను కవి ఎంతో నేర్పుతో రచించాడు. ఇటువంటి బృహత్కావ్యాన్ని నిర్వహించటం అసామాన్య ప్రతిభకు తార్కాణం.

మహాభారతానికి వ్యాఖ్యానాలు

మహాభారతం సర్వసుబోధకమైన సరళసులభశైలిలో వ్రాయబడింది. ఐనా దీనికి వ్యాఖ్యానాలు బయలుదేరినవి. సర్వజ్ఞ నారాయణుని వ్యాఖ్యానం మనకు తెలిసిన వ్యాఖ్యానాలల్లో మొదటిది. ఇతడు క్రీ.శ. 14వ శతాబ్దం ఉత్తరార్ధంలో జీవించాడు. ఈ వ్యాఖ్యానంలో కొన్నిభాగాలు మాత్రమే దొరుకుతున్నవి. రెండవది అర్జున మిశ్రుని టీక. అర్జునమిశ్రుడు సర్వజ్ఞనారాయణుని పేర్కొన్నాడు. మూడవది క్రీ.శ. 16వ శతాబ్దంనాటి

నీలకంఠుని వ్యాఖ్యానం. ఇతడు మహారాష్ట్ర దేశీయుడు. ఈ వ్యాఖ్యానాలేకాక ఆనందతీర్థుని(మధ్వాచార్యుల) మహాభారత తాత్పర్య నిర్ణయం, అప్పయ్య దీక్షితుని మహాభారత తాత్పర్య సంగ్రహం వంటి విమర్శనాత్మక గ్రంథాలు రచింపబడినవి. క్రీ.శ॥ 11వ శతాబ్దంవాడైన క్షేమేంద్రుడు భారత మంజరి అనే పేరుతో, క్రీ.శ. 11వ శతాబ్దంవాడైన అగస్త్యుడు బాలభారతమనే పేరుతో మహాభారత కథాసంగ్రహాలను రచించారు.

మహాభారత శైలి

క్రీస్తుపూర్వం 4వ శతాబ్దంలో అలెగ్జాండరు దండయాత్రతో భారతీయులకు గ్రీకులతో, గ్రీకుభాషతో పరిచయం ఏర్పడిందని, హోమర్ ఇలియడ్ ఒడిస్సీ కావ్యాల ప్రేరణతో మహాభారతం రచింపబడిందని కొందరు పాశ్చాత్య విమర్శకుల అభిప్రాయం. గ్రీకు లాటిన్ భాషాసంస్కృతులు ఉపజీవ్యంగా కలిగిన పాశ్చాత్యవిమర్శకులకు ఇటువంటి అభిప్రాయం కలగటంలో ఆశ్చర్యంలేదు. భారతదేశంలో సాహిత్య సంస్కృతి వికాసాలు గ్రీకు సాహిత్య సంస్కృతి సంపర్క ఫలితమని నమ్మటం గాలిలో మేడలు కట్టటం వంటిదే అవుతుంది. మహాభారతం ఇలియడ్ ఒడిస్సీల కన్న అతి ప్రాచీనమైంది. ఇప్పటికి మహాభారతం భారతీయుల జీవనానికి జీవనాడి వంటిది. భారతీయ ధర్మ, నీతి మార్గాలకది ప్రేరకమైనటువంటిది. అటువంటి మహత్తర శక్తి ఇప్పుడు ఇంకా ఇలియడ్, ఒడిస్సీలకున్నదనటం సందేహాస్పదం.

మహాభారతంలోని సంస్కృతం తరువాతి లౌకిక సంస్కృతంకన్నా కొంత భిన్నంగా వున్నదని, కొన్ని భాగాలల్లో సంస్కృతం చాలా ప్రాచీనమైందని విమర్శకుల అభిప్రాయం. పాణిని సూత్రాలకు భిన్నమైన గచ్ఛధ్వం వంటి ప్రయోగాలు వున్నవి. మహాభారతంలోని సంస్కృతం ఆనాడు వ్యవహారంలో వున్న సంస్కృతభాషయే అయినా మహాభారతమంతటా భాషాశైలులు ఒక తీరుగా వున్నవని చెప్పలేము. ఒక్కొక్కచోట దీనిలోని సంస్కృతభాష వైదిక గద్యానికి దగ్గరగా వున్నదని, మరికొన్ని భాగాలు పురాణాలకు దగ్గరగాను వున్నవని వింటర్‌నిట్స్ అభిప్రాయం. మహాభారతంలో ఉపజాతి వృత్తాలు అక్కడక్కడ కనిపించినా మొత్తం మీద అనుష్టుపు ఛందస్సెక్కువగా వాడబడింది. తరువాత లౌకికకావ్యాలల్లో కనిపించే క్లిష్టశైలి, క్లిష్ట భావాలంకారాలు మహాభారతంలో లేవు. మహాభారత శైలి పురాణాల శైలికి దగ్గరగా వున్నది. అట్లా అని కావ్యశైలి మహాభారతంలో అసలే లేదని చెప్పలేము. ప్రకృతి వర్ణనలు, సహజ యుద్ధవర్ణనలు, కరుణరసప్లావితమయ్యే శోకఘట్టాలు, రౌద్రాది రసపూర్ణమైన ఘట్టాలు, స్త్రీ వర్ణనలు (లౌకిక కావ్యాలల్లో వలె అంగాంగ వర్ణన కాదు), రమ్యశృంగార సన్నివేశాలు మహాభారతంలో కావ్యశైలిలో రచింపబడినవి వున్నవి. అక్కడక్కడ

ఉపమారూపకాది అలంకారాలు సుందరంగా ప్రయోగింప బడినవి. మహాభారతమంతా కాకున్నా కొన్ని భాగాలల్లో రమ్యమైన ఆలంకారికశైలి కన్పిస్తున్నది.

మహాభారతంలో ధర్మ నీతి ఉపదేశ సన్నివేశాలు, వేదాంత బోధనలు సరళశైలిలో రచింపబడినవి. భగవద్గీతలోని విషయంగాని, భాషగాని ఉపనిషత్తులకు దగ్గరగా వున్నది. కృష్ణపూజా ప్రాధాన్యం హెచ్చింతర్వాత, కృష్ణుడు దాన్ని అర్జునునికి ఉపదేశించినట్లుగ మహాభారతంలో చేర్చబడి వుంటుంది. యాదవులను ఒక గణరాజ్యంగా సంఘటితం చేసి, ఆనాటి రాజకీయాలల్లో ప్రధాన పాత్ర వహించిన కృష్ణుడు రాజనీతి కుశలుడేకాక సాంఖ్యాది దర్శనజ్ఞాన సంపన్నుడైనవాడు. దర్శనాల సంఘటిత సారరూపమైన అతని ఉపదేశాల తాత్పర్యమే భగవద్గీత రూపాన్ని ధరించి వుంటుంది. ఆనాడు ఎంతో మంది రాజులకు, ముఖ్యంగా యాదవగణాలకు మార్గదర్శకుడైన కృష్ణుడు మహాత్ముడుగా, విష్ణువు అవతారంగా పరిగణింపబడ సాగాడు. అతని ఉపదేశాలు భగవద్గీత రూపంగా మహాభారతంలో చోటు చేసుకొన్నవి. దీన్ని ఎవరు రచించి ప్రక్షిప్తం చేసారో తేల్చి చెప్పలేము.

రామాయణం

రామాయణాన్ని రచించిన కవి వాల్మీకి. వాల్మీకి గంగాతీరంలో నివసిస్తు రామాయణాన్ని లవ కుశులకు చెప్పాడని, వారు దాన్ని రాముని అశ్వమేధయాగశాలలో గానం చేసారని రామాయణంలోనే చెప్పబడింది.

రామాయణంలో 24000 శ్లోకాలున్నవి. అది ఏడు కాండాలుగా విభాగింపబడింది - బాల, అయోధ్య, అరణ్య, కిష్కంధ, సుందర, యుద్ధ, ఉత్తర కాండాలు. ఈ ఏడు కాండాలన్ని వాల్మీకి విరచితం కావని ఆదునికవిమర్శకుల అభిప్రాయం. ఒకటవ, ఏడవ కాండాలు వాల్మీకి రచించినవి కావని, అవి ప్రక్షిప్తాలని విమర్శకులు అనేక ఆధారాలను చూపారు. రామాయణ కథ ఐదు కాండాల వరకే పరిమితమై వున్నదని, రెండు కాండాలు అంటె 1, 7 కాండాలు తర్వాత కాలంలో చేర్చబడినవని యాకోబి అభిప్రాయం. 2 నుండి 6 కాండాలల్లో చెప్పిన విషయాలను ఖండించేవిధంగా ఎన్నో విషయాలు మొదటికాండంలో వున్నవని, ప్రధానకథ అంతా 6వ కాండం వరకే చెప్పబడగా ఏడవ కాండం యొక్క ఆవశ్యకత లేదని అతని అభిప్రాయం. 1,7వ కాండాలల్లో కథాసంవిధానం మిగతా వాటికన్న భిన్నంగా వున్నది. వీటిల్లో ఋష్యశృంగ, విశ్వామిత్ర, అహల్య, గంగావతరణ, ఆంజనేయ, రావణ సంబంధ అవాంతర కథలెన్నో వున్నవి. ఇటువంటి అవాంతరకథలు 2నుంచి

6కాండాలల్లో కన్పించవు. మహాభారతం వలెనే రామాయణాన్ని పెంచటానికి ప్రయత్నాలు జరిగినవని దీన్నిబట్టి తెలుస్తున్నదని, ఉత్తరకాండం శైలి శిథిలంగా ఉన్నదని, ఈ కారణాలన్నిటిచేత రామాయణంలో కాండాలన్నీ ఏక కవి కృతులు కావని యాకోబి అభిప్రాయం. వాసుదేవున్ని లేక కృష్ణుని విష్ణువతారంగా భావించి పూజింపబడటం బాగా ప్రచారంలోకి వచ్చింతర్వాత రాముని సైతం విష్ణ్వంశావతారంగా చెప్పే శ్లోకాలు, వృత్తాంతాలు తదనంతరం రామాయణంలో చేర్చబడినవని అతని అభిప్రాయం. బాల, ఉత్తర కాండాలల్లోనే వాల్మీకి రామునికి సమకాలికుడుగా కన్పిస్తాడు. ఇది నమ్మతగ్గది కాదని, తర్వాతవారెవరో వాల్మీకి ప్రాచీనతను స్థాపించటానికి చేసిన కల్పన ఇది అని, దీన్ని బట్టే వాటిని ప్రక్షిప్తాలుగా చెప్పవచ్చునని యాకోబి అంటాడు. యుద్ధ కాండంలోను వాల్మీకి తర్వాత యుద్ధ వర్ణనలు పెంచబడినవని కూడ అతని అభిప్రాయం. వింటర్ నిట్స్ అభిప్రాయంలోను 1,7 కాండాలు ప్రక్షిప్తాలే. ఈ రెండు కాండాలల్లోనే రాముడు విష్ణువు అవతారంగా ప్రతిపాదింపబడినాడు. మొదటి కాండంలోని కొన్ని విషయాలు తర్వాత కాండాలతో సరిపోవటం లేదని, ఈ రెండు కాండాలల్లోనే పౌరాణిక గాథలు కూర్చబడినవని కాబట్టి 2 నుంచి 6 కాండాలను రచించిన వాల్మీకి వీటిని వ్రాయలేదని అతని అభిప్రాయం. హోల్ట్స్‌మన్ అభిప్రాయం కూడ ఇదే. వాల్మీకి క్రౌంచపక్షి వియోగ దుఃఖంవల్ల కలిగిన ఆవేదనతో ప్రథమ శ్లోకాన్ని రచించాడు. ఆ శ్లోకం అనుష్టుప ఛందస్సులో వున్నది. తర్వాత వాల్మీకి రామాయణాన్నంతా అదే ఛందస్సులో రచించి వుంటాడని, తర్వాత వివిధ ఛందస్సులు చేర్చబడి రామాయణం పెంచబడిందని కొందరు విమర్శకుల అభిప్రాయం.

భారతీయ సంప్రదాయానుసారంగా రామాయణాన్నంతా వాల్మీకి రచించాడు. రామాయణ వృత్తాంతం జరగకముందే భవిష్యత్తులో జరుగబోయే కథనంతా నారదుడు వాల్మీకికి చెప్పాడట! బ్రహ్మ ఆదేశానుసారంగా నారదుడు చెప్పినదాన్ని వాల్మీకి కావ్యంగా వ్రాసాడు. ఆనంద వర్ధనుని వంటి ఆలంకారికులు (క్రీ.శ. 9వ శ॥) వాల్మీకియే ఉత్తరకాండతోసహా 7 కాండాలు గల రామాయణాన్ని రచించాడని అంగీకరించారు. ఇక వాల్మీకి అనుష్టుప ఛందస్సులోనే రచించాడని మిగతా ఛందస్సులు ప్రక్షిప్తాలని అంగీకరించినట్లయితే అనేక అందమైన శ్లోకాలు వాల్మీకి విరచితం కాదని చెప్పవలసి వుంటుంది. ఇక రాముడు విష్ణువు అవతారంగా చెప్తున్నాయన్న శ్లోకాలు, వృత్తాంతాలు పాఠకుల మనోధర్మాన్ని బట్టి అట్లా గోచరిస్తున్నవని, తర్వాత రచనల్లో రాముడు దేవుడుగా చిత్రింపబడినాడే గాని వాల్మీకి రామాయణంలో అట్లా జరుగలేదని కొందరి అభిప్రాయం. కాని రామాయణంలో అసలే ప్రక్షిప్తాలు లేవని చెప్పలేము. రామాయణంలో 500 సర్గలు 24000 శ్లోకాలున్నవని బాల కాండంలో చెప్పబడింది -

ఆదిప్రభృతివై రాజన్ పంచసర్గ శతాని చ
కాండాని షట్ కృతాని సోత్తరాణి మహాత్మనా.

కాని ఇప్పటి రామాయణంలో 650 సర్గలు 24000 కు పైగా శ్లోకాలున్నవి. అంతేగాక కొన్ని లుప్తమై కొన్ని ప్రక్షిప్తాలు కూడ కావచ్చును. కాబట్టి మహాభారతంలో వలె విస్తృతంగా ప్రక్షిప్తభాగాలు రామాయణంలో లేకున్నా, అది ప్రక్షిప్తాలకు దూరం కాలేదని మాత్రం గట్టిగా చెప్పవచ్చును.

వాల్మీకి

వాల్మీకి రామాయణకర్త అనటంలో సందేహమేమి లేదు. వాల్మీకి మొదట కిరాతకుడు. దారులుకొట్టి దొంగగా జీవించేవాడని, హఠాత్తుగా ఒకానొక సంఘటన చేత అతని హృదయంలో మార్పు వచ్చిందని ఐతిహ్యం. ఆధ్యాత్మరామాయణంలో వాల్మీకి మొదట బ్రాహ్మణుడే కాని కిరాతుల్లో కలిసిపోయి శూద్ర స్త్రీని వివాహమాడి సంతానాన్ని పొందాడని, దొంగగా జీవిస్తుండగా సప్తర్షులవల్ల అతనిలో మార్పు వచ్చిందని చెప్పబడింది. తైత్తిరీయ ప్రాతిశాఖ్యంలో వాల్మీకి పదకారునిగా పేర్కొనబడినాడు. కాని ఈ పదకారుడైన వాల్మీకి, కవివాల్మీకి ఒక్కరే అని నిరూపించలేము. ప్రాచీనకాలంలో భారతదేశపు తూర్పు సముద్ర తీరభాగమంతా చోళమండలంగా పేర్కొనబడేది. బ్రిటిష్‌కాలంలో అది కోరమండలంగా మారింది. ఈ సముద్ర తీరప్రాంతవాసులను చోళులని అనేవారు. చోళ శబ్దమే సంస్కృతంలో 'చోర' శబ్దంగా మారిందేమో. చోళులు దారులు కొట్టి నివసించేవారని ఈ అర్థ పరిణామంవల్ల తెలుస్తున్నది. వాల్మీకి చోళజాతికి చెందినవాడు కాబట్టి అతడు పూర్వాశ్రమంలో దోపిడికాడని కథ ప్రచారంలోకి వచ్చిందేమో చెప్పలేము. రామాయణానుసారంగా కవి వాల్మీకి ఆశ్రమం గంగానది సమీపంలో తమసానదీతీరంలో వున్నదని చెప్పబడింది. కాని అతని ఆశ్రమం గంగానది కాక ఇప్పటి బుందేల్‌ఖండ్‌లోని బందాజిల్లాలో అలహాబాదు సమీపంలో యమునానది తీరంలో ఒక పర్వతంమీద వుండేదని కొందరు అభిప్రాయపడ్తున్నారు. ఇదే చిత్రకూటమని కొన్ని రామాయణ ప్రతుల్లో పేర్కొనబడిందని వారంటారు. ఒకవేళ ఇదే నిజమైతే వాల్మీకి ఆశ్రమం అయోధ్యసమీపంలోనే వుండేది. అందుకే తరవాతి వారు వాల్మీకిని రామునికి సమకాలికునిగా కల్పనచేసి వుంటారు. వాల్మీకి రామాయణంలో పేర్కొన్న స్థలాలను జాతుల పేర్లనుబట్టి భారత దేశంలో పశ్చిమ ప్రాంతాలతో కాక తూర్పు, దక్షిణం, ప్రాంతాలతో, ముఖ్యంగా అయోధ్య మొదలుకొని ఒరిస్సా, గోదావరి ప్రాంత ప్రదేశాలతోనే అతనికి పరిచయమున్నట్లు తెలుస్తున్నది. కాబట్టి వాల్మీకి తూర్పు, దక్షిణ, ఆగ్నేయ ప్రాంతాలకు చెందినవాడనే చెప్పవచ్చును.

రామాయణ రచనాకాలం

మాక్‌డొనెల్ అభిప్రాయానుసారం రామాయణ రచన క్రీ.పూ. 500 కు పూర్వమే జరిగింది. వింటర్‌నిట్జ్ వంటి పాశ్చాత్య సాహిత్యచరిత్రకారులు రామాయణ రచన బుద్ధుని తర్వాతనే క్రీ.పూ. 3వ శ॥లో వ్రాయబడిందని నమ్ముతున్నారు. అతడు రామాయణ కథ మీద బౌద్ధమత ప్రభావం వున్నదని అంగీకరించాడు. అందుచేత బౌద్ధమతం బాగా వ్యాపించిన తర్వాతనే రామాయణం వ్రాయబడిందని అంటాడు. మాక్‌డొనెల్, యాకోబీలు రామాయణాన్ని బౌద్ధయుగానికి పూర్వరచనగానే భావించారు. యవనుల ప్రసక్తి బాల, కిష్కింధ కాండాలల్లో వుండటం వల్ల భారతీయులకు యవనులతో సంపర్కం కలిగింతర్వాత అంటే అలెగ్జాండర్ దండయాత్ర తర్వాత క్రీ.పూ. 3వ శ॥లో రామాయణం వ్రాయబడిందని కీథ్ అభిప్రాయం. రామాయణంలో యవనులతోపాటు శకులు కూడ పేర్కొనబడినారు. అటువంటప్పుడు రామాయణం శకుల దండయాత్రల తర్వాత క్రీ.పూ. 2వ శ॥ లో వ్రాయబడిందని చెప్పవలసి వుంటుంది. కాని ఇది సమంజసమైన కాలం కాదు. యవన శకుల పేర్లు ప్రక్షిప్తాలుగా రామాయణంలో చేరివుండవచ్చును. అది అసాధ్యమని చెప్పలేము. రామాయణ రచనా కాలాన్ని నిర్ణయించటానికి కొన్ని అంతస్సాక్ష్యాలు దొరుకుతున్నవి.

1) రామాయణంలో కౌశాంబి, కాన్యకుబ్జ, కాంపిల్య నగరాల ప్రసక్తి వున్నది కాని పాటలీపుత్ర ప్రసక్తిలేదు. పాటలీపుత్రం క్రీ.పూ. 380 ప్రాంతాన కాలాశోకునిచేత నిర్మింపబడింది.

2) రామాయణంలో అయోధ్యకు సాకేతమనే పేరు చెప్పబడలేదు. దానికి సాకేతమన్న పేరు బౌద్ధ జైనులచేత పేర్కొనబడింది. గ్రీకులుకూడ దాన్ని సాకేతమని పేర్కొన్నారు. పతంజలి మహాభాష్యంలోను సాకేతమని పేర్కొన బడింది.

3) రామాయణంలో మిథిల, విశాల రాజ్యాలు వేరువేరుగా చెప్పబడినవి. ఈ రెండు బుద్ధునికాలంలో వైశాలి అన్న పేరుతో సంఘటితమైనవి.

4) రామాయణంలో ఎక్కడా బౌద్ధ జైన మతాలప్రసక్తి ప్రత్యక్షంగాను పరోక్షంగాను కనబడటంలేదు.

పై సాక్ష్యాధారాలనుబట్టి రామాయణరచన బుద్ధునికి పూర్వమే జరిగిందని చెప్పవచ్చును. మరియు అష్టాధ్యాయికర్త పాణిని (క్రీ.పూ. 5వ శ॥) రామాయణ కావ్యాన్ని పేర్కొనకపోయినా దానిలోని పాత్రలను కొన్నిటిని పేర్కొన్నాడు. కాబట్టి రామాయణరచన

క్రీ.పూ. 5,6 శ॥ లకు పూర్వమే జరిగిందని చెప్పవచ్చును. మోనియర్ విలియమ్స్ రామాయణ రచనాకాలం క్రీ.పూ. 5 వ శ॥కి పూర్వమేకాని తర్వాతకాదని అంగీకరించాడు. మాక్‌డొనెల్ అభిప్రాయం కూడా ఇదే. యాకోబి రామాయణ రచనాకాలాన్ని క్రీ.పూ. 800-900 ప్రాంతమని అంగీకరించాడు. బుద్ధునికాలంలో ఇక్ష్వాకువంశరాజు ప్రసేనజిత్తు శ్రావస్తిని రాజధానిగా చేసుకొని పాలిస్తున్నాడు. ఇక్ష్వాకుల రాజధాని అయోధ్యనుంచి లవుని కాలంలో శ్రావస్తికి మారినట్లుగా రామాయణ ఉత్తరకాండలో వున్నది. ఇక్ష్వాకులు శక్తిమంతంగావుండి పరిపాలిస్తున్న సమయంలో వాల్మీకి జీవించివుంటాడని అంటె అది క్రీ.పూ. 5 శ॥కి పూర్వమే అని యాకోబి అభిప్రాయం. అశోకుని సమయంలో ప్రజలభాష ప్రాకృతం. బౌద్ధ జైనులు ప్రాకృతానికే ప్రాధాన్యమిచ్చారు. ప్రాకృతంకన్న సంస్కృతభాష బాగా వాడుకలో వున్నప్పుడే రామాయణ రచన జరిగిందని అది క్రీ.పూ. 800-900 ప్రాంతమని యాకోబి నిర్ణయించాడు.

రామాయణకథ ప్రతీకాత్మకమా?

రామాయణకథ నిజంగా జరిగిందా లేదా అనటంలో చాల అభిప్రాయ భేదాలున్నవి. పురాతత్త్వ సంబంధమైన ఆధారాలేవి లేందే ఇది జరిగిందని అంగీకరించటానికి చారిత్రకులు ఒప్పుకోవటం లేదు. కొందరు విమర్శకులు, చారిత్రకులు మహాభారతకథ జరిగిందేకాని రామాయణకథ జరిగిందికాదని, కవి కల్పితమని అంటారు. మరికొందరు విమర్శకులు దీన్ని ప్రతీకాత్మకమైన కథగా అంగీకరిస్తున్నారు.

వాల్మీకి బౌద్ధ దశరథ జాతక కథను గ్రహించి గ్రీకు మహాకావ్యం ఇలియడ్ ఆధారంగా విస్తరింపజేసి కావ్యంగా రచించాడని వేబర్ అభిప్రాయం. గ్రీకు ఇలియడ్ ప్రభావం రామాయణ కావ్యంమీద వున్నదన్న వేబర్ అభిప్రాయాన్ని వింటర్‌నిట్స్ నిరాకరించాడు. బౌద్ధమతం బాగా వ్యాపించి తర్వాత బౌద్ధధర్మ గ్రంథాలు వ్రాయబడింతర్వాత రామాయణ రచన సాగిందని, రాముని పాత్ర చిత్రణలో బౌద్ధమత ప్రతిపాదిత సౌమ్య ఉదార ఉదాత్త దయాగుణాలను చూడవచ్చునని కాని మొరుకువాడైన వీరున్నికాదని, ప్రత్యక్షంగా వాల్మీకి బుద్ధుని పేరునుగాని బౌద్ధబోధనలనుగాని ఎక్కడా చెప్పకపోయినా అంతఃప్రవాహంగా బౌద్ధ ధర్మ నీతి సచ్చరిత్రల ప్రభావాన్ని చూడవచ్చునని, ముఖ్యంగా రాముని పాత్ర చిత్రణలో దీన్ని చూడవచ్చునని వింటర్‌నిట్స్ అభిప్రాయం.

వేబర్ రామాయణ గాథను ప్రతీకాత్మకమని అంటాడు. అతని అభిప్రాయంలో సీత ఆర్యుల పశుపాలక వృత్తికి ప్రతీక. ఆర్యోత్తముడైన రాముడు దానికి రక్షకుడు. ఆర్యులను ఎదిరించే ఆదిమజాతులు రాక్షసులు. రామాయణంలోని రాముడు, శ్రీకృష్ణుని

సోదరుడు హలధారియైన బలరాముడు ఒక్కరే అని వేబర్ అభిప్రాయం. బలరాముడే రామునిగా రూపొందాడని ఆయన అంటాడు. దక్షిణ భారతంలో బ్రాహ్మణ బౌద్ధ ధర్మాలకుజరిగిన సంఘర్షణకు రామాయణగాథ ప్రతీక అని టాల్‌బాయస్ వీలర్ అభిప్రాయపడ్డాడు. లంకలోని బౌద్ధులు రాక్షసులుగా చెప్పబడినారని బౌద్ధమతాన్ని స్వీకరించిన లంక మీదికి రాముడు దండెత్తిపోవటమే రామాయణగాథ అని అతని అభిప్రాయం. ఆర్యులు దక్షిణభారతం మీదికి చేసిన దండయాత్రలల్లోమొదటి దండయాత్ర కథయే రామాయణ కావ్యరూపం ధరించిందన్న అభిప్రాయాన్ని లాస్సన్ ప్రకటించాడు. ఆర్య సంస్కృతి దక్షిణ భారతంలో ముఖ్యంగా లంకలో ఎట్లా వ్యాపించిందో రామాయణగాథ చాటుతున్నదని వేబర్ కూడ అంగీకరించాడు. ఋగ్వేదంలో వున్న ఇంద్ర వృత్రాసురుల కథ రామాయణ రూపాన్ని ధరించిందని యాకోబి మతం. అతని దృష్టిలో ఇంద్రవృత్రుల కథ కల్పితం, రామాయణ కథ కూడ కల్పితమే. వృత్రుడు ఒక అసురుడు, ఇంద్రుని శత్రువు. ఇంద్రుని ఆవులను దొంగిలించి అతడు సముద్రంలో దాచాడు. ఇంద్రుడు సరమ అనే కుక్కను ఆవుల జాడను కనుక్కునేటందుకు పంపాడు. సరమ ఆవుల జాడను తెలుసుకొని ఇంద్రునికి చెప్పాడు. ఇంద్రుడు మరుద్దేవతల సహాయంతో వృత్రుని మీద ఆక్రమణచేసి అతన్ని వధించి ఆవులను విడిపించాడు. యాకోబి మతానుసారం రాముడు ఇంద్రుడు, సీత గోవులు, గోవులకు పతి ఇంద్రుడు కదా! రావణుని కొడుకు ఇంద్రజిత్తు అనటం సార్థకంగా వున్నదని యాకోబి అభిప్రాయం. ఎందుకంటే ఇంద్రున్ని జయించిన వృత్రుడని ఆ పేరు సూచిస్తున్నది. మరుద్దేవతలు వానరులు, సరమ ఆంజనేయునిగా ఈ కథలో మారింది. ఋగ్వేద కథకు, రామాయణ కథకు యాకోబి సాధించిన సామ్యం ప్రశంసనీయంగా వున్నది కాని ఈ అభిప్రాయం సర్వజనాంగీకారమైంది మాత్రం కాదు. ఈ సామ్యం అంత యుక్తి యుక్తం గాను లేదు.

దక్షిణభారతంలో వ్యాపించివున్న శైవమతాన్ని వైష్ణవమతం జయించి విస్తరించటమే రామాయణగాథ పరమార్థమని స్వామి బ్రహ్మవర్తనుడనే పండితుడు తలంచాడు. రావణుడు శివభక్తుడు. రాముడు విష్ణువు అవతారం. రాముడు శివధనుస్సును విరచటం, పరశురాముని తేజస్సును గ్రహించటం దీన్నే సూచిస్తున్నదని ఆయన అంటాడు.

లంక అన్న పదానికి సంస్కృతంలో వ్యుత్పత్త్యర్థం (etymology) లేదు. బ్రౌన్ తెలుగు నిఘంటువులో లంకకు ద్వీపమనే అర్థమియ్యబడిందని యాకోబి చెప్తూ సింహళానికున్న లంక అన్న సంజ్ఞానామమే ద్వీపమనే జాతినామంగా తెలుగులో మారిందంటాడు. కాని జాతినామంగా వున్న లంక అన్న తెలుగు పదం రామాయణంలో సంజ్ఞానామంగా మా[illegible]ందని చెప్పాలి. తెలింగ తీర ప్రాంతంలో ద్వీపాలు ఏవి లేవని యాకోబి గుర్తించాడు.

తీరప్రాంతంలోని సముద్రంలో ద్వీపాలేవీ లేవు నిజమేకాని గోదావరి డెల్టా ప్రాంతంలో అనేక ద్వీపాలవంటి దిబ్బలున్నవి. ఈ దిబ్బలకు లంకలనే పేర్లు ప్రసిద్ధంగా వాడుకలో వున్నది. రామాయణంలో చెప్పబడిన లంక వీటిల్లోనే ఒకటి కావచ్చును. దండకారణ్యం సింహళానికంటే ఈ ప్రాంతానికే దగ్గరగా వుంటుంది. రాక్షసజాతి యక్ష నాగ గంధర్వ కిన్నర కింపురుషులతోపాటు పురాణాలల్లో చెప్పబడుతుంటుంది. ఈ జాతులు ప్రాచీనకాలంలో తూర్పు, ఆగ్నేయ, ఈశాన్య దిశలందున్నట్లుగా పురాణాలల్లోని కథనాన్ని బట్టి తెలుస్తున్నది. రాముని కాలంనాటికి ఈ జాతులు సముద్రతీర ప్రాంతం గోదావరి కృష్ణా డెల్టా భూములవరకు వ్యాపించివుంటవి. గోదావరికి చెందిన లంకల్లోనే నగరాలను నిర్మించుకొని వుంటారు. వాల్మీకి లంకను ఎన్నో చోట్ల నగరంగా మాత్రమే చెప్పటం కూడ గమనార్హం. రామున్ని పడవమీద నదిని దాటించిన గుహుడు గుహ్యజాతికి చెందినవాడు. రామునికి ఎంగిలిపండ్లు తినిపించిన శబరి శబర (సవర) జాతికి చెందింది. ఈ రెండు జాతులు నివసించిన భూములు ఇప్పటి ఒరిస్సా ఆంధ్ర ప్రాంతాలే. రాముడు సీతాలక్ష్మణులతో ఆశ్రమాన్ని నిర్మించుకొని నివసించింది గోదావరినదీ తీరంలోనే. కాబట్టి గోదావరీ డెల్టా భూమియే రామాయణంలో వర్ణించబడిన రాక్షస రాజ్యమని చెప్పాలి. అతి సారవంతమైన గోదావరి కృష్ణా డెల్టా భూములు తప్పక ప్రాచీన కాలంలోనే కృషి వాణిజ్యాలు ప్రధానమైన జాతులకు నివాసభూమియై నాగరికతతో కూడివుంటవి. అతి ప్రాచీన కాలంలో ఒరిస్సా, ఆంధ్ర ప్రాంతాలల్లో ఆటవికులు చిన్నచిన్న గుంపులుగా ఏర్పడి భౌగోళిక రక్షణ సరిహద్దులు గల చిన్నచిన్న భూములను తమ అధికారంలో వుంచుకొని పరిపాలన సాగించేవారు. ఒకొక్కసారి ఉత్తరభూముల నుంచి వచ్చిన క్షత్రియ జాతి వీరులు ఈ ఆటవికగుంపుల మీద అధికారాధిపత్యాలు వహిస్తూవుండేవారు. ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్ర పుళింధ్ర పుండ్ర మూతిబ మొదలైన జాతులు పేర్కొనబడినవి. వీరు దక్షిణ బెంగాల్, ఒరిస్సా, ఆంధ్రకోస్తా ప్రాంతాలల్లో నివసించే జాతులవారే! ఆంధ్ర పుళింధ్ర పుండ్ర మూతిబ మొదలైన ఆదిమజాతుల మీద క్రమక్రమంగా వైదికమతానుయాయులైన క్షత్రియ వీరులు ఆధిపత్యాన్ని సంపాదించుకోసాగారు. భారతదేశం నుంచి నిరాశాతప్తులైన, రాజ్య నిరాసితులైన క్షత్రియ రాజకుమారులు దూర ప్రాచ్య భూములకు (సుమత్రా, జావా, మలయేసియా, థాయిల్యాండు మొ॥నవి) పోయి అక్కడి రాజకుమార్తెలను వివాహమాడియో లేక భుజబలంతోనో రాజ్యాలను స్థాపించి ఏలారు. అదేవిధంగా క్షత్రియ వీరులు భారతదేశ దక్షిణ భూములకు వచ్చి రాజ్యాలను స్థాపించి వుంటారు. అంటె పరిపాలిత ప్రజలు ఆదిమ వాసులే కాని రాజా, ఉన్నతోద్యోగులు మాత్రం విజాతీయులు. అంటె ఉత్తర దేశానికి చెందిన క్షత్రియులు. రావణాసురుడు బ్రహ్మకులంలో పుట్టాడని చెప్పబడింది. వాలి ఇంద్రుని

కొడుకు, సుగ్రీవుడు సూర్యునికొడుకు అని చెప్పబడింది. ఉన్నతకుల సంజాతుడైన రావణుడు దక్షిణ దేశంలో రాజ్యాన్ని ఏర్పరచుకొని వుంటాడు. సారవంతమైన గోదావరి డెల్టాలోని ఏదో ఒక లంకయే అతని రాజ్యమై వుంటుంది. వైదికధర్మ విదూరులైన అతని రాజ్యప్రజలను రాక్షసులని, అతన్ని రాక్షసరాజు అని అనివుంటారు. క్రీ.శ. 4,5 శతాబ్దాల నాటి విశాఖదత్తుడు తన ముద్రారాక్షసం నాటకంలో జైనుడైన నందరాజుల మంత్రిని "రాక్షసు"డని పిలిచాడు. అవైదికమతానుయాయులను ముఖ్యంగా జైన మతనుయాయులను "రాక్షసు" లని పిలవడం కన్పిస్తుంది. జైనుడై శాస్త్రపాండిత్యం కలవాన్ని బ్రహ్మరాక్షసుడని అన్నారు. పాడుబడిన జైనులగుళ్ళను రాక్షసగుళ్ళు అని జనులు పిలవడం వున్నది. జైనశైవాల ప్రాగ్రూపం ఒక్కటేనేమో! సింధునాగరికతనాటి మతమదేనేమో! మొత్తం మీద రాక్షసులు వైదికధర్మ విదూరులు కాబట్టి దుర్మార్గులుగా చిత్రింపబడివుంటారు. వైదికధర్మభిన్నమైన ధర్మం, వర్ణాశ్రమ ధర్మానికి భిన్నమైన నైతిక జీవనవిధానం వారికి ఉండివుంటుంది. రావణుడు శాస్త్రవేత్తగా చెప్పబడినాడు. అతడు గొప్ప శివభక్తుడు కూడ. యజ్ఞయాగాది విధులు లేని శైవధర్మాన్ని రాక్షసులు అవలంబించి వుంటారు. రాక్షస జాతి నైతికంగా ధార్మికంగా భిన్నమైనది. విభీషణుని వంటి శరణాగతుల సహాయంతో ఆ భిన్న ధార్మిక నైతిక విధానాలను జయించటమే రామాయణ కావ్యంలో చిత్రించబడిందని చెప్పాలి. ఇటువంటి ధార్మిక నైతిక విధానాల మీద విజయమే కాక రామాయణంలో ఆదర్శవంతమైన గృహస్థజీవిత విధానం చిత్రించబడింది. వాల్మీకి రామాయణకథ అతడు చెప్పినట్లుగా తుచ తప్పకుండ జరిగి వుండకపోవచ్చును. కాని ఏదో కొంత సత్య సంఘటన మీదనే అతని కథ ఆధారపడి వుంటుంది. కావ్యకళ కొరకు అతడు చేసిన మార్పులు తప్పక చాల వుండి వుంటవి. ప్రభు ధర్మాన్ని, ఆదర్శ గార్హస్థ్యజీవితాన్ని వాల్మీకి భవ్యంగా చిత్రించదలచుకొన్నాడు. సమాజానికి నీతి ధర్మం శీలం సదాచరణ మొదలైన వాటిని బోధించాలనే తపన ఫలితంగానే ఈ కావ్యం పుట్టి వుంటుంది. అటువంటప్పుడు వాల్మీకి సత్య సంఘటనలల్లో ఏవో కొన్ని మార్పులను చేసివుంటాడనటమే సహజం.

రామాయణ మహాభారతాలల్లో ఏది ముందు?

ప్రాచీన భారతీయ సంప్రదాయాన్ననుసరించి రామాయణం మహాభారతం కన్న ప్రాచీనమైన రచన. రామాయణ కథ మహాభారతంలో చెప్పబడింది కాని మహాభారత కథగాని పాత్రలుగాని రామాయణంలో ఎక్కడా చోటు చేసుకోలేదు. అంతేగాక రామాయణంలో వర్ణింపబడిన రాజకీయ పరిస్థితులు మహాభారతం కన్న ప్రాచీనమైనవిగా కన్పిస్తున్నవి. మరియు రామాయణంలో వర్ణింపబడిన భారతదేశం గాని దానిలోని రాజ్యాలు

రాజులు గాని మహాభారతానికి పూర్వమైనవని అనిపిస్తున్నవి. దక్షిణభారతంలో వానరులున్నట్లుగాను, అక్కడ నాగరికత వికసించనట్లుగాను వాల్మీకి వర్ణనలనుబట్టి తెలుస్తున్నది. మహాభారతం నాటికి దక్షిణభారతంలో రాజ్యాలు వెలసినవి. ఆ రాజులు కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్నారు. మహాభారతంలో యుద్ధ విధానం సైతం రామాయణంలో కన్న అభివృద్ధి చెందినట్లు గోచరిస్తున్నది. ఈ కారణాలన్నీ రామాయణం మహాభారతం కన్న పూర్వ రచన అని తేలుతున్నది. భారతీయ సంప్రదాయాన్ననుసరించి రామావతారం కృష్ణావతారం కన్న ముందు, దీన్ని అనుసరించి కూడ రామాయణమే ప్రాచీనమైందని సమర్థించవచ్చును. రామాయణమే మొదట రచింపబడిందని యాకోబి సమర్థించాడు. రామాయణం ప్రభావంతోనే మహాభారతం మహా కావ్య రూపాన్ని ధరించిందని అతని అభిప్రాయం, కాని చాలామంది ఆధునిక ప్రాచ్య పాశ్చాత్య విమర్శకులు రామాయణమే అర్వాచీనమని తలంచారు. రామున్ని దేవునిగా భావించటం కృష్ణున్ని దేవునిగా కొలవటం కన్న చాల తర్వాత ఆరంభమైందని చారిత్రక విమర్శకుల అభిప్రాయం. మహాభారతంలో చెప్పబడిన కథలు కొన్ని వేదమతం బాగా ప్రచారంలో వున్నప్పటివని, రామాయణంలో వేద ప్రతిపాదిత మతం ఎక్కడా కనబడదని, జనకుడు ఉపనిషత్తుల్లో ప్రసిద్ధమైన రాజు అని కాబట్టి రామాయణం మహాభారతం కన్న అర్వాచీన రచన అని వింటర్ నిట్స్ అభిప్రాయం. లోకంలో ప్రచారంలో వున్న రామ సంబంధ కథలే బౌద్ధ జాతక కథకు వాల్మీకి రామాయణ కథకు ఆధారమైనవని వింటర్ నిట్స్ అంటాడు. వేద సంబంధ కథలే రామాయణ కథారూపాన్ని ధరించనవని వేబర్, యాకోబీల అభిప్రాయాన్ని బట్టి వేదకాలానికి, రామాయణ కాలానికి చాల వ్యత్యాసం వున్న దనడానికి వీలున్నదని వింటర్ నిట్స్ అంటాడు. మహాభారతంలో రామాయణ కథ వుండటంచేత, హరివంశంలో రామాయణ నాటక ప్రసక్తి వుండటంచేత మహాభారతం అర్వాచీనమని చెప్పటానికి వీల్లేదు. రామాయణం యొక్క ప్రాచీనతను నిరూపించటానికే ఎవరో రామాయణ కథను దానిలో చేర్చివుంటారు. మహాభారతం నిరంతరంగా పెరుగుతూ వచ్చింది. క్రీ॥ శ॥ 2 శ॥ నాటికది ప్రస్తుత రూపాన్ని సంతరించుకొన్నది. మహాభారతం తుది రూపాన్ని ధరించకముందే రామాయణ రచన జరిగింది. అంటే రామాయణ రచన తర్వాత కూడ మహాభారతంలో ప్రక్షిప్తాలు చేరుతూనే వున్నవి. రామాయణ రచన తర్వాతనే మహాభారతం తుదిరూపాన్ని దిద్దుకోవటంచేత మహాభారతం అర్వాచీనమనే వాదం బయలుదేరిందేమో! మహాభారతంలోని రామోపాఖ్యానం పూర్తిగా ఎటువంటి మార్పులు లేక వాల్మీకి కథనే అనుసరిస్తున్నది. ఎన్నో వాల్మీకి శ్లోకాల భావాలు మహాభారతంలో వున్నదున్నట్లుగా దింపబడినవి. దీన్ని బట్టి వాల్మీకి వ్యాసున్ని అనుకరించాడని కాక రామాయణం బాగా ప్రచారం పొందింతర్వాత ఎవరో వాల్మీకి కథను

మహాభారతంలో చేర్చి వుంటారని అనాలి. హాప్కిన్స్ అభిప్రాయంలోను రామాయణమే అర్వాచీనం. రామాయణం ఏక సూత్రంలో వుండి చక్కని కావ్యశిల్పం కలిగి వుండటమే దీన్ని సమర్థిస్తున్నదని అతను అంటాడు. మహాభారతంలో శ్లోకాలతోపాటు అక్కడక్కడ గద్యం ప్రయోగింపబడింది. ఈ రచనా విధానాన్ని బట్టి మహాభారతమే ప్రాచీన రచన అని నిర్ణయించవచ్చునని ఓల్డెన్‌బెర్గ్ అంటాడు. ఒకొక్కచోట మహాభారతభాష వైదిక గద్యానికి దగ్గరగా వున్నదని వింటర్‌నిట్స్ గమనించి మహాభారతం ప్రాచీన రచనగా అంగీకరించాడు.

మహాభారత కథా సంఘటనల కన్న రామాయణ కథా సంఘటనలు ప్రాచీనమైనవని, వాల్మీకి అది దృష్టిలో వుంచుకొని కథను, కథలోని పరిస్థితులను ఆయుధాది విశేషాలను, సామరిక పద్ధతులను వర్ణించటానికి ప్రయత్నించాడేమో. అందుకే దీనిలోని యుద్ధవిధానాలు చాల ప్రాచీనమైనవిగా కన్పిస్తున్నవి.

మహాభారతం ఆలంకారిక శైలిలో కావ్యరూపంలో లేదు. జయేతిహాసం వేదాలల్లోని నారాశంసి గాథలకు దగ్గరగా వున్నది. అదీగాక మహాభారతం ప్రధానంగా ఇతిహాస రచన. రామాయణంలో శైలి ఆలంకారికమైంది. దీనిలో కావ్య సామగ్రి అంతా ఏకత్రితమైంది. అంగి అంగరసాల పోషణ జరిగింది. ఉపాఖ్యానాలు, ధర్మ నీతి బోధనలతో మహాభారతం పురాణాల రచనా విధానానికి దగ్గరగా వున్నది. కాబట్టి రామాయణమే ఆదికావ్యమని వాల్మీకియే ఆదికవి అని అంగీకారయోగ్యమైంది. మహాభారతంలో కన్న రామాయణ కథాసంవిధానంలో ఐక్యత కన్పిస్తున్నది. భాష, కవిత్వం, ఛందస్సులల్లో పరిపూర్ణత కన్పిస్తున్నది. భావప్రకటనలో గల వక్రోక్తి నైపుణ్యం మహాభారతంలో రామాయణంలో వలె లేదు. రామాయణంలోని కావ్యకళయే తర్వాత కాళిదాసాదుల చేతిలో వికసించి స్థిరపడింది.

మహాభారతం, రామాయణాలల్లో చిత్రింపబడిన సామాజిక పరిస్థితులు విభిన్నంగా వున్నవి. మహాభారతం కథాసంఘటనలు మధ్య, పశ్చిమ, వాయవ్య భారత దేశంలో జరిగినవి. అది వీరుల యుగంగా కన్పిస్తున్నది. మహాభారతం యుద్ధాలు, రాజ్యవిస్తరణలతో నిండివున్నది. దానిలో ఒక మోటుదైన అవికసిత నాగరికత చిత్రింపబడగా రామాయణంలో వికసితమైన గొప్పనాగరికత కన్పిస్తున్నదని వింటర్‌నిట్స్ అభిప్రాయం. ఆగ్నేయ తూర్పు దక్షిణ భారతదేశంలో రామాయణకథ సంఘటనలు జరిగినవి. మహాభారతానికి రంగభూమి మధ్యపశ్చిమ వాయవ్యంగా విస్తరించిన భూములు కాగా రామాయణానికి రంగభూమి తూర్పు దక్షిణ భారతదేశం. మహాభారత నాగరికతకు రామాయణ నాగరికతకు చాల అంతరం వున్నది. అయితే సూక్ష్మంగా పరిశీలిస్తే కనిపించే భేదం

కాలభేదాన్నిబట్టి ప్రాంతభేదాన్నిబట్టి కావ్య ప్రక్రియ భేదాన్ని బట్టి ఏర్పడిందని చెప్పవచ్చును. రామాయణంలో యుద్ధాదులు అంత అభివృద్ధి దశను అందుకోలేదని అనిపించినా ఇతర విషయాలను అంటె ముఖ్యంగా సదాదరణ, శీలం మొదలైనవాటి చిత్రణను భాష భావవ్యక్తీకరణలు తీసుకుంటె రామాయణం అర్వాచీన రచన అని తేలగలదు.

రామాయణ కథ రూపాంతరాలు

వ్యక్తులజీవిత చరిత్రలను తీర్చిదిద్దగల రామాయణకథ భారతదేశం నలుమూలల్లోనేకాక ఖండాంతరాలల్లోను ప్రాచీన కాలంలోనే వ్యాపించింది. అట్లా వ్యాప్తి చెందేటప్పుడు ఆ కథ కాల, ప్రాంతభేదాలనుబట్టి ఎన్నో రూపాలను సంతరించుకొన్నది. భారతదేశంలో వివిధ ఆస్తికనాస్తిక మతాల ప్రభావాలనుబట్టి, ప్రాంతీయ భేదాలనుబట్టి రామాయణకథ నానా రూపాలను ధరించింది. బౌద్ధులల్లో జైనులల్లో రామాయణకథ ప్రచలితమైంది. బౌద్ధసాహిత్యంలో దశరథజాతకకథ పేరుతో రామాయణకథ రూపాంతరంచెంది కన్పిస్తున్నది. బౌద్ధజాతకకథ అయిన దశరథ జాతకకథలోని రాముడు బుద్ధుని పూర్వ జన్మావతారంగా చెప్పబడినాడు. ఈ కథానుసారంగా దశరథుడు వారాణసి రాజు. అతనికి 1600 మంది భార్యలున్నారు. పట్టపురాణికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు పుట్టారు. కొడుకుల పేర్లు రామలక్ష్మణులు కూతురుపేరు సీత. పట్టపురాణి మరణించగా రాజు మరొక రాణిని పట్టపురాణిగా చేసుకున్నాడు. ఆమెకు కలిగిన కుమారుడు భరతుడు. రాజు ఇచ్చిన వరం ప్రకారం ఆ రాణి తనకొడుకుకు రాజ్యమియ్యమని కోరింది. అటువంటప్పుడు రామ లక్ష్మణులకు రాజధానిలో క్షేమంలేదని వారిని 12 సంవత్సరాలు అరణ్యవాసం చేసి తన మరణానంతరం వచ్చి రాజ్యమేలుకొండని దశరథుడు ఆదేశిస్తాడు. రామలక్ష్మణులతోపాటు వారి చెల్లెలు సీత కూడ పోతుంది. దశరథుడు 12 సంవత్సరాలకు మరణిస్తాడని జ్యోతిషులు చెప్తారు. కాని 9 సంవత్సరాలకే అతడు మరణిస్తాడు. భరతుడు అరణ్యానికి పోయి తండ్రి మరణవార్తను రామునికి వినిపిస్తాడు. రాముడు నిర్వికారచిత్తంతో ఆ వార్తను వింటాడు. స్థితప్రజ్ఞుడైన రాముని శీలాన్ని చిత్రించటమే ఈ కథ ప్రధానోద్దేశం. భరతునికి రాముడు తన పాదుకలనిచ్చి వీటిని రాజస్థానంలో వుంచమని, 3 సంవత్సరాల తర్వాత తాను వచ్చి రాజ్యభారాన్ని గ్రహిస్తానని చెప్పి పంపిస్తాడు. తండ్రి ఆదేశానుసారంగా 12 సంవత్సరాల అరణ్యవాసాన్ని పూర్తిచేసుకొని రాముడు సీతాలక్ష్మణులతో వారాణసి తిరిగి వస్తాడు. మంత్రులు సీతను రామునికి పట్టపురాణిని చేసి రాజ్యాభిషేకం చేస్తారు. తర్వాత రాముడు 16,000 సంవత్సరాలు రాజ్యం చేస్తాడు.

జైన సాహిత్యంలోను రామాయణ కథ చాల ప్రాధాన్యం వహించింది. విమలసూరి (క్రీ.శ. 3వ శ॥) అన్న జైనకవి మహారాష్ట్ర ప్రాకృతంలో రామాయణ కథను "పఉమచరిఅ" అనే కావ్యంగా రచించాడు. దాన్ని ఆధారంగా కన్నడభాషలో నాగచంద్రుడు రామచంద్రచరిత్ర పురాణాన్ని రచించాడు. " పఉమచరిఅ"లో రామాయణ కథ చాలమట్టుకు వాల్మీకి రామాయణ కథను పోలివున్నా కవి జైనధర్మానుగుణంగా మార్పులను కూడ చేసాడు. దశరథునికి నలుగురు భార్యలనటం నలుగురికి నలుగురు కుమారులు జన్మించటం, రాముని నిష్క్రమణ తర్వాత దశరతుడు జినదీక్షను పొందటం, జనకునికి సీత, ప్రభామండలుడన్న కవలలు జన్మించటం, ఒక రాక్షసుడు ప్రభామండలున్ని ఎత్తుకొని పోవటం, ప్రభామండలుడు సీతను వివాహమాడదలచి చెల్లెలని తెలుసుకొని ఊరడిల్లటం, లక్ష్మణుడు దండకారణ్యంలో శత్రుందముని కూతురు జితపద్మను వరించి వివాహమాడటం, రామునిచేతిలో కాక లక్ష్మణుని చేతిలో రావణుడు చావటం, గర్భవతి అయిన సీతను ఆమె దాయాదవర్గంలోనివాడే (అంటే వాల్మీకి కాక) రక్షించటం, పతివ్రతను త్యజించిన రామునిమీదికి లవకుశులు యుద్ధానికి పోవటం, నారదుడు ఆ కవలలు రాముని బిడ్డలే అని తెలపటం మొదలైన అవాల్మీక సంఘటనలు పఉమచరిఅలో ఉన్నవి. జైనధర్మంలో అహింసాసిద్ధాంతం చాల ప్రధానమైంది. అహింసావ్రతంచేత కర్మ నశిస్తుంది. కర్మక్షయంచేత నిర్వాణం కలుగుతుంది. రామునిలో కర్మక్షయాన్ని కవి వర్ణించి అతన్ని స్థితప్రజ్ఞ లక్షణాలు కలవానిగా చిత్రించాడు. అందుకే రావణున్ని రాముడుకాక లక్ష్మణుడు చంపినట్లుగా కవి కల్పన చేశాడు. ఇదిగాక రవిసేనుడన్న జైనకవి సంస్కృతంలో రామాయణాన్ని వ్రాసాడు. దానిలో సీత రావణుని కూతురు, దానిలోను రాముడుకాక లక్ష్మణుడే రావణున్ని చంపుతాడు.

రామాయణ కథ టిబెట్, చైనా, మంగోలియా, జపాన్, థాయిలాండ్, కంపూచియా, బర్మా, సింహళ, ఇండోనేషియా వంటి సుదూర దేశాలకు వ్యాపించింది. ఆయా దేశాలల్లో కథ ఆయా ఆచార వ్యవహారాల కనుగుణంగా మారుతూ వచ్చింది. ఆయా దేశాల జానపద కథల, పాత్రల ప్రభావం కూడ రామాయణ కథ, పాత్రల మీద కన్పిస్తుంది. ఉదా॥కు కంపూచియాలో వ్యాప్తిలోవున్న రామాయణ కథలో సీత రావణుని కూతురు, మారీచుడుకాక ఇంద్రుడు బంగారు లేడి రూపాన్ని ధరించి వస్తాడు. సుగ్రీవుని కన్నీటి ధారలచేత ఏర్పడిన నదీప్రవాహాన్ని అనుసరించి వచ్చి రాముడు అతన్ని కలుసుకుంటాడు. హనుమంతుడు రామునికిని "సన్‌బెన్‌సీ" అన్న స్త్రీకి పుట్టిన కుమారుడు, సేతువు నిర్మాణానికి ఏడు సంవత్సరాలు పట్టింది. రావణుని బొమ్మను చిత్రించటంచేత సీత రామునిచేత

త్యజింపబడింది. ఇటువంటి విచిత్ర కల్పనలెన్నో దేశాంతరాలల్లో వ్యాపించిన రామాయణాలల్లో కన్పిస్తున్నవి.

వాల్మీకి రామయణ కథను, కథా ఘట్టాలను తీసుకొని తర్వాత సంస్కృత కవులు, దేశభాషా కవులు కావ్యాలుగా, రూపకాలుగా రచించారు. అట్లా కావ్య, రూపకాలుగా మార్చుకొనేటప్పుడు ఆయా ప్రక్రియలకు అనుగుణంగా మార్పులు చేశారు. అంతేగాక సమకాలిక నీతిధర్మాల కనుగుణంగా, ప్రజల అభిరుచిని, జానపదుల కథలను అనుసరించి, ఒక్కొక్కసారి అద్భుత చమత్కారసాధన కొరకు కథలో మార్పులు, చేర్పులు చేస్తూవచ్చారు.

ఆధ్యాత్మ రామాయణం

ఆధ్యాత్మ రామయణంలో సీతకాక మాయసీత రావణునిచేత చెరగొని పోబడుతుంది. సీత పవిత్రతను కాపాడేందుకే ఈ కల్పన చేయబడింది. "హెలెన్"అన్న ప్రసిద్ధ గ్రీకు నాటకంలో నిజమైన హెలెన్ ట్రాయ్‌కు తీసుకొని పోబడినట్లుగా కాక, ట్రాయ్ యుద్ధం జరిపించాలనే ఉద్దేశంతో దేవతలు మాయా హెలెన్‌ను సృష్టించి పారిస్ చేత తీసుకొని పోబడినట్లుగా కల్పన చేయబడింది. యుద్ధం జరుగుతున్నప్పుడు నిజమైన హెలెన్ ఈజిప్టులో వుంటుంది. యుద్ధమంతా అయిపోయింతర్వాత హెలెన్ భర్త మెనిలస్ ట్రాయ్ నుంచి వస్తూ ఓడ విరిగి ఈజిప్టు చేరుకొని ఆటవికుల చేతిలో చిక్కుకొని నిజమైన హెలెన్ సహాయంతో రక్షింపబడుతాడు. అక్కడి నుంచి వాళ్ళిద్దరు పారిపోయి స్వదేశం చేరుకొని సుఖంగా వుంటారు. నైతికసూత్రం కొరకు గ్రీకు కవులు ఇట్లా మాయాపాత్రలను సృష్టించటమున్నది. అదేవిధంగా ఆధ్యాత్మ రామాయణంలోను మాయాసీత పాత్ర సృష్టి చేయబడింది.

రామాయణ లోక ప్రియత్వం

భారతదేశంలో ఏ దేశ భాషలోనైనా రామాయణ కావ్యానికిగాని, రామాయణ కథకుగాని ఉన్నంత లోకప్రియత్వం మరి దేనికి లేదు. రామాయణ కథ దేశభాషల్లోనే కాదు సంస్కృతంలోనే ఆనేక కవులచేత కావ్య నాటకాలుగా వ్రాయబడి లోకాదరణను పొందింది. మానవ, ప్రభుధర్మాలకు రాముడు, సోదరధర్మానికి భరత లక్ష్మణులు, సతీధర్మానికి సీత ఆదర్శమూర్తులుగా గుర్తించని సంఘం, జాతి భారతదేశంలో లేదు. రామాయణ కథనేకాక రాముని పూర్వజుల ధర్మచరిత్రలను కాళిదాసు రఘువంశ మహాకావ్యంగా రచించాడు.

వాల్మీకి భాష, కవితా ప్రభావాలు కాళిదాసు మీద వున్నవనటం సర్వసువిదితం. రామాయణ కథ సేతుబంధ, భట్టి, జానకీహరణం వంటి కావ్యాలుగా రచింపబడినవి. ఇక రామాయణ కథ రూపకాలుగా వ్రాయబడింది. అవి లెక్కలేనన్నివిగా వున్నవి. వాటిలో ప్రముఖమైనవి - ప్రతిమ, అభిషేక, యజ్ఞఫల, మహావీరచరిత్ర, ఉత్తర రామచరిత్ర, అనర్ఘరాఘవ, బాలరామయణ, ప్రసన్న రాఘవ మొదలైనవి. వీటిల్లో పాత్రచిత్రణ, రసపోషణ, నాటకీకరణం కొరకై కవులు ఎన్నో మార్పులు చేసారు. భోజలక్ష్మణకవులు రామాయణాన్ని చంపూకావ్యంగాను వ్రాసారు. అంతేగాక వాల్మీకి రామాయణకావ్యం తర్వాత అనేక కవుల కావ్యాలకు మూలప్రేరణ అయిందనటంలో సందేహం లేదు.

భారతీయ ధార్మిక నైతిక గార్హస్థ్య జీవితాలకు రామాయణం అద్దం పడ్తున్నది. మాతాపితల, సోదర, మిత్ర, సేవక, పరిజన, పతిపత్నీ ధర్మాలను ఈ కావ్యం వ్యంగ్యం చేస్తున్నది. రామాయణం భారతీయ గృహస్థాశ్రమ ధర్మాన్ని బోధించే మహాకావ్యమని బల్దేవ ఉపాధ్యాయ పరిగణించారు. గార్హస్థ్యజీవితం యొక్క ఆదర్శ పూరితమైన ఉజ్జ్వల చిత్రణ మనకు దీనిలో కన్పిస్తున్నది. హిందూమతం ఇతర మతాలవలె నైతిక విలువలను బోధించేమతం కాదని పాశ్చాత్యులంటారు. కాని రామాయణ మహాభారతాలు లౌకిక జ్ఞానాన్ని, నైతిక ధార్మిక విలువలను బోధించే మహాగ్రంథాలు. యుగయుగాలుగా జాతి చరిత్రను చక్కదిద్దే రామాయణ మహాకావ్యాన్ని ఏదో ఆధునిక ఆర్థిక విలువల, యాంత్రిక పరిశ్రమల నడుమ లేచిన సిద్ధాంతాలను ఆదర్శంగా పెట్టుకొని విమర్శించటం అంత సమంజసమైన పనికాదు. జాతీయ కావ్యాలకు విపరీతార్థాలను చెప్పి ప్రజలను పెడత్రోవలను పట్టించటం ఏమంత ఉచితం కాదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలల్లో ధార్మిక, నైతిక, గార్హస్థ్య జీవిత విధానాలల్లో చాలా మార్పులు వచ్చినవి. వాటిని ఆధారంగా, స్త్రీ పురుషుల స్వేచ్ఛా జీవితం ఆదర్శంగా రామాయణాన్ని దుయ్యబట్టటం ఉచితం కాదు.

రామాయణ మహాకావ్యత్వం

రామాయణం సంస్కృతంలో ఆదికావ్యమనటంలో ఏమి సందేహం లేదు. మూల మహాభారతం నారాశంసిగాథ రూపంలో వున్న ఇతిహాసకావ్యం. తర్వాత దానిలో అనేక ఉపాఖ్యానాలు, ధర్మోపదేశాలు చేర్చబడి బృహద్రూపాన్ని పొందింది. ఒక పురాణ రూపాన్ని

ధరించింది. ఏకసూత్రతత అనే కావ్య ప్రధానతత్త్వం దానిలో లోపించింది. కావ్యకళ చాలామట్టుకు మృగ్యమైంది. కాని ఎడారిలో ఒయాసిస్సుల్లాగ మహాభారతంలో అక్కడక్కడ కథాకథనచాతుర్యం, వర్ణనలు, ఆలంకారికశైలి లేకపోలేదు. కాని అవి దానికి మహాకావ్యరూపాన్ని సంపూర్ణంగా ఇయ్యలేకపోయినవి. అంతేగాక దానిలోని కథ దాయాదుల నడుమ జరిగిన రాజ్యవిభాగ సంబంధ కథ. చాల విశాలమైంది. అనేక పాత్రలు దానిలో వున్నవి. దానిచేత కథ ఒక మహారణ్యం వలె కన్పిస్తున్నది. రామాయణంలో వలె విభావానుభావాదుల చేత పోషింపబడిన ప్రధాన రసంతో, అవాంతర కథలు ఎక్కువగా లేక ఆద్యంతం సంఘటనలతో ముందుకు నడుస్తున్న ఫలోన్ముఖమైన వస్త్వైక్యత గల ప్రధానకథ మహాభారతంలో లేదు. ఈ గుణాలన్నిటిని కలిగిన రామాయణం సంస్కృతంలో ప్రప్రథమ కావ్యంగా నిలుస్తున్నది.

రామాయణంలో ప్రధానరసం కరుణరసం. అసలు రామాయణ కావ్యోత్పత్తి కరుణం నుంచే ఉద్భవించింది. రామాయణంలో ఆరంభంనుంచి అంతం వరకు కరుణరసం అభివ్యంజితమై వున్నది. సందర్భానుకూలంగా శృంగార, వీర, అద్భుత, హాస్య, రౌద్రాదులు పోషింపబడినవి. రామాయణం రసాభివ్యక్తికే ప్రాధాన్యమిచ్చింది. ఇక ధార్మిక నైతిక విలువలను బోధిస్తున్నదంటె అది కాంతాసమ్మిత రూపంలోనే. మహాభారతం కాంతాసమ్మితత్వంగా కాక మిత్రసమ్మిత రూపంగా వుందని చెప్పాలి. మహాభారతంలో రాజకీయాలు, ఎత్తుకు పైయెత్తులు వీటికే ప్రాధాన్యం. మహాభారతం మనస్సును ఆలోచించేటట్లు చేస్తుంది. రామాయణం హృదయాన్ని కదిలించివేస్తుంది.

రామాయణ శైలి

వాల్మీకిశైలి ప్రసాదగుణభరితమైంది. అతనిశైలి వస్తురస వ్యంజకంగా వున్నది. లలిత సరళపదాల కూర్పు వాల్మీకి ప్రత్యేకత. వాల్మీకి కవిత్వ మంతా ధారాశుద్ధితో మాధుర్య భరితమై పాఠకులను అలరిస్తున్నది. సందర్భానుకూలంగా వాల్మీకి ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకాద్యలంకారాలను ప్రయోగించాడు. అక్కడక్కడ అప్రయత్నంగా ప్రయోగింపబడిన శబ్దాలంకారాలు కవిత్వానికి శోభనిచ్చినవి. వస్తువర్ణనలల్లోను వాల్మీకిది అందెవేసిన చేయి. అతడు చేసిన ఋతువర్ణనాదులు మనోహరాలైనవి. ఏ వస్తువును వర్ణించినా కనులకు కట్టేట్లుగా ప్రసన్న శైలిలో వాల్మీకి వర్ణించాడు. సరళ శైలిచేత అతని కవిత్వం కవితా గుణాన్ని పోగొట్టుకోలేదు. పుర, ఉద్యాన పర్వత, అరణ్యా, ఋతు, చంద్రోదయ, ఆశ్రమ, యుద్ధాది వర్ణనలు తర్వాత మహాకావ్యాలకు ఆదర్శమైన వర్ణ్య వస్తువులైనవి. ఈ వర్ణనలన్ని సహజరమణీయంగా వున్నవి. కవిత్వమంతా రసప్లావితమైంది.

రామాయణంలో సమకాలీన సమాజ చిత్రణ

రామాయణంలో రాముని సచ్చరిత్ర చిత్రణ ప్రధానంగా జరిగినా ఆయాచోట్ల సమకాలిక సమాజ చిత్రణ కూడ లభిస్తున్నది. సాంస్కృతిక, ధార్మిక, నైతిక, రాజనైతిక, ఆర్థిక సంబంధ సమాజ స్వరూపాన్ని వాల్మీకి అనేకచోట్ల చిత్రించాడు. ప్రాచీన భారతదేశంలోని సౌహార్ద, పరోపకారాలతో కూడిన ప్రజల జీవితాన్ని రామాయణం గొప్పగా చిత్రిస్తున్నది. ప్రాచీన కాలంలో భారతదేశంలో కుటుంబ వ్యవస్థ, జీవన విధానాలను తెలుసుకోవటానికి రామాయణం ఆదర్శమైన గ్రంథం. రాజనీతి, సమకాలిక రాజకీయాలు ప్రధానంగా మహాభారతంలో చిత్రింపబడినవి. రామాయణంలో గార్హస్థ్య జీవితంలోని నీతి ధర్మాలు చిత్రింపబడినవి. పితృవాక్పరిపాలన, మిత్ర భ్రాతృప్రేమ, పతీపత్నుల ప్రేమస్నేహాలు ఎట్లాంటివో రామాయణంలో చెప్పబడినవి. భారతీయుల నిస్వార్థమైన, కాంక్షారహితమైన మానవ ప్రేమ, అతిథిప్రేమలను వాల్మీకి ఎంతో బాగా చిత్రించాడు. రామాయణాన్ని చదివిన విదేశీయులకు భారతీయుల సమాజ, కుటుంబ జీవనక్రమం సుబోధకం కాగలదు. జాతి హృదయాన్ని బంధించి కావ్యరూపంలో పెట్టిన వాల్మీకి ధన్యుడు. అందుకే అతడు మనకు కాళిదాసువలె ప్రియమైనవాడు. జాతియొక్క నాడిని తెలుసుకొని స్పందింపజేసే శక్తి వారిద్దరికున్నది. అటువంటివారే జాతీయ కవులనబడ్డారు.

రామాయణ కాలంలో సమాజం ధార్మిక ప్రవృత్తి కలది. సత్యవాక్పరి పాలన వారి ప్రధాన కర్తవ్యం. ముఖ్యంగా రాజు సత్యధర్మాలను అనుష్ఠించే వాడుగా ఉండాలి. రాజు ప్రజలకు ఆదర్శంగా నిలవాలి. అప్పుడే రాజ్యం సుఖసంతోషాలతో కూడి వుంటుంది. రామాయణ కాలంలో స్త్రీలకు గౌరవ సన్మానాలుండేవి. అన్ని ధర్మకర్మానుష్ఠానాలు భార్యతో కలిసే భర్త నిర్వహించేవాడు. కుటుంబంలో స్త్రీదే ప్రధానపాత్ర. స్త్రీలు ఆ కాలంలో ధర్మపరాయణలుగా, నీతికుశలురుగా, పాండిత్యం కలవారుగా ఉండేవారు. పతి సేవయే స్త్రీకి ప్రథమ కర్తవ్యం. పత్నికి సుఖసంతోషాల నియ్యటమే భర్త ప్రథమ ధర్మం. కాని ధర్మానుష్ఠాన సమయంలో భర్త భార్య పుత్రులు అనే మోహాన్ని త్యజించి కఠోరంగా ప్రవర్తించగల నియమపాలనాశక్తి వారికుండేది. తల్లిదండ్రులకు సంతానం మీద అతివాత్సల్యం, సంతానానికి తల్లిదండ్రులమీద భక్తి గౌరవాలుండేవి. బహుభార్యాత్వం ప్రచారంలో లేదని చెప్పలేము. కాని పురుషుని పరస్త్రీ వ్యామోహం సంఘంలో నిరసింపబడేది. వైవాహిక జీవితాన్ని సుఖమయం చేసుకోవాలంటే భార్యభర్తల నడుమ ప్రేమ వుంటే సరిపోదు. ఒకరి మీద ఒకరికి విశ్వాసముండాలి. స్త్రీలకు భర్తలను వరించే హక్కు వుండేది. కాని గాంధర్వ ప్రణయ వివాహాలున్నట్లు కన్పించదు.

ఋషులు, మునులు అరణ్యప్రాంతాలల్లో ఆశ్రమాలను ఏర్పరచుకొని నివసించేవారు. వారి కర్మానుష్ఠానాదులు సక్రమంగా నడిచేటట్లుగా చూసే బాధ్యత రాజుపై వుండేది. యుద్ధంలో ధనుర్బాణాలే ప్రధాన ఆయుధాలు. ఎక్కువగా రథ, భట సైన్యమే వుండేది. ప్రయాణాదులకు రథాలనే ఉపయోగించేవారు. రాజు పురోహిత మంత్రుల సహాయంతో రాజ్యాన్ని పరిపాలించేవాడు. రాజు యథేష్టంగా ఆచరించేవాడుకాదు. ప్రజాభిమతానుసారంగా అతడు నడుచుకోవలసివుండేది. ఈ విధంగా రామాయణ కాలంనాటి సమాజం అన్ని విధాల ఉన్నతదశలో వుండి సుఖశాంతులతో వుండేదని తెలుస్తున్నది. ఇదంతా వేదరచనానంతరపు ఉపనిషత్కాల సంస్కృతికి దగ్గరగా వున్నట్లు గోచరిస్తున్నది.

ద్వితీయాధ్యాయము

రామాయణమహాభారతములు

ఇవి యెప్పటివి ? వీనిలో నేది ముందు ? ఏది వెనుక ? అను విషయముల ననేకు లనేకవిధములఁ జర్చించి వారివారికిఁ దోఁచినట్లు సిద్ధాంతీకరించి యున్నారు. అందుకుఁ గారణ మిదమిత్థ మనఁదగిన ప్రబలప్రమాణములు లేకపోవుటయే. ఇపుడు వారిచర్చ లన్నియు గ్రహించి పరామర్శించుట యనావశ్యకము. మనకు లభించిన యాధారములనుబట్టి వీని పౌర్వాపర్యాది విషయములు తెలిసికొందము.

ఇతిహాసము సంహిత ఆఖ్యానము, అను నామము లీరెంటికిని వీనియందే లభించుచున్నవి. జయ మనుపేరు రామాయణమున లేదుకాని, భారతమువలెనే యిదియును, అష్టాదశ పురాణములుఁగూడ జయసంజ్ఞకల వని భవిష్యత్పురాణము చెప్పుచున్నది[1]. విశేషించి రామాయణ మాదికావ్య మార్షము వేదసమ్మితము. భారత మార్షము పంచమవేదము. ఏకనాయక మగు రామాయణము పరిక్రియ యనెడి యితిహాసము. బహునాయక మైన భారతము పురాకల్ప మనెడి యితిహాసము[2]. ఆ కథ త్రేతాయుగములోనిది. అందలి నాయకుఁ డవతారపురుషుఁ డైన శ్రీరాముఁడు. ఈ కథ ద్వాపరాంతమునాఁటిది. కలియుగమున ౬౫౩ సంవత్సరములు గడచినంతఁ గురుపాండవు లుదయించిరని రాజతరంగిణీమతము. ఇందలి కథా ప్రవర్తకుఁడు శ్రీరాముని తరువాతి యవతారపురుషుఁ డగు రామకృష్ణుఁడు. ఇది, యిట్లుండ, సప్తమహర్షులలోని అత్రి భరద్వాజ వసిష్ఠ విశ్వామిత్రులకు రామ కథతో సంబంధము కలదు గాని, ఆ ప్రాచీన మహర్షులలో నొకరిని భారత ప్రధాన కథతో సంబంధములేదు. మఱియు, ఉత్పత్తిక్రమమునుబట్టి యేకనాయక కావ్యము ముందు పుట్టుటయు, బహునాయక కావ్యము దానిమీఁదిపెంపుగాఁ దరువాతఁ బుట్టుటయు సహజము. అట్లే మొట్టమొదటికథ సరళముగా నుండుటయు, తరు

1. అష్టాదశ పురాణాని రామస్య చరితం తథా,
   కార్ష్ణో వేదః పంచమశ్చ యం మహాభారతం విదుః,
   జయేతినామ్నా త్వేతాం స్తు ప్రవదంతి మనీషిణః.
2. పరిక్రియా పురాకల్ప ఇతిహాసగతి ర్ద్విధా.
   స్యాదేక నాయకా పూర్వా, ద్వితీయాబహునాయకా ; కా. మీ

వాతికథ త్రికమకలుగా నుండుటయుఁగూడ సాజమే. దీనికిఁ దగినట్లుగా శ్రీరాముఁడు ధర్మనిష్ఠయే కాని, తనచర్యయందు రాజనీతిజ్ఞత చూపినవాఁడు కాఁడు. ధర్మరాజు ధర్మవర్తనుఁ డయ్యు రాజనీతి పారంగతుఁడై కార్యము నడపినవాఁడు. సీత అయోనిజ, పతియేతక్క నన్యమెఱుఁగని యమాయకురాలు. ద్రౌపదియు నయోనిజ. కాని, పతులకు సమరోత్సాహము కలిగించిన లోకజ్ఞురాలు ధీరురాలు. భరతలక్ష్మణులు మిన్ను విఱిగి మీఁదఁ బడినను, అన్నగారిమాట కడుగుదాఁటని వినయమూర్తులు. భీమార్జునులుగూడ నట్టివారే యైనను, అపు డపుడు కార్యవేగమున మైమఱచి యన్నను మీఱిన మత్సరగ్రస్తులు. అందు ప్రతినాయకుఁ డైన రావణుని మూర్ఖత్వము సీతను గొనిపోయి బెదరించుటతో సరిపోయినది. ఇందు దుర్యోధనుని మొఱకుఁదనమో ద్రౌపదిని గొప్పువట్టి సభ కీడ్పించి భర్తలయెదుట నామెచీర లొలిపించువఱకును బోయినది. సంగ్రామనియమములు సమయములు వ్యూహములు రామరావణరంగమున నంతగా లేవు. అవి యన్నియుఁ గురుక్షేత్రమునఁ దలచూపినవి. దానినాఁడు కొంచె మెచ్చుతక్కువగా గాఢారణ్యమైన దక్షిణాహిందూదేశమున దీనినాఁడు కొంచెము నాగరికతగాంచిన జనపదము లేర్పడినవి. ఇంత యేల? రామాయణమున నద్భుతవర్ణన లెక్కువ. భారతమున నవి తక్కువ. రామునిది వానరసేన. కురుపాండవులది మానవసేన. అక్కడలేని చతురంగబల మిక్కడ నున్నది. దీనినంతనుబట్టి రామాయణకథ ముందనియు భారతకథ వెనుక యనియుఁ దెలియకపోవునా? అయినా, రామకథ పూర్వమే కావచ్చును గాని, రామాయణరచనముకంటె భారతరచనము పూర్వమనెడిమతము మాత్ర మొకటి యున్నది. ఈయభిప్రాయ మావిష్కరించినవారు మఱికొందఱు కూడఁ గలరుగాని, యిం దెక్కువపట్టుదల చూపినవాఁడు వాష్బర్న్హాప్కిను పండితుఁడు. (E. Wash Burn Hopkin)[1]. కావున నీవిషయము పరామర్శించి యీమత మెంతవఱకు నిలచునో చూతము.

భారతమున రామోపాఖ్యానము కనఁబడుచున్నది కాని, రామాయణమున నేసందర్భమందును భారతప్రధానకథలోని యొకపాత్రము పేరైనఁ గనరాదు. రామచరితమును వాల్మీకిని పేర్కొని యందలి కొన్నిశ్లోకములను భారత ముదాహరించినది గాని, భారతమును గాని తత్కర్తను గాని రామాయణ మెందును స్మరింపలేదు. ఇందుకుఁ గొన్ని యుదాహరణములు :—

1. See The Great Epic of India. ch. II.

"భీష్మద్రోణులు ధర్మమునందు దాశరథిరామునికిఁ దీసిపోరు" అని విదురుఁ డనును. [1].

"సర్వే క్షయాన్తా నిచయాః పతనాన్తా స్సముచ్ఛ్రయాః,
సంయోగా విప్రయోగాన్తా మరణాన్తం చ జీవితమ్."
అను రామాయణశ్లోకము భారతమున సరిగా నిట్లే యున్నది [2].
మరియు—
"యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహార్ణవే,
సమేత్య చ వ్యపేయాతాం కాలమాసాద్య కంచన." [3].
"ఆసన్ వర్షసహస్రాణి తథా పుత్రసహస్రిణః,
నిరామయా విశోకాశ్చ రామే రాజ్యం ప్రశాసతి." [4].
"దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ,
భ్రాతృభి స్సహిత శ్శ్రీమాన్ రామో రాజ్య మకారయత్" [5].

అను రామాయణశ్లోకము లొకటిరెండు మాటలమార్పుతో భారతమునఁ గనఁబడుచున్నవి. "సరే కాని, భారతములోని రామోపాఖ్యానమునే వాల్మీకి తీసికొని విస్తరింపఁజేసి రామాయణము రచియించెననియు, పైశ్లోకములను భారతమునుండియే రామాయణము గ్రహించె ననియు నేల తలంపరాదు" అనెడి యాక్షేప మిక్కడ గలుగవచ్చును. అందుకు సమాధానము :—

స్త్రీవధ యుచితము కా దని రామాయణము చెప్పిన యీక్రింది మాటలను వాల్మీకిపేరెత్తి భారతము గ్రహించియున్నది.

"నహన్తవ్యాః స్త్రియ ఇతి యద్బ్రవీషి ప్లవంగమ !"
రా.యు. 81. 29.

"అపి చాయం పురాగీతః శ్లోకో వాల్మీకినా భువి,
న హన్తవ్యాః స్త్రియ ఇతి యద్బ్రవీషి ప్లవంగమ !"
భా. ద్రో. 143. 68.

1. భార, ఆది. 205 అధ్యా.
2. రా. అయో. 105. 16—భా. శాం. 27. 31.
3. రా. అయో. 105. 26—భా. శాం. 28. 37.
4. రా. యు. 131. 103—భా. శాం. 29. 58.
5. రా. యు. 131. 108—భా. శాం. 29. 64.

మఱియు నయోధ్యాకాండములోని యఱువదియేడవ సర్గయందు 'నారాజకే జనపదే' అనుపాద మారంభముగాఁగల శ్లోకములవిషయము శాంతి పర్వమున ౬౭, ౬౮, సర్గలయందు 'యది రాజా న పాలయేత్' అనుపాదము మకుటముగాఁగల శ్లోకములఁ గనవచ్చుచున్నది. మఱియు "అరాజకే ధనం నాస్తి నాస్తి భార్యా ప్యరాజకే" ఇత్యాదిరామాయణశ్లోకముల[1]" యర్థమును భారతము గ్రహించి పరిష్కరించుచు—

"శ్లోక శ్చాయం పురాగీతో భార్గవేణ మహాత్మనా,
ఆఖ్యానే రామచరితే నృపతిం ప్రతి భారత...
రాజ్య న్యసతి లోకస్య కుతో భార్యా కుతో ధనమ్"[2].

అని రామాఖ్యానమును భార్గవుఁడైన వాల్మీకిని పేర్కొనెను. ఇంకొకచో రామాయణమును[3] పెక్కుచోట్ల వాల్మీకిని[4] పేర్కొనెను. ఇట్లు భారతప్రాచీనత్వము తెలియవచ్చుచున్నను, ఈ శ్లోకము లన్నియుఁ బ్రక్షిప్తము లని యెవరైన ననవచ్చును. కాని, అరణ్యపర్వమునఁ గొంత యర్వాచీన మనియు శాంత్యాది పర్వములు కొన్ని తరువాతఁ జేరిన వనియుఁ గొంద ఱూహించినమాట సత్యమే కాని, ద్రోణపర్వము ప్రక్షిప్త మన్నవారు లేరు. అందుచే వాల్మీకిని పేర్కొన్న యందలిశ్లోకము ప్రక్షిప్తమగుట పొసఁగదు. ఇఁక దీని నిట్లుంచి పురాణసాక్ష్యము గైకొందము.

పురాణములు పూర్వపూర్వ మహాయుగ వృత్తాన్త జ్ఞాపకములు స్థలకాల మహాపురుషాది మహత్త్వబోధకములు నై యతిశయోక్తి భూయిష్ఠములై నట్లు కనఁబడుచున్న వని కొందఱు తలంచుట కలదు కాని, ఆ యతిశయోక్తుల నించుక తొలఁగించుకొని, యందు చొచ్చి నిదానించి పరీక్షించినచో నందు మఱుఁగుపడి యున్న సత్యము కొంత బయటఁ బడకపోదు.

వాఙ్మయ సంబంధముగల వాల్మీకు లిద్దఱున్నట్లు ప్రబల ప్రమాణ మెందును గనరాదు. అట్లే వాల్మీకికి వేదవిభజనముతో సంబంధ మున్నదనుటకు

1. రా. అయో. 67. 11.
2. భా. శాం. 57. 40.
3. రామాయణేఽతివిఖ్యాతః శ్రీమాన్ వానరపుంగవః. భా. అర. 147-11
4. ....వాల్మీకిశ్చ మహాతపాః, శమీక స్సత్యవాక్—భా. సభా. 7-16.
ఋషి ముఖ్యా స్సదా యత్ర వాల్మీకి స్త్వథ కశ్యపః. భా. అను. [illegible]-12
అసితో దేవల స్తాత వాల్మీకి శ్చ మహాతపాః. భా. శాం. 207-4

పురాణవచనములు తప్ప రామాయణమం దేమియు నాధారము కనరాదు. కాని, వాల్మీకియే రామాయణకర్త యనుటమాత్రము నిర్వివాదము.

పరాశరులుముగ్గురు నలుగురును వ్యాసులు పెక్కండ్రును గల రనుటకు వైదిక లౌకిక వాఙ్మయముల ననేకాధారములు కలవు. వేదవ్యాసునికి వేదవిభజనముతో సంబంధ మున్న దని పురాణములు చెప్పుచున్నవి. అతఁడే పంచమవేదము రచియించె నని భారతావతారిక చెప్పుచున్నది. కాని, వేదవ్యాసుఁడు లేక వ్యాసుఁ డనునది బిరుదము కాని, యొక ఋషి నామధేయము కా దనియుఁ బురాణములు చెప్పుచున్నవి. ఇవు డే పరాశరుని పుత్త్రుఁడైన యే వేదవ్యాసుఁడు భారతము రచియించెనను ప్రశ్న మటుంచి, కృష్ణద్వైపాయనుఁ డనఁబరగు పారాశర్యవ్యాసుఁడు భారతము రచియించె నన్న యితరపురాణవచనములను భారతవచనమును గ్రహించి రామాయణ భారతముల పౌర్వాపర్య మవలోకింతము.

పురాణములలో వాయు విష్ణు పురాణములు ప్రాచీనములని కొందఱి మతము. అందు, వేదములను విభజించిన మునులను పేర్కొనుచు, ఇరువదినాల్గవ వేదవ్యాసుఁడు ఋక్షుఁ డనియు, ఇరువది యెనిమిదవ వేదవ్యాసుఁడు ద్వైపాయనుఁ డనియు వాయుపురాణము చెప్పినది 1. ప్రతిద్వాపర మేకరాశిగా నున్న వేదములను విభజించు మహర్షి వేదవ్యాసబిరుదము వహించు ననియు. ఈవైవస్వతమన్వంతరమునఁ గడచిన యిరువై యెనిమిది ద్వాపరములందు నిరవై యెనమండుగురు ఋషులు వేద వ్యాసబిరుదము గాంచి రనియుఁ జెప్పుచు, ఇరువైనాల్గవ వేదవ్యాసుఁడు భార్గవుఁడైన వాల్మీకియను ఋక్షుఁ డనియు, ఇరువై యెనిమిదవ వ్యాసుఁడు కృష్ణద్వైపాయనుఁ డనియు, విష్ణుపురాణము చెప్పినది 2. కూర్మపురాణాదులు కొన్ని ఋక్షభార్గవనామములకు బదులుగా వాల్మీకి పేరే చెప్పినవి 3. ఈ పురాణసంప్రదాయమునుబట్టియు, 'భృగుర్వై వారుణిః' అను తైత్తిరీయోపనిషద్వాక్యమునుబట్టియు, వరుణవంశమువాఁడు భృగు వంశమువాఁడు నైనవాల్మీకి యొకఁడే యనియు, అతఁడు వేదవ్యాసుఁడు కూడనై

1. పరివర్తే చతుర్వింశే ఋక్షో వ్యాసో భవిష్యతి....
అష్టావింశే పునఃప్రాప్తే పరివర్తే క్రమాగతే....
యదా భవిష్యతి వ్యాసః నామ్నా ద్వైపాయనః ప్రభుః. పూర్వా, 23. అధ్యా.

2. ఋక్షోఽభూ ద్భార్గవ స్తస్మా ద్వాల్మీకి ర్యోఽభిధీయతే,
తస్మా దస్మత్పితా శక్తి ర్వ్యాస స్తస్మా దహం మునే (పరాశరః)
జాతుకర్ణో ఽభవన్మత్తః కృష్ణద్వైపాయన స్తతః. 3. 3. 11-19.

3. ఋక్షనామా త్రయోవింశే. వాల్మీకి స్తు తతః పరః—

యుండె ననియుఁ దెలియుచున్నది. కృష్ణద్వైపాయనుఁ డను నొక ఋషియు వేదవ్యాసుఁ డైనట్లు తెలియుచున్నది. "ఇఁక వీరే రామాయణ మహాభారతకర్త లనెడిప్రతీతినిబట్టి రామాయణము భారతముకంటెఁ బూర్వమనుట కాక్షేపమేమి?" అని మన మొకవిధముగా వీని పౌర్వాపర్యము నిర్ణయించుకొనుటకు ముందుగా గ్రాంథికమైన ప్రబల ప్రమాణ మొకటి యరయుదము.

శ్రీరాముఁడు రావణుని సంహరించి లంకారాజ్యమున విభీషణునికిఁ బట్టము గట్టినట్లు రామాయణము వర్ణించినదిగదా! సహదేవుఁడు దక్షిణదిగ్విజయయాత్రకు వెళ్ళినపుడు లంకేశ్వరుఁడు పౌలస్త్యుఁడు నగు విభీషణునివద్దకు దూతను బంపి యతనివల్ల రత్నాదులు కానుకగాఁ బుచ్చుకొనెనని భారతము వర్ణించినది [1]. విభీషణుఁడు పాండవులనాఁటికి లంకాపాలకుఁడుగా నుండెనోలేదో, అది యన్యవిషయము. వర్ణితాంశక్రమమునుబట్టి చూచినను భారతకథ కంటెను దాని రచనము కంటెను రామాయణకథయు దానిరచనమును బూర్వము లని విదిత మగుచున్నది. ఇఁక భారత పూర్వత్వవాదుల ముఖ్యాక్షేపములు కొన్నిటికి మనము సమాధానము చెప్పవలసి యున్నది.

రామాయణము, జనమేజయుని — కురుపాంచాలములను — హస్తినాపురమును పేర్కొన్నమాటసత్యము [2]. కాని, కురుపాంచాలములు బ్రాహ్మణారణ్యకము లందు కనవచ్చుచుండ, నివి భారతమునాఁడే వెలసినవని కాని, ఈపేళ్ళను భారతమునుండియే రామాయణము గ్రహించిన దని కాని యూహించుట యసంగతము కదా! పోనీ! హస్తినపురస్మరణ మందుమా, కౌరవపాండవులకుఁ బదుమూఁడుతరములు పూర్వుఁడైన హస్తి యనురాజు నిర్మించిన హస్తిపురమును వాల్మీకి యెఱుఁగుటకు భారతమే గతి యయ్యెనని తలంచుటకంటె వింత వేఱుండునా? ఇఁక జనమేజయశబ్దప్రయోగ మున్నది. ఈజనమేజయుఁడు కురువంశమువాఁ డని కాని, హస్తినాపుర రాజని కాని, రామాయణము చెప్పలేదు. దశరథబాణవిద్ధుఁడై మృతుఁడైన తనపుత్రునిగూర్చి యంధముని విలపించుచు "నాయనా! సగర శైబ్య దిలీప జనమేజయ నహుష దుంధుమారులు పొందినసద్గతిని జెందుము" అని పలికిన

4. ప్రేషయామాస రాజేంద్ర! పౌలస్త్యాయ మహాత్మనే,
విభీషణాయ ధర్మాత్మా ప్రీతిపూర్వ మరిందమః. సభా. 31-75.

1. తే హస్తినపురే గంగాం తీర్త్వా ప్రత్యఙ్ముఖా యయుః,
పాంచాలదేశ మాసాద్య మధ్యేన కురుజాఙ్గలమ్. అయో. 68-13.
యాంగతిం సగరశ్శైబ్యో దిలీపో జనమేజయః—అయో. 64-43.

సందర్భమున నున్న జనమేజయుఁడు, తక్కిన సగరాదులకుఁ గొంచెము దగ్గఱగా నున్నపురూరవునితరువాత నైదవపురుషుఁ డగు జనమేజయుఁ డని చెప్పుట యుచితము గాని, ఎపుడో తరువాతఁ గొన్ని వంశములయేండ్లకుఁ బుట్టిన పాండవప్రపౌత్ర జనమేయుఁ డని యూహించుట యెంతమాత్ర ముచితము కాదు. కావున నాక్షేపకులయాక్షేపములు పరిహరించుటతో భారతరచనముకంటె రామాయణ రచనమే పూర్వ మని విశ్వసించుచు దీనిని విద్వల్లోకమునకు విడుచుచున్నాను. ఇఁక—

రా మా య ణ భా ర త ము ల కా ల ము

వీనికాలమునుగూర్చి పెక్కండ్రు వ్రాసియున్నారు. నేఁటికిని వ్రాయుచున్నారు. వారిలోఁ గొందఱు వీని నెంతోమీఁదికి లాగిరి. కొందఱు మిక్కిలి దిగలాగిరి. వేదములే మొన్న మొన్నటి వన్న పాశ్చాత్యు లివి నిన్నటి వనుట వింత కాదు కాని, జాకోబీ వీబరు మొదలగువారి యభిప్రాయముల నీవిషయమునఁ జర్చించిన మాక్డోనలు పండితుఁడు, రామాయణము క్రీ. పూ. ఐదవశతాబ్ది కించుక ముందు రచియింపఁబడిన దనియు, భారతము క్రీ. పూ. మూడవశతాబ్దికిని మొదటిశతాబ్దికిని నడుమ రచియింపఁబడి యుండుననియు[2] సిద్ధాంతీకరించుటకుఁ గలహేతువుల నించుక విమర్శింతము.

"క్రీ. పూ. ౩౨౭ లో నుత్తరహిందూదేశముపై దాడి సలిపిన యలెగ్జాండ రనుగ్రీకువీరునితో గ్రీకుసైనికులు వచ్చిరి. వారే భారతమున వర్ణింపఁబడిన యవనులు. శకులు పహ్లవులు కూడఁ దత్ప్రాంతముననే హిందూదేశమునకు వచ్చిరి. శకయవనవర్ణనము రామాయణములోఁ గూడఁ గనఁబడును గాని, అది ప్రక్షిప్త మని జాకోబీపండితుఁ డనెను. భారతప్రధానకథలో దుర్యోధనునికి సహాయు లైనట్లున్న యవనుల వర్ణనము ప్రక్షిప్తము కాఁజాలదు. కావున రామాయణ మలెగ్జాండరు దండయాత్ర కావలిది. భారతము దాని కీవలిది." అనునది యితని సిద్ధాంతమందలి సారాంశము. దీనినిబట్టి, అలెగ్జాండరుతో వచ్చి యుత్తరమున నిలిచిన సైనికులకు సంబంధించిన గ్రీకులే భారతములో వర్ణింపఁబడినయవను లని వాదమున కంగీకరించినను, అలెగ్జాండరుతో నే కాక గ్రీకు లంతకు ముందే హిందూదేశమునకు వచ్చినట్లు కనఁబడుచున్నది. క్రీ. పూ. ౫౦౦ ప్రాంతమున డెరయస్ (Darius) అనుపారసీకరాజు దాటివచ్చి పంజాబులోఁ గొంతభాగ

2. Sansk. Lit. Ch. X.

మాక్రమించె ననియు, అతనిసేనలో, అయోనియా (Ionia) ద్వీపవాసులు (గ్రీకులు) కొందఱు కల రనియు నొకచరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు[1]. దీనిని బట్టి మేగ్దోనలు తలంపునకు విరుద్ధముగా గ్రీకులరాక, అలెగ్జాండరు దాడిని దాఁటి డెరయస్సుదాడివఱకును రెండు శతాబ్దులువెనుకకుఁ బోయినను, భారతములో వర్ణింపఁబడినయవనుఁ లాగ్రీకులైనఁ గావచ్చు ననుట కవకాశము లేకపోలేదు. అందుచే, క్రీ. పూ. పంచమశతాబ్దికి మున్నె యవనశబ్దము వాఙ్మయములోనున్నట్లు చూపించినఁ గాని మేగ్దోనలువాదము పూర్తిగాఁ బ్రతిహతము కాఁజాలదు.

పాణినీయవార్తికకారుఁ డగు వరరుచికాత్యాయనుఁడు యవనశబ్ద ముదాహరించి యవనులలిపి యవనాని యని చెప్పియున్నాఁడుగాని[2] అతఁడు పంచమ శతాబ్దిలోనివాఁడే యని యందురు. కాని, క్రీ. పూ. సప్తమశతాబ్ది కావలివాఁ డని బహుపరిశోధకులు నిర్ణయించిన పాణిన్యాచార్యులు యవనశబ్ద ముదాహరించి యున్నాఁడు[3]. అతనికిఁ బూర్వుఁ డయినశాకటాయనుఁడును యవనశబ్దము వక్కాణించియున్నాఁడు[4]. దీనినిబట్టి డెరయస్సునకు మిక్కిలి పూర్వమే, ఉత్తరహిందూ దేశమున యవనజాతి యొకటి యున్నట్లును, దానిలిపి యవనాని యనఁబడినట్లును విదిత మగును. కావున భారతములోనియవనులు, పాశ్చాత్యులు తలంచినట్లు, డెర యస్సుతోఁ గాని, అలెగ్జాండరుతోఁ గాని వచ్చిన అయోనియనులును గ్రీకులును గా రనుట నిజము. కాని, యిక్కడ నొక్కమాట. పూర్వమందు హిందూదేశ మున నున్నయవనులను బోలి యుండుటచేతనో మఱెందుచేతనో కాని, అలెగ్జాండ రుతో వచ్చి యిందు నిలిచిన గ్రీకులను మనపూర్వులు యవను లనుపేర వ్యవహ రించి రనిమాత్ర మంగీకరించవచ్చును. ఇందు కాంగ్లేయులను మొన్న మొన్నటి వరకును మనవారు హూణులని వ్యవహరించుటయే యొక నిదర్శనము. కావున, కాళిదాసాదులు గ్రీకులను యవను లని వాడినను, ఆ గ్రీకులే శాకటాయనాదులు సూచించిన యవనులని భ్రాంతి పడరాదు. అయితే. శాకటాయనాదులు పేర్కొన్న యవను లెవరు? ఎక్కడివారు?

---

1. Cambridge History of India - Vol. I P. 540.

2. యవనా ల్లిప్యామ్.

3. ఇంద్రవరుణ....యవనమాతులాచార్యాణామానుక్. అష్టా. 4, 1. 49—1. 175.

4, యవనయవాల్లిపిదుష్టే. శా. వ్యా. 1. 3. 56—గణపాఠములో-యవన-శక-చోళ—

భారతకాలమున నుత్తరమందును దక్షిణమందును గూడ యవనుల జాతి నివసించియున్నట్లు కనఁబడుచున్నది[1]. క్రౌర్యమునుబట్టి యవి యట్లు పరిగణింపఁబడెనేమో చెప్పఁజాలముగాని, శకజాతి తప్పఁ దక్కినహూణ పారసీక పహ్లవ యవన చీన కాంభోజ చీనకళింగాదిజాతులు కొన్ని మ్లేచ్ఛజాతులుగాఁ జెప్పఁబడినవి. కాని, మ్లేచ్ఛపదమున కపశబ్ద మర్థ మైనట్లు "మ్లేచ్ఛోహ వా ఏష యదపశబ్దః" అని భగవత్పతంజలి వాక్యమునఁ దెలియుచున్నది. దీనినిబట్టి తొల్లి, అపశబ్దము లుచ్చరించువారు మ్లేచ్ఛజాతులుగా గణింపఁబడిరనియు భాషచేతను లిపిచేతను గూడ యవను లట్టి మ్లేచ్ఛజాతులతోఁ జేరినవారనియుఁ జెప్పవచ్చును. ఇందుకు, జుగుప్సార్థకమైన యుధాతువునుండి యవనశబ్దము నిష్పన్నమైనట్లుచెప్పిన పాణిన్యాచార్యుల నిర్వచనముగూడఁ దోడ్పడుచున్నది[2]. ఇది యిట్లుండ, రామాయణము హూణ పారసీక పహ్లవజాతులపే రెత్తలేదు గాని, కాంభోజ యవనశకాదిదేశము లుత్తర దిశలోని వని చెప్పినది[3]. మఱియు, సీత నన్వేషింపఁదగిన పూర్వదిశలోనినదీగిరి పురజనపదాదులు కొన్ని పేర్కొని తరువాత యవద్వీపశోణసముద్రాదులను వర్ణించినది[4]. దీనినంతను బట్టి యవను లను నొకజాతివారు, యవద్వీపమునుండి కాని, మఱియొక ద్వీపమునుండికాని-అది దేశచరిత్రవేత్తలు నిర్ణయింపవలసినమాట[5].-క్రీ. పూ. వెయ్యేండ్లకు మున్నే యుత్తరహిందూదేశమునకు వచ్చి నిలిచినవారనవలెనుగాని, గ్రీకు పారసీక పీడలతో వచ్చి యిందు స్థిరపడిన వారనిమాత్రము

1. యవనా శ్చీనకాంభోజా దారుణా మ్లేచ్ఛజాతయః।
సకృద్గ్రహాః కులత్థాశ్చ హూణాః పారసికైః సహ। భీ. పర్వ. 9 అధ్యా.
అటవీం చ పురీం రమ్యాం యవనానాం పురం తథా. సభా. 31 అధ్యా.

2. యు జుగుప్సాయామ్. చురాది-నన్ద్గ్రహిపచాదిభ్యో ల్యుణిన్యచః. అష్టా. 3.1.134.
గణపాఠే. యవనః—

3. కాంభోజా న్యవనాంశ్చైవ శకా నారట్టకా నపి. కిష్కిం. 43 సర్గ.

4. రత్నవన్తం యవద్వీపం సప్తరాజ్యోప శోభితమ్
సువర్ణరూప్యకం చైవ సువర్ణాకరమండితమ్.
యవద్వీప మతిక్రమ్య శిశిరోనామ పర్వతః
తతో రక్తజలం శోణ మగాధం శీఘ్రగామినమ్. కిష్కిం. 40 స.

5. సి. వి. వైద్యాపండితులు చూపిన భారతఖండపటమును బట్టియు, వారి యభిప్రాయమును బట్టియు, గాంధారదేశమునకును, కుభానదికి నుత్తరముగా నున్న యవనదేశమునుండి యవనులు వచ్చినట్లు తెలియవచ్చును. అది సత్యమైనను, వారు, పాణినిశాకటాయనులకుఁ బూర్వ మిక్కడికి వచ్చినవారే కాని క్రీ. పూ. 328 ప్రాంతమున వచ్చినవా రని మాత్రము తలంచుటకు వీలులేదు.

తలంచుట సరిగా దని తేలుచున్నది. కావునఁ బాశ్చాత్యులు నిర్ణయించిన రామాయణ భారతకాల మీ హేతువునుబట్టి యుక్తము కాదనుట నిశ్చయము. ఇంక-అష్టాధ్యాయిలో భారతకథకు సంబంధించిన ప్రధానపాత్రముల నామములు కానరావు. కనవచ్చినవాని యర్థ మచ్చట వేఱుగా నున్నది. కావున నిది దానితరువాతిదే-అన్న యాక్షేప మొకటి యున్నది. కాని, యిది యనాలోచితము. కొన్ని శబ్దములయర్థము వారి కట్లు కనఁబడినదేమో కాని, అనేక సూత్రములందును గణపాఠములందును గూడ భారతరామాయణములలోని స్త్రీపురుషదేశసంజ్ఞ లనేకములు కనవచ్చుచునే యున్నవి[1]. అదిగాక, రామాయణ భారతములు పాణినీయము తరువాతివే యైనచో దానికి విరుద్ధము అయిన బహు ప్రయోగములు వాని యందుండియుండవు. వానికాలమున వాడుకలోనున్న కొన్ని శబ్దముల రూపములు పాణినినాఁటికి మాఱి యనుశాసనము గాంచినవి. వానిలో నున్న వట్లే యుండి యార్షము లను పేరు గాంచినవి. అందుచే నీవాదము నిలుచునది కాదు. ఇఁక నివి మనుస్మృతికిఁ బూర్వములా పరములా? యనుట విచారణీయము.

రామాయణములో మనువు పే రుండుటయు[2] మనుగీతములుగా రెండు శ్లోకములు కనఁబడుటయు[3] ఆ శ్లోకములు మనుస్మృతిలో నుండుటయు, నిజమే కాని, శరవిద్ధుఁడై తన్ను గర్హించుచున్న వాలికి రాముఁడు రాజధర్మములు తెలుపు సందర్భమున నున్న యాశ్లోకముల స్థితిగతులు పరిశీలింపఁగా నవి వాల్మీకి మనుస్మృతినుండి గ్రహించినవి కా వనుటకుఁ గొన్ని హేతువు లగపడుచున్నవి.

౧. మనుస్మృతికర్త యితర గ్రంథములనుండి కొన్నిశ్లోకములు గ్రహించె ననుటకు నిదర్శనములు కనఁబడుచున్నవి. పెక్కండ్రు పరిశోధకులు నట్లు భావించిరి

---

1. అష్టా. 3. 1, 134, 162,—4. 1. 96, 105, 114, 168—175, 178—
4. 2. 80, 127, 138, 196,—4. 3 93, 104,—6. 2. 38. మొద—

2. అయోధ్యాం మనునా రాజ్ఞా నిర్మితాం స దదర్శ హ. అయో. 71–18.

3. శ్రూయతే మనునా గీతౌ శ్లోకౌ చారిత్రవత్సలౌ.
గృహీతౌ ధర్మకుశలై స్తథా చరితం హరే. కిష్కిం, 18–31.
రాజభి ర్ధృతదండా స్తు కృత్వా పాపాని మానవాః
నిర్మలాః స్వర్గ మాయాన్తి సన్త స్సుకృతినో యథా.
శాసనా ద్వా విమోక్షా ద్వా స్తేనః స్తేయా ద్విముచ్యతే.
రాజా త్వశాస న్పాపస్య త దవాప్నోతి కిల్బిషమ్.
రా. కిష్కిం. 18–32, 33.-మనుస్మృతి. అధ్యా 318, 316.

కాని, వాల్మీకి తన రామాయణమున నితరలౌకిక గ్రంథములలోని శ్లోకములను గూర్చి నట్లు కనఁబడదు. పరిశోధకు లెవ్వరు నట్లు భావించి యుండలేదు.

౨. రామాయణములో రాజధర్మవర్ణనమునం దున్న 'రాజభి ర్ధృత దండా స్తు' ఇత్యాదిశ్లోకములు రెంటిని మనుస్మృతి గ్రహించి యుండఁగా, ఈ విషయము పరామర్శింపని మనుస్మృత్యభిమాని యొకఁడు పైశ్లోకములను మను స్మృతినుండియే రామాయణము గ్రహించిన దని భ్రమపడి "శ్రూయతే మనునా గీతౌ" అనుశ్లోకము కల్పించి రామాయణమునఁ బైశ్లోకముల మొదట చేర్చి యుండవలెను. లేదా ?

౩. అయోధ్యానిర్మాత యగు మనువు పఠించినవిగాఁ జాటువులై తననాఁటికి వినవచ్చిన పైశ్లోకములను మాత్రము పూజ్యస్మృతికై వాల్మీకి రామాయణమునఁ గూర్చియుండ దానినుండి వాటిని మనుస్మృతి సేకరించియుండవలెను.

౪. అయోధ్యానిర్మాత యగు మనువుగాని, సప్తమనువులలో నొకఁడుగాని, ఋగ్వేదద్రష్టలలోనిమనువుగాని, మనుస్మృతి రచియించె ననుట నప్రమాణము కాఁజాలదు [1]. కావున వాల్మీకి రామాయణమునఁ బేర్కొన్న మనువే మనుస్మృతి కర్త యనుట పొసఁగదు.

పై కారణములనుబట్టి రామాయణము మనుస్మృతికంటెఁ బరము కా దనుట విశ్వసనీయము. ఇఁక భారతము —

ఇందును రెండుమూఁడుచోట్ల మనువు పేరును, మనుప్రోక్తములుగా రెండు శ్లోకములను గనవచ్చుట సత్యమేకాని[2] అవి ముద్రిత మనుస్మృతిలోఁ గనరావు. అందలివిషయ మైనను సరిగా మనుస్మృతిలోని రాజధర్మవచనములలోఁ గనఁబడదు. మఱియు "ష డేతాన్ పురుషో జహ్యా" దిత్యాదితత్పద్యములు సరిగా నట్లే

---

1. చూ. సంస్కృతవాఙ్మయచరిత్ర, ప్రథమభాగము. అధ్యా. 9. 'స్మృతులు'

2. అపి చైత త్పురా రాజ న్మనునా ప్రోక్త మాదితః. శాంతి. 121. 10.
యథోక్త మేత ద్వచనం ప్రా గేవ మనునా పురా. శాం. 121. 12.
ష డేతాన్ పురుషో జహ్యా ద్భిన్నాం నావ మి వార్ణవే,
అప్రవక్తార మాచార్య మనధీయాన మృత్విజమ్,
అరక్షితారం రాజానం భార్యాం చాప్రియవాదినీం
గ్రామకామంచ గోపాలం వనకామం చ నాపితమ్.
ఉద్యో. 32. 84, 85 — శాంతి. 57. 44, 45.

యుద్యోగపర్వమునఁ గూడఁ గలవు గాని, అక్కడ మనువుస్మరణమే లేదు. అందుచే వీనిస్థితియు నవిశ్వాస్య మగుచున్నది సరిగదా, ఉద్యోగపర్వములోని వీనిసందర్భము పరిశీలింపఁగా నివి తప్పక భారతకర్తవే యని తోఁచుచున్నది. ఏ మనఁగా? శాంతిపర్వ మర్వాచీనరచిత మన్నవారు కలరు కాని, ఉద్యోగము ప్రక్షిప్త మన్నవారు కనరారు. ఇంతకు నివి మనుస్మృతిలో లేకపోయినా మనుస్మృతిలోనివే యని యంగీకరింత మన్నను, భారతప్రధాన కథారచనము మనుస్మృతికంటెఁ బర మనుట కివి చాలవు. అదిగాక, భారతమునుండి కొన్నిశ్లోకములను మనుస్మృతి గ్రహించిన దనుట నిజ మగును గాని, మనుస్మృతినుండి భారతసంహిత గ్రహించిన దనుట సప్రమాణము కాఁజాలదు. కావున భారతసంహిత మనుస్మృతికంటెఁ బూర్వ మనుట కాక్షేప మేమి? ఇఁకనో, తైత్తిరీయారణ్యకమునఁ బేర్కొనఁబడిన పారాశర్య వ్యాస వైశంపాయనులు[1] భారతరచనప్రవచనకర్తలై యుందురా యనువిషయ మాలోచింతము[2]. సంహితాబ్రాహ్మణాదులలోని పురుషులసంజ్ఞలు కొన్ని పురాణములలోఁ గనవచ్చుటచే వారే వీ రనువిషయమందును, వారు వీరు కారనువిషయమందును గూడ విమర్శకులు తప్పొప్పుపడుచునే సాహసించి యేదో యొకమార్గము ద్రొక్కుచువచ్చిరి. దీని కంతకును, పురాతనగాథ లెత్తుకొని తమనాఁటివిషయములు కూడ నందు చేర్చుచువచ్చిన గ్రంథకర్తలరచనలును, నడుమ నడుమ వానియందు చేరిన ప్రక్షిప్తభాగములును గారణము. అందుచేఁ బ్రస్తుత మీ వ్యాస వైశంపాయనవిషయము సందిగ్ధ మైనది.

ఇంతకు మున్ను మనము తెలిసికొన్నపరాశర పారాశర్య వ్యాస వేదవ్యాస ద్వైపాయన కృష్ణద్వైపాయన సంజ్ఞలనుగూర్చి వాయువిష్ణుపురాణాదులు చెప్పిన మాటలు చూచినచో నిరువదియాఱవ ద్వాపరమందు పరాశరుఁడు, ఇరువది యేడవద్వాపరమందు జాతూకర్ణుఁడు, ఇరువై యెనిమిదవద్వాపరమందు ద్వైపాయనుఁడు[3] క్రమముగా వేదవ్యాసు లైనట్లు కనఁబడును. ఇపు డీపరాశరుని కొడుకీద్వైపాయనవ్యాసుఁ డందు మేని. యితఁడు మూఁడు ద్వాపరము లొక్కఁజన్న

---

1. స హోవాచ వ్యాసః పారాశర్యః, విద్యుద్వధ మే వాహం మృత్యు మైచ్ఛ మితి. ప్రశ్న 1. అను. 9.
ఏత ద్వైవాఽఽవృతాఽఽసహస్రసూర్యతాయా ఇతి వైశంపాయనః. ప్రశ్న 1. అను. 7.

2. వెబరు, వారే భారతకర్త లని వాదించెను. చూ. H. I. Lit P. 184

3. కొన్నిటిలో, "కృష్ణద్వైపాయనః" అని యున్నవి.

ములో నెఱిఁగినవాఁ డనవలెను. పోనీ! ఇతఁడు పరాశరునిగోత్రాపత్య మందుమేని భారతాదుల నన్యత్ర కృష్ణద్వైపాయనుఁడు పరాశరాత్మజుఁ డని యున్నది. ఇరువై యెనిమిదవ ద్వాపరములోని మఱియొక పరాశరునికొడుకు కృష్ణద్వైపాయనుఁడు, ఇతఁడే పై యారణ్యకమునఁ జేర్కొనఁబడినవాఁ డని తలంతుమేని, అందు పారాశర్యవ్యాసుఁ డనియే యున్నది గాని. కృష్ణద్వైపాయనసంజ్ఞ కనరాదు. కనఁబడకున్న నితఁడే యతఁ డని యంగీకరింత మన్నను, అందు తెలుపఁ బడిన విద్యుద్వధ విషయము వైదికశాఖా సంబంధము గాని భారత సంహితా సంబంధి కాదు. ఇఁక వైశంపాయన విషయము—ఇతఁడు యజుశ్శాఖతో సంబంధము కలవాఁడుగాఁ బురాణములలోను, చరణవ్యూహాదులలోను గనవచ్చును[1]. పైయారణ్యకమునఁ జెప్పఁబడిన సూర్యవిషయముగూడ వైదికశాఖకుఁ జేరినదే కాని, భారతమునకు సంబంధించినవి కాదు. అందుచేఁ దైత్తిరీయారణ్యకములోఁ జేర్కొనఁబడిన వీరు భారతసంహితా రచన ప్రవచనకర్త లని విశ్వసించి, భారతసంహిత తైత్తిరీయారణ్యకముకంటెఁ బ్రాచీన మనుట సంగతముకాదు. విషయ మిట్లున్నను, సి. వి. వైద్యాపండితులు, దీక్షిట్లుపండితుని యభిప్రాయమునుబట్టి మూలకథ యగుభారత సంహిత క్రీ. పూ. ౧౪౦౦ ప్రాంతములోని దని భావించుచుఁ దైత్తిరీయారణ్యకములోఁ జేర్కొనఁబడిన పారాశర్యవ్యాసుఁడే తత్కర్త యనియు, అందలివైశంపాయనుఁడే జనమేజయునికిఁ గథ చెప్పినవాఁ డనియు నభిప్రాయము తెలిపిరి[2]. కాని, భారతకథ యెప్పటిది? కౌరవవంశము నిలిపినట్లున్న యితనికి మూలకథతోఁ గనవచ్చు ముఖ్యసంబంధముమాట యేమి? కథాకాలమునకును గ్రంథరచనకాలమునకు నంతర మున్నదా లేదా? తైత్తిరీయారణ్యక మెప్పటిది? అనువిషయము లాలోచించినట్లు కనఁబడదు. ఈ యారణ్యకమందలి పారాశర్యుఁడు మత్స్యగంధిపరాశరులకు జన్మించి కౌరవవంశము నిలిపిన కృష్ణద్వైపాయనుఁ డని మనము విశ్వసించిన విశ్వసించవచ్చును గాని, యితఁడే భారతసంహితా రచయిత యన వీలులేదు. ఇందలి వైశంపాయనుఁడుకూడ నీపారాశర్యుని శిష్యుఁడై యితఁ డుపదేశించిన భారతకథను లోకమునఁ బ్రవర్తింపఁజేసెనేమోయని నమ్మవచ్చును గాన, యితఁడే భారతసంహితా గ్రంథమును జనమేజయునికి వినిపించినవాఁ డన వీలులేదు[3]. ఇందుకుఁ దైత్తిరీయారణ్యకము క్రీ. పూ. పదునాల్గవ శతాబ్ది కీవలిది కాకపోవుటయే కారణము. ఇఁకనో, బృహదారణ్యచ్ఛాం

1. చూ. సం, వా. ప్రథ. పుటలు. 177—184.
2. The Mahabharata, A Criticism P. 16, 17.
3. అతఁడు మఱియొక వైశంపాయనుఁడు కావచ్చును.

దోగ్యాదులందు కనవచ్చు రామ భారతకథలలోని కొన్ని ముఖ్యపాత్రల పేళ్లనుబట్టి వానికంటెను, తైత్తిరీయారణ్యకముకంటెను గూడ నీకథలు ప్రాచీనము లని చెప్ప వచ్చును. కావున వీనికాల మిట్లు తెలిసికొందము.

పాణిని క్రీ. పూ. సప్తమశతాబ్ది కావలివాఁడు కాని యీవలివాఁడు కాఁడు. అతని యష్టాధ్యాయికంటె నాపస్తంబసూత్రమును దానికంటె మనుస్మృతియుఁ బూర్వములు[1]. మనుస్మృతి పంచమశతాబ్దిని దాఁటి యీవలికి రాదు. కావున దానికిఁ బూర్వము భారతసంహితయు దానికిఁ బూర్వము రామాయణమును జనియించి యుండును. ఆకాలము వెనుకకుఁ గ్రమముగాఁ గ్రీ. పూ. ౧౧,౧౨ శతాబ్దులు కావచ్చును. ఇందుకు విద్వల్లోకమే ప్రమాణము. వాష్‌బర్న్ హాప్కిన్సు పండితుఁడు. "రామాయణము పన్నెండు లేక పదమూఁడగు శతాబ్దిలోని దని కొందఱు హైందవ పండితులును పాశ్చాత్య పండితులును గూడ హాస్యాస్పదముగా భావించిరి" అనుచు వ్రాసెను[2]. కాని, అతనిమాట యాదరణీయము కాదు. అయిన నిక్కమైన నొక్కమాట. ఇపుడు మనకంటికి గోచరించుచున్న లక్ష గ్రంథమగు మహాభారతము పదునొకండవ శతాబ్దిలోఁ బుట్టిన దని నాయభిప్రాయము కాదు. ఇరువదినాలుగువేల భారతసంహితాగ్రంథము మాత్రము నాఁటి దనియుఁ దరువాతఁ గొందఱు విమర్శకు లూహించినట్లు క్రీ. పూ. మూఁడవశతాబ్ది కించుక యీవలి వఱకుఁ గూడ నడుమనడుమఁ గొంతకొంత గ్రంథము చేరుచు వచ్చె ననియు విశ్వసింపవచ్చును. ఇఁక నొక్కొక్కదానినే పరిశీలింతము.

రా మా య ణ ము

ఇది వాల్మీకిమహర్షి కృత మను విషయమున వివాదము లేదు. సకల పురాణేతిహాసము లాదికావ్య మని ప్రశంసించుటనుబట్టి యిది లౌకికభాషలో మొట్టమొదట నుదయించినకావ్య మనువిషయమునఁ గూడ సంశయము గలుగరాదు.

"మానిషాద! ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీ స్సమాః
య త్క్రౌఞ్చమిథునా దేక మవధీః కామమోహితమ్"

అను శ్లోకము వేదముల తరువాత నవతరించిన నూతనచ్ఛందస్సని భవభూతి రాజశేఖరాది కవీంద్రులు పలికియున్నారు. అయితే, బాలకాండ ద్వితీయసర్గలోని

1. చూ. సం. వా. ప్రథ. 291,—309–319.
2. The great Epic of India, Ch. II, P. 61.

ఈ శ్లోకము చూచి వారట్లు ప్రశంసించినంత మాత్రమున నిదియే మొదటి దని విశ్వసింప నగునా? అని సంశయము కలుగవచ్చును. సత్యమే. దీనినిబట్టి, ఇట్లు వర్ణించుట ప్రాచీనుల శైలియా? లేక, వాల్మీకి తనకావ్య మాద్యము కాకపోయినను, ఇట్లు వర్ణించి లోకప్రతారణము కావించెనా? లేక, మ ఱెవరయిన నిట్లు వర్ణించి యీ శ్లోకముతోడికథను రామాయణమునఁ జొనిపిరా? అని యిచ్చట మూఁడు ప్రశ్న లుదయించు చున్నవి.

విషయము ప్రౌఢముగా నుండుటకై పూర్వగ్రంథకర్తలు, కొందఱితరులు చెప్పినట్లు ప్రథమపురుషక్రియ నుపయోగించి వర్ణించుట కలదు గాని, స్వవిషయమున నిట్లసత్యమైనదానిని వర్ణించుట కనరాదు. అది గాక ప్రాచీనగ్రంథకర్త యెవ్వఁడును, తాను గనిపెట్టనివిషయము తానే నూతనముగాఁ గనిపెట్టినట్లుగా వర్ణించుకొన్న ట్లెందును గనఁబడదు. తుదకుఁ గొందఱిమతమున నాద్యమైనవారతసంహితలోఁ గాని, మఱి యేయితరలౌకిక భాషాగ్రంథములోఁ గాని, లౌకిక కవిత్వము నాతోనే పుట్టిన దని చెప్పెడియిట్టిమాటలు కనఁబడవు. కావున నిది ప్రాచీనులశైలి యన వీలులేదు. ఇంక, వానప్రస్థుఁడై నిష్కాముఁడై లోకానుగ్రహకాంక్షియై తనవిజ్ఞానమును బ్రసాదించి లోకమును దరింపఁ జేయ నెంచిన ప్రాచేతసమహర్షి యైహికాముష్మికములు రెంటికిని గాని యిట్టిమాటలు చెప్పి లోకవంచన మాచరించె ననుట కలలో నైన స్మరింపరానిది. అ ట్లననేల? కథాభాగములు కల్పించినట్లే కవిత్వోత్పత్తికథను గల్పించియుండు నందురేని, పాఠకప్రరోచనార్థమయిన కథాభాగకల్పనమునకును, ఆత్మమహత్త్వప్రశంసాపర మైన యేతత్కథాకల్పనమునకు నెంతేనివాసి కలదు. కావున నతని కట్టిదోష మంటఁగట్టుటకంటెఁ గృతఘ్నత వేఱుండఁబోదు. ఇఁకనో, ఈ భాగము ప్రక్షిప్త మనునది యున్నది. బాలకాండములోని కొన్నిభాగము లర్వాచీనులు రచియించిన వనెడి యొకవాదమునుబట్టి యెవ రేని రామకథకు సంబంధించిన మొదటిభాగము కల్పించి రనవలెను గాని, గురుపరంపరాగతమైన యీకవిత్వోత్పత్తిసంప్రదాయము నెఱుఁగకయే స్వప్రతిభచేతనే యీ కథకూడఁ గల్పించియుందు రనుట యుచిత మగునా? కావున బ్రహ్మ ప్రత్యక్షమై తన్ను రామచరితము వర్ణింపఁ బ్రోత్సహించె నన్నయంశమొక్కటి యింతక యున్నను, క్రౌంచపక్షి కథతోడి మానిషాదేత్యాదిశ్లోకము వాల్మీకి నోటనుండి వచ్చినదే కాని యన్యులది కా దనుట నమ్మి, రామాయణ మాదికావ్య మని విశ్వసించుటయే సరియగును. ఇఁక నిందు ప్రక్షిప్తభాగములు కల వనువాద మెంతవఱకు సత్యమో పరిశీలింతము.

ప్ర క్షి ప్త భా గ వి చా ర ణ

రామాయణము శతకోటిశ్లోకపరిమిత మనియు, అయాదేవగంధర్వాదిలోకములం దేఁబదికోట్లు పదికోట్లు కోటిగా వ్యాపించిన దనియుఁ జెప్పుచు, మానవలోకమందు విస్తరించిన దిరువదినాలుగువేల శ్లోకములగ్రంథమే యని బ్రహ్మాండపారశర్యోపపురాణాదులు నిర్ణయించినవి. ఇది చతుర్వింశత్సాహస్రిక సంహిత యని దీనికాండాంతగద్యములు వక్కాణించినవి. గాయత్రీమంత్రములోనియిరువదినాలు గక్షరములు క్రమముగా నొక్కొక్కశ్లోకసహస్రము మొదట నున్న వని గాయత్రీరామాయణము నిరూపించినది. వీటినిబట్టి రామాయణ మాఱుకాండము లిరువదినాలుగువేలశ్లోకము లని లోకప్రసిద్ధి కలిగినది. కాని, బాలకాండచతుర్థసర్గలోని యీ క్రింది శ్లోకము—

"చతుర్వింశత్సహస్రాణి శ్లోకానా ముక్తవా నృషిః,
తథా సర్గశతా న్పఞ్చ షట్కాణ్డాని తథోత్తరమ్,
కృత్వాపి తన్మహాప్రాజ్ఞ స్సభవిష్యం సహోత్తరమ్"

వాల్మీకి వర్ణించిన రామచరిత మిరువదినాలుగువేలశ్లోకము లయిదువందల సర్గ లాఱుకాండములు, మఱియు భవిష్యదుత్తరభాగముతోడి యుత్తరకాండము." అని చెప్పుచున్నది. దీనిని సరిచూచుటకు నేను గణింపఁగా వచ్చిన మొత్తము లివి[1].

షట్కాండ సర్గలు,	శ్లోకములు సుమారు,	అధికపాఠ శ్లోకములు సుమారు.	ఉత్తరకాండ సర్గలు	శ్లోకములు సుమారు,	అధికపాఠ సర్గలు,	శ్లోకములు సుమారు,
౫౩౭	౨౦౭౦౦	౫౦౦	౧౧౧	౪౫౦౦	౧౩	౧౨౨౮

చూచితిరా మొత్తములు ? సర్గలందుమా, ఆఱుకాండములలోనే ౩౭ ఎక్కువ. ఉత్తరకాండసర్గలు కలిపినచో ౬౪౮ అగును. శ్లోకము లందుమా, షట్కాండములలో ౨౪ వేలకు మిక్కిలి తక్కువ. ఉత్తరకాండశ్లోకములు కలిపినచో సుమారు ౨౫ వేలగును. రెంటియందును గూడ నధికపాఠశ్లోకములు నిజముగా నధికములే. అవి కలుపఁదగినవి కావు. అందుచేఁ బైశ్లోకము చూపిన లెక్క లెట్లున్నను, అవి యాఱుకాండముల నుద్దేశించినవే కాని, ఏడుకాండముల నాశ్రయించినవి కా వనుట నిజము. అయితే పూర్వోక్తసాక్ష్యములగతి యేమి ? అందలిసర్గశ్లోకసంఖ్యల భేదములకు గతి యేమి ?—ఇందు కూహయే గతి. వేద

1. శ్లోకముల మొత్తము ఏప్రతినిబట్టి చూచినను, ఒకటిరెండువందల తేడాలో సరిపడును

మంత్రములలెక్కలకు ననుక్రమణికలు నిర్ణయించినవారివలెనే, దీనిలెక్కలు చూపిన వారు గూడ నున్నారే కాని, వాల్మీకియే యీలెక్కలు చూపినాఁ డనుటకు వీలు లేదు. తరువాత నెవరో సర్గలు శ్లోకములు గణించునాఁటి కిది పైలెక్కలకు సరిపడి యుండు ననియుఁ, బిదప మఱియొకకాలమునకు ౩౭ సర్గలు పెరుఁగుటయు నింకొక కాలమునకు సుమారు మూఁడువేలశ్లోకములు తఱుఁగుటయు సంభవించియుండు ననియు నూహింపవలసియున్నది. ఇందుకు షట్కాండములలోని యధికపాఠములే నిదర్శనము. కావున షట్కాండములలోఁ దెలియని లుప్తభాగముల మాట యేమైనను[1] తెలియుచున్న యధికపాఠములు ప్రక్షిప్తము లనుట స్పష్ట మనియు, కుండలీకృతములై ముద్రితపుస్తకములఁ గనవచ్చుశ్లోకములే కాక, బాలకాండము మొదటిసర్గలలోఁ గుండలీకృతములు గాని కొన్ని భాగములుకూడనట్టివే యనియు, ఉత్తరకాండ మంతయుఁ గూడ వాల్మీకి రచించినది గా దనియు విశ్వసింప వలసి యున్నది. ఇపు డీ మూఁడు విషయములు నిశ్చయింప నించుక యత్నింతము.

కైకేయి రామప్రవాసాది వృత్తాంతము చెప్పిన పిదప—భరతుఁ డా మాటలు విని దుఃఖితుఁడై యిట్లు పలికెను—అను నర్థముగల మాటలతోఁ దరువాతి సర్గయారంభమగును[2]. అట్లగుటయే యచ్చోట నుచితము. కాని, పై మాటలకు ముందు పదిశ్లోకములు చేరినవి. అవి కుండలీకృతములే కాని, కాకున్నను, అందలి విషయము భరతుని కుచితము గాక తప్పక ప్రక్షిప్తమే యనిపించుకొనును. ఇట్లు కుండలీకృతము లైన వన్నియు[3] పునరుక్తములో యసంగతములో యనుచితములో యై కనవచ్చుట పాఠకలోకము మెఱుఁగనిది కాదు. ఇంక—

బాలకాండము మొదటి సర్గలో, సకలసద్గుణపరిపూర్ణుఁడైన మహావీరుఁ డెవఁ డన్న వాల్మీకిప్రశ్నకు శ్రీరాముఁ డట్టివాఁ డని నారదుఁడు సమాధాన మిచ్చుట, దశరథుఁ డతని యౌవరాజ్యాభిషిక్తునిఁ జేయ నెంచుట మొదలుగా రావణవధా

---

1. ఇపు డిక కుండలీశ్లోకములు లేని సుమారు 20 వేలగ్రంథమే వాల్మీకికృత మని యూహించుటయు ననుచితము కాదు.

2. “ఇత్యుక్త్వా భరతోక్తిం విభో క్త్వాన సుఖేష్వయస్వ”. అయో. 72 చివర—
ప్రశ్రుత్వా తు పితరం వృత్తం భ్రాతరౌ చ వివాసితౌ, భరతో దుఃఖిత స్తత్ర ఇదం వచన మబ్రవీత్, అయో. 73—11 శ్లో.

3. ఈ కుండలీకరణము కూడ నియతముగా లేదు. వావిళ్లవారి యాంధ్రాక్షర పుస్తకములోని కుండలీకరణములు కలకత్తా నాగరాక్షరప్రతిలోఁ గొన్నిచోట్లఁ గనరావు. అందలివి యిందలివి గూడఁ గొన్ని బొంబాయి ప్రతిలోఁ గనఁబడవు. లిఖిత పుస్తకములలోఁ గుండలీకరణములే కనఁబడవు. అందుచే నిది యవ్యవస్థమై యనియతముగా నున్నను ప్రక్షిప్తములే లే వని యూహింపరాదు.

నంతర మతఁడు వచ్చి రాజ్యము స్వీకరించి ప్రజారంజకముగాఁ బరిపాలన మొనర్చె నన్నంతవఱకుఁ గల రామచరితములోని విషయముల నెల్ల వివరించు నొక విషయ సూచిక వర్ణింపఁబడినది. రెండవసర్గలో, క్రౌంచపక్షికథ 'మానిషాద' శ్లోకా విర్భావము బ్రహ్మసాక్షాత్కారము మొదలగు విశేషవిషయములు వర్ణింపఁబడినవి. సర్వవిధముల గ్రంథావతారికగా నున్న యీ రెండు సర్గలు రామాయణమునకుఁ బునాదులై యెంతయు నొప్పుచున్నవి. ద్వితీయసర్గాంతమందలి—

"రఘువరచరితం మునిప్రణీతం దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్"

అను వాక్యముతోఁ బంచమసర్గ మొదట నున్న—

సర్వా పూర్వ మియం యేషా మాసీ త్కృత్స్నా వసుంధరా"

ఇత్యాదికథారంభ శ్లోకములు సరిగా నతుకుచున్నవి. ఇట్లుండఁగా మూఁడవ సర్గయంతయు మరల విషయసూచికయై కథ కడ్డమైనది. రెండవ సర్గలోని విషయ సూచికలో లేనియక్కఱమాలిన చిన్నవిషయము లేవో నాలుగున్నను, మొత్తము మీఁద నీ రెండవ విషయసూచిక మొదటివిషయసూచికకు ఛందోంతరముగాఁ గల్పింపఁబడినదే కాని యన్యము కాదు. కాని దీనిచివర—

"వైదేహ్యాశ్చ విసర్జనమ్, అనాగతంచ యత్కించి ద్రామస్య వసుధాతలే,
త చ్చకారో త్తరే కావ్యే వాల్మీకి ర్భగవా నృషిః"

సీతను విడిచిపెట్టుట రామునిసంబంధ మగుననాగతము ననునవి యుత్తర కాండమునఁ గవి వర్ణించె నను క్రొత్తమాటయు మాత్రము చేరినవి. దీనివలెనే నాల్గవ సర్గయుఁ గథ కడ్డము వచ్చినది. అందు షట్కాండలసర్గశ్లోక సంఖ్యలు చూపఁ బడినవి. ఉత్తరకాండము గూడ వాల్మీకి రచియించె నని చెప్పఁబడినది. మఱియు, కుశలవులు రామాయణకావ్య మందందు గానముచేయుచు నయోధ్యాపురమున వీథులలోఁ దిరుగుచుండ రాముఁడు వారిని జూచి పిలిపించి వారిచే రామచరితము పాడించె నని వర్ణింపఁబడినది. ఇట్లున్న దీనిలో మరల నాయుశ్లోకము లధిక పాఠముగాఁ గుండలీకృతము లైనవి. ఇట్టి యీసర్గలసంగతి సంపర్కములు పరికి రించినచో నవి రెండును బ్రక్షిప్తము లని తోఁచకపోదు. ఇందు నుత్తరకాండము వెలసినపిదప నీసర్గలు రెండు నిందు చేరినట్లు కనవచ్చుటయే తార్కాణము. కావున నుత్తర కాండముమాట యొకింత చూతము.

'ప్రాప్తరాజ్యస్య రామస్య[1]' ఇత్యాది శ్లోకముతో నుత్తరకాండ మారంభమైనది. శ్రీరాము నభినందించుట కన్ని దిక్కులనుండివచ్చిన ఋషివర్యు లింద్రజిద్రావణాదిరాక్షస వీరుల యుదంతములను హనుమదాదిశూరుల వృత్తాంతములను వర్ణించుటతో ౪౦ సర్గలు గడచినవి. అట్టివీరుల నీ వణఁగించితి వని రాముని స్తుతించుటకుఁ దప్ప ఆరాక్షసుల వర్ణనల కుత్తరకథతో నెట్టిసంబంధమును లేదు. అయినా. సగముగ్రంథము దానికే వినియుక్తమైనది. తరువాత సీతావిసర్జన కథాబీజ మంకురించినది. దానికి ౧౨ సర్గలు పట్టినవి. అంత నృగనిమ్యాదుల కథలతోఁ గొన్ని గతించినవి. ఇట్లిరువదియైదు సర్గలు వెళ్ళిన తరువాత, కుశలవ జన్మవృత్తాంత మువయించినది. తరువాత నేవో కథలు. పిదప ౯౯వ, సర్గనుండి భవిష్య దుత్తరకథ. వీనినడుమ నెడుమ నధికపాఠ సర్గలు. ఈ విధముగాఁ బూర్వ రామాయణ కథారచనముతో నెట్టిపోలికయు లేని డొంకతిరుగుడు రచనయు, అంచలికవిత్వప్రౌఢశైలి కేరీతి నీడుగాని సామాన్యశైలియు, అంచలి మాధుర్యములో నావగింజం తైనలేని వర్ణనలును గలిగిన యుత్తరకాండము వాల్మీకిమహర్షి కృత మని రెండును జక్కఁగాఁ బఠించిన విమర్శకు లెవ్వరును జెప్పసాహసింపఁ జాలరు. అట్లెవరైనఁ జెప్పిరా, వారు చిరకాలముగా వచ్చు పురాణప్రసిద్ధికి విరుద్ధముగాఁ జెప్ప జడియుటయే యందుకుఁ గారణ మగును గాని వేఱు కాఁబోదు. కావున రామాయణమహాభారతములు దేశమున బాగా వ్యాపించినపిదప వానిం జదివినయొక విద్వాంసుఁడు, భారతకథతోఁ గృష్ణద్వైపాయనునికిఁగల సంబంధము చూచి రామకథతో వాల్మీకికి సంబంధము కలిగించుటకై యుత్తరకాండ కథ కల్పించివర్ణించి యుండుననియు, పూర్వరామాయణము నుత్తరకాండమును జదివిన తరువాతిపండితుఁ డొకఁడు, ఉత్తరకాండకథాప్రసక్తి కలుగునట్లు బాలకాండమునఁ దృతీయచతుర్థసర్గలుకల్పించి చేర్చి యుండు ననియు నమ్మవచ్చును. ఈ విశ్వాసము నక్కఱలేని విషయసూచికతోడి తృతీయసర్గ తుదిశ్లోకములును, అసంగతముగా నున్న చతుర్థసర్గోపక్రమోపసంహారములును బలపఱచును గావున దీనిని గూర్చి యింతకంటె వ్రాయఁబనిలేదు. ఈవిషయమున జర్మనీభాషలో రామాయణ విమర్శనము వ్రాసిన జాకోబిపండితుఁడు వ్రాసినహేతువు లేమో తెలియరావు గాని, అతఁడుత్తరకాండము సుతరాము వాల్మీకి వ్రాసినది గా దనియు, బాలకాండము గాక తక్కినయైదుకాండము లొక్కసారి యువయించిన వనియు, బాలకాండములోని పెక్కుభాగములు తక్కిన కాండములవిషయమునకు సరిగాఁ

1. సరిగా నీభాగములోనే బాలకాండ చతుర్థసర్గాదిమశ్లోక మారంభమైనది.

బొసంగకున్న దనియు వ్రాసినట్లు మాగ్డొనలుపండితుఁడు చెప్పియున్నాఁడు[1]. కాని బాలకాండ మంతయుఁ బ్రక్షిప్త మనుట శక్యము గాదు. ఇఁకఁ గథను గూర్చి యాలోచింతము.

కథాసంవిధానము

ఇక్ష్వాకురాజవంశమునకు సంబంధించిన యీ రామాఖ్యానము బహుపురాతన మైనది. సరయూనదీతీరమందలి యయోధ్యాపురము రాజధానిగాఁ గోసల దేశము పరిపాలించిన దశరథమహారాజునింటఁ బుట్టినది—దశరథుని పెద్దకొడు కగు శ్రీరాముఁడు మిథిలాపురరాజగుజనకునికూఁతు రగుసీతాదేవిని బెండ్లాడి, సవతి తల్లికోరికనుబట్టి పదునాలుగేండ్లు రాజ్యము విడువ నిష్టపడి పితృవాక్యపరిపాలన మాచరింప ధర్మపత్నీసమేతుఁడై తమ్ముఁడైనసౌమిత్రి వెంట రా నడవులకేగి యందు వసియుంచుచు, రావణుఁ డనురక్కసుఁడు తనభార్య నపహరింప సుగ్రీవుఁ డనుకపిరాజుతో మైత్రిచేసి వానరసేన సహాయముగా రావణుని సంహరించి తన సాధ్విని దోడ్కొని యయోధ్య కేతెంచి మూర్ధాభిషిక్తుఁడై ప్రజారంజకముగాఁ జిరకాలము పరిపాలన మొనరించెను—అనునది యీయాఖ్యానమునకు మూలము. ఈ మూలకథ వాల్మీకినాఁటికిఁ బెద్దలవల్లఁ గర్ణాకర్ణికగా వచ్చినదే కాని, అతని నాఁటిది కా దని యతఁడు రచియించిన బాలకాండపంచమసర్గావతారికవల్లను, అతఁడే యందం దుపయోగించినయితిహాసాఖ్యానశబ్దములవల్లను గూడఁ జక్కఁగా సూచింపఁబడుచున్నది. రామాయణ మితిహాస మని వివిధపురాణాదులును పర్కొంచియున్నవి. ఇతిహాస మనఁగాఁ బురావృత్తము కదా! అయిన నిది సత్యమా లేక కల్పితమా? అని కొందఱు శంకింపవచ్చును. కాని, సుశీలుఁడు శూరుఁడు నగునొకయుత్తమక్షత్రియునికృత్యములను దెల్పుచున్న యీమూలకథ మానవాతీతముగాఁ జేసి సత్య మని భరతఖండమున కస్థిగత విశ్వాసము నకు విరుద్ధముగా నిది కల్పిత మని యూహింపవలసినంత ప్రబలహేతు వేమియు గనఁబడదు. వాల్మీకియు—

> "ఇక్ష్వాకూణా మిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనాం
> మహ దుత్పన్న మాఖ్యానం రామాయణ మితిశ్రుతమ్"

ఈ రామాయణమహాఖ్యాన మిక్ష్వాకురాజవంశమం దుత్పన్న మైనదిగా వినవచ్చుచున్న దనుచు నిది సత్యమైన పురావృత్త మనెడివిశ్వాసమునే వెల్లడించి

1. See, Sansk. Lit. P. 304.

యున్నాఁడు. ఇది గాక, ఐక్ష్వాకులచరితములు ఋగ్వేదాదులందును, ఆ వంశము వారిరాజధాని యైన యయోధ్య యుత్తరదేశమందును బ్రత్యక్ష మగుచుండ నవి కల్పితము లనఁజాలముగదా! ఇఁక నావంశమందు శ్రీరాముఁ డనుమహావీరుఁ డవతరించి లోకోత్తరవర్తనుఁడై కీర్తనీయుఁడయ్యె ననునది మాత్రము కల్పితమనఁదగునా? ఇంత యేల? ఆపూర్వకాలమహర్షులు కేవలకల్పితవృత్తములను వర్ణించినవారు కా రనుట విశ్వసనీయ మగుచుండ, నీరామాయణమూలకథ సత్యమనువిషయమున మనకు సంశయ మెందుకు? ఇఁకనో, గ్రంథమందలికొన్ని యద్భుతవర్ణన లట్టిసందేహమున కెడ మిచ్చుచున్న ఎందుచేని వానిని సమర్థించుకొందముగాక.

శుద్ధసత్త్వప్రసన్న మయ్యుఁ బ్రచండశౌర్యభాసురమైన శ్రీరామునిచరిత మపూర్వ మసాధారణ మాశ్చర్యానందదాయక మచింత్య మతిపావనమునై యాదినుండియుఁ బ్రాజ్ఞులహృదయ మాకర్షించుచు వచ్చి క్రమముగా వాల్మీకి నాఁటికి మహామహిమాభిరామ మైనపరమేశ్వరచరితమై ప్రత్యక్ష మైనది. కావుననే యట్టిమహానాయకుఁ డవతారపురుషుఁడు కానోపు నని భావించి, శిష్టరక్షణ దుష్టశిక్షణార్థమై శ్రీమహావిష్ణువే దశరథునియింట శ్రీరాముఁడై యవతరించె నని వాల్మీకి కథారంభము గావించెను. అది సముచితమే. ఏదోయొక్కొక్కఘన కార్యము గావించిన మహాపురుషు లెల్ల నీశ్వరాంశసంభూతు లని కొనియాడఁ బడియుండ సకలసద్గుణపుంజము సచ్చిదానందమూర్తియు నైన శ్రీరాముఁ డీశ్వరావతార మని భావింపఁబడుట కబ్బుర మేమి? అందుకే పరమేశ్వరానుగ్రహపాత్రు లైనఋషులజ్ఞాననేత్రములనుండి ధర్మాధర్మబోధకము లైనవేదము లావిర్భవించినట్లే వేదవేద్యుఁ డైనపరమపురుషుఁ డవతరించినంత వేదతుల్యమైనరామాయణము ప్రాచేతసునినోట నావిర్భవించె నని తత్త్వజ్ఞులు తలంచిరి. ఇదియును సముచితమే. ఒకవిశేషప్రతిభాశాలిబుద్ధి కైన నూహింప నలవిగాని యామహావతారపురుషుల యమానుషాతీతకృత్యములే కదా, భగవంతుఁ డొకఁ డున్నాఁ డని యనుమానప్రమాణముచే సాధించినవిషయమును బ్రత్యక్షప్రమాణముచే స్థిరపఱిచెడియాస్తికుల కాధారములై యితిహాస పురాణాదిరూపమున నీజగ మెల్ల నాక్రమించినవి: లేదేని, ఆస్తికమత మేమైయుండునో!—ఇట్లు తొలుఁదొల్తఁ గథానాయకుఁ డీశ్వరావతార మని నిరూపింపఁబడినపిదప నిఁకఁ గథలో భగవద్విలాసములుగా నహల్యా శాపవిమోచనాదు లగు నద్భుత విషయములు కొన్ని వర్ణింపఁబడిన వన్న నసంగత మేమి? అది గాక, కావ్యదృష్టితోఁ జూచినను, అద్భుతవర్ణన లాకాలమునఁ బాఠకరంజకము లగుట కవితాసృష్టిలోని

విశేషయమేకదా! కావున నిష్కాముఁడును లోకానుగ్రహకాంక్షియు నైన వాల్మీకిమహర్షి, ధర్మాధర్మ విజ్ఞానమున లోకము తరించుఁగాక యని సంకల్పించి నిర్మించిన రామాయణేతిహాసము కథానాయక మహామహిమ చిహ్నము లయిన కొన్ని యద్భుత వర్ణనలతో విలసిల్లినను, అంతరిమూలకథ కల్పితము గాక సత్య మనియే విశ్వసింపనగును. ఇఁక నాంతరవిషయము లింపుగ పరిశీలింతము.

పర్యవసానమునుబట్టి దుష్టనిగ్రహముతోడి శిష్టపరిపాలనమే యీ కథకు ఫల మని తెలియవచ్చునుగాని, కథా సంవిధాన దృష్టితోఁ బరిశీలించినచోఁ గైకేయీవరమే కథకు బీజ మని చెప్పకతప్పదు. దాని కంగములుగా నెన్నేని తారణము లుండుఁగాక; ఆవరమే లేనిచో రామకథ సీతాకల్యాణముతో సమాప్తము కావలసినదే. కైకేయీ పాత్రవృత్తము చూచుట కిసుమంతయైనను, నీళ్ళమీఁది నూనెచుక్కవలెఁ గథయంతటఁ బ్రాఁకినది. మూర్ధాభిషేకవార్త విన్నపుడును బదునాలుగేండ్లడవుల నివసింపు మనుమాట విన్నపుడును గూడ హర్షవిషాదము లింతకేని లేక యొక్కతీరున నున్న శ్రీరామునంతటి మహానుభావుఁడుగూడ మానవస్వభావమునకు లోనై వనవాసము చేసినన్నాళ్ళు నెడనెడ సవతితల్లి మూలముగా సంభవించిన మనసులోనినొవ్వు వెలిపుచ్చక మానలే దనుటయే యిందుకు నిదర్శనము.

సుఖ మున్నదో లేదో, దానిమాట యటుండనీ! లోకములోఁ గలహమునకుఁ గాని కష్టమునకుఁగాని స్త్రీయే మూలమనెడి సిద్ధాంతము నెలకొల్పుటకో యన రామమూర్ధాభిషేక సమయమున మెల్లగాఁ గైకేయీ పాత్రము రంగముఁ జొచ్చి దేవాసుర యుద్ధమున దేవతలకు సహాయుఁడై కీర్తిగాంచిన దశరథునివంటి రాజాధిరాజునుగూడ నోరు మూయించినది. రాము నడవికిఁ బంపినది. కౌసల్య కడుపునఁ జిచ్చు పెట్టినది. వసిష్ఠ వామదేవులవంటి మహర్షులనుగూడ నిశ్చేష్టులను గావించినది. ఇంత యేల? ఆదిని రాజును మ్రింగినది, అంతమున రావణుని నిర్మూలము గావించినది. దీనిమహిమ యింతేనా? బంగారమువంటి భరతుని వైరాగిని జేసినది. సీతారామలక్ష్మణులను మెల్లమెల్లగా జనస్థానమువఱకు గెంటుకొనిపోయి యక్కడఁ జేయూఁతయిచ్చి పంచవటీ ఘట్టమును లేవనెత్తి తాను మఱుఁగున నుండి చూచినది.—అది కిష్కింధమీఁదుగా, వై కెగఁబ్రాకినది. అట్టి యఘటన ఘటనాచతుర మైన యీవరముగాక కథాబీజము మ ఱేదగునో చూడుఁడు. కైకేయీ వరమే లేనిచో నయోధ్యాకాండమున కాధార మేది? అరణ్యకాండమున కవలంబన మెక్కడిది? కిష్కింధా కాండకుఁ గీర్తి యేమి? సుందరకాండకు సొగ

నెక్కడ? యుద్ధకాండము పద్ధతి యెట్లు? ఆహా, ఆవ్యమహాకవి చతురాస్యుని కథా సంవిధానపై చిత్రి! ఇంక—

పాత్రచితి

నవరసముల కాటపట్టయిన యీమహేతిహాసమందలి పాత్రము లొక్కొక్కటి యొక్కొక్క గుణవిశేషమునఁ దీర్చి దిద్దిన ట్లున్నవి. అందు కొన్ని—

దశరథుఁడు—ప్రేమపాశసత్యపాశములు కంఠమున నురులై చెఱియొక ప్రక్క లాగుచుండ నేమిచేయుటకుఁ దోఁచక యూపి రాదక గిజగిజలాడి తుదకుఁ బ్రేమపాశమునకుఁ బ్రాణమర్పింప నిశ్చయించుకొని నోరుమూసికొని ముందుగా సత్యపాశమునకు సౌశీల్యము సమర్పించెను. ఈగుణ మెవరో మెచ్చుకొనుట యాశ్చర్యకరము కాదు పుత్రవియోగ దుఃఖితయై మైమఱచి పతిని నిందించి కొంతవడిఁ దెలివి తెచ్చుకొని "దేవా! పుత్రశోకార్తనై నేనేదో ప్రేలితిని. అకటా! శోక మెంతటి యకృత్యమైనఁ జేయించునుగదా? కాని, ధర్మమెఱుఁగుదును. సత్యజ్ఞుఁడ వైననీవు సత్యవాది వనియు నెఱుఁగుదును" అనుచు రామమాతయైన కౌసల్య మెచ్చుకొనుటయే విశేషము.

కైకేయి—ఈపాత్రము రామాయణములోని యితరపాత్రములకును లోకమునకును గూడ నిందాపాత్ర మైనమాట నిజము. ఇందుకుఁ గనఁబడు ముఖ్య కారణము రాజ్యలోభమే. కాని, కైక యుత్తమక్షత్రియాంగన. తనపుత్రునికంటెఁ గూడ రాము నెక్కువగాఁ బ్రేమించిన యుదారహృదయ. తాను జేని కెక్కువనురాగభాజనమైనను, కౌసల్యయెడ గౌరవము చూపిన వివేకిని. శ్రీరాముని యభిషేక వార్త తెలిపిన మంథర కతిహర్షముతో మణిభూషణ మిచ్చిన సుశీల. రామభరతులలో నెవఁడు రాజైనను సమానమే యని సంతోషము చూపిన సమదర్శిని. అయిన నేమి? ఇట్లు చిత్రింపఁబడిన యీపాత్రము మంథరాదుర్బోధలపాలై యొక్కమాఱు తలక్రిందైనది. వెనుక భర్తయిచ్చిన రెండువరము లప్పు డడిగి పుచ్చుకొనుటకు నిశ్చయించినది. మనసు మాఱుటతో వెనుకటి వివేక మంతయు మటుమాయమైనది. ముందువెనుక లాలోచింపక పట్టినపట్టు సాధించినది. స్త్రీ సాహసమున కద్ది యుండునా యన్న సామెత స్థాపించి రాజ్యలోభమున నకృత్యమాచరించె నన్న నిందకు గుఱియైనది. ఇందులో మంథర దుర్బోధ కాని, భర్తయిచ్చినవరము లడిగిపుచ్చుకొనుట కామెకుఁగల హక్కుగాని పైకి రావు. కులక్రమాగత మైనమూర్ధాభిషేకమున కొక్కాక విఘ్నము కలిగించి సుకుమారుఁడును

సుశీలుఁడు నైనరాము నడవిపాలు గావించుటమాత్రమే పైకిఁ గనఁబడును. మహర్షికూడ నీపాత్రము కేవలనింద్యముగాఁ గనరాకుండుట కేదో హేతువును చూపియుఁ దుదకు నిందకే పట్టము కట్టెను. కథాప్రవృత్తిసమృద్ధి కది యుక్తమే కదా! చూడుఁడు.

వరములనుగూర్చి తీవ్రసంవాదము జరిగినపిదప దశరథుఁడు ప్రాణము విసిగి "ఓసీ! నేను ధర్మపాశబద్ధుఁడ నైతిని. నాచేతన మడుగంటినది. ఇఁక ధార్మికుఁడైననాపెద్దకొడుకును మాత్రము చూడఁగోరుచున్నాను" అనెను. సరే యని కైక రాముని రప్పించినది. అతఁడు వచ్చి నమస్కరించినంత రాజు 'నాయనా రామా' అని, కన్నులనీరు గ్రమ్మఁ గంఠము స్తంభింప మఱి చూడలేఁడు,పలుకలేఁడు. ఆయవస్థలోని తండ్రినిజూచి రాముఁడు భయవిషాదకంపితాంతరంగుఁడై "అమ్మా! మానాయనగారియీయపూర్వవికారమునకుఁ గారణ మే"మని గ్రుచ్చి గ్రుచ్చి యడిగెను. అట్లు దీనావస్థలో నున్నతండ్రికొడుకులను జూచి యించుకైన జాలి పడక కైక నిర్లజ్జయై "కుమారా! నీ వనుకొన్న కారణ మేమీ కాదు. మీ తండ్రి తన మనసులోని యొకమాట నీతోఁ జెప్ప జంకుచుండెను. మున్ను నాకిచ్చిన వాగ్దానమున కిపుడు పశ్చాత్తాపపడుచున్నవాఁడు నీతో నది చెప్పఁజాలక యిట్లుండెను. ఆమాట నేనే చెప్పెదను వినుము" అని తనవరములు రెండును వెలఁ గ్రక్కెను. భర్తప్రాణ మైన నరకుగొనక లోకనింద కొడి యొగ్గి స్త్రీజాతికి సహజమైన కుసుమసుకుమారహృదయము నల్లరాయి గాఁగ వినయమూర్తియు సుగుణరాశియు నైన కుమారరామునితో నీ వడవికి లేచిపొమ్మని నిర్దాక్షిణ్యముగాఁ బలికిన యీపాత్ర మిఁక నింద్య మెట్లు కాకపోవును? ఈ ఘట్ట మిట్లుండ కున్నఁ గథ యెట్లు నడచును? కావునఁ గైకేయీపాత్రము లోభగుణమున కావ్య నిదర్శనమై సముచితముగాఁ బోషింపఁబడిన దనియే తలంపవచ్చును.

శ్రీరాముఁడు[1]—తాతపాదుల కసత్యదోషము తగులకుండుటకై రాజ్యము విడిచినస్వార్థత్యాగియు సాధుబాధకులను లోకకంటకులు నగుదుష్టులను సంహరించినవీరాతివీరుఁడును సచ్చరిత్రమున లోకము నాకర్షించినసుగుణరాశియు నైన యీపాత్రము లోకోత్తరమై, యాద్యంత మొక్కరీతి నెట్లు పోషించవలెనో యట్లు పోషించిన మహర్షి వాక్కునం బడి, యాసేతుహిమాచల మాబాలగోపాలము నిరంతరకీర్తనీయ మగుటయే దీనియౌచిత్యపారంగతత్వమునకుఁ దార్కాణము. మహిమపక్షమున విష్ణునియవతారముగా నందందు చూపించినను, కథాపక్షమున

1. ఇతఁడు, ఈజిప్టుదేశ చక్రవర్తి యనుమత మొకటి క్రొత్తగాఁ బుట్టినది.

సర్వత్ర ధీరోదాత్తుఁ డగునుత్తమక్షత్త్రియునిఁ గావించి దానవయాయుద్ధవీరునిఁ నితని కితఁడే సాటి యనునట్లు వర్ణించినవాల్మీకిమాటలనుబట్టియే యిఁక నిప్పు డతనిపాత్ర మాత్ర మొకింత తరచి చూతము.

శ్రీరామదశరథులభక్తివాత్సల్యము లింతంత యని నిర్ణయింప వీలుగా నంతగా బాలాయోధ్యాకాండముల వెల్లివిరిసినవి గాని, "సూర్యుఁడు లేకుండ లోక మైన నిలుచును గాని రాముఁడు లేకుండ నాప్రాణము నిలువఁ జాలదని కైక యిచెంత విలపించిన దశరథుని పుత్త్రవాత్సల్యమునకంటె, "మాతండ్రి యనుజ్ఞ యిచ్చిన నే నేమి చేయవలసినఁ జేయుదును. అతఁడు చెప్పకున్నను నీమాటనుబట్టియే నే నడవికిఁ బోవుదును. మాజనకునిప్రతిజ్ఞ నెరవేర్చుటకంటె నాకు ధర్మాచరణము వేఱేమి యుండును?" అని కైకతో నెట్టిసంకోచమును లేక పలికి. మహాభిషేకమంటపమునఁ బెట్టియున్న కాలు గాఢారణ్యమునఁ బెట్టినరామునిపిత్రుభక్తి వేయిరెట్లెక్కు డని క్రియనుబట్టి చెప్పవచ్చును. ఇది యట్లుండెను, రాముఁడు గంగానది దాఁటి వెళ్ళిననాఁటిరాత్రి సౌమిత్రితో నన్నమాట లిట్లున్నవి.

"ధ్రువ మద్య మహారాజో దుఃఖం స్వపితి లక్ష్మణ!
కృతకామా హి కైకేయీ తుష్టా భవితు మర్హతి
సా హి దేవీ మహారాజం కైకేయీ రాజ్యకారణాత్
అపి న చ్యావయే త్ప్రాణాన్ దృష్ట్వా భరత మాగతమ్
అనాథ శ్చైవ వృద్ధశ్చ మయా చైవ వినాకృతః
కింకరిష్యతి కామాత్మా కైకేయీవశ మాగతః
ఇదం వ్యసన మాలోక్య రాజ్ఞశ్చ మతివిభ్రమమ్
కామ ఏవార్థధర్మాభ్యాం గరీయా నితి మే మతిః
కో హ్య విద్వా నపి పుమాన్ ప్రమదాయాః కృతే త్యజేత్
ఛందానువర్తినం పుత్రం తాతో మా మివ లక్ష్మణ!"

ఈమాటలు తనతండ్రి వార్ధకదశలోఁ దన్ను విడిచి దుఃఖింపవలసి వచ్చినదిగదా యని జాలిపడి యన్నవే యైనను "కామాత్ముఁడై కైకేయీవశుఁడైన వాఁ డేమిచేయును? అతనివ్యసనము చూడఁగా నర్థకామములకంటెఁ గామమే గొప్ప దని తోఁచినది. ఎంత తెలివిమాలినవాఁ డైనను ఆఁడుదానికొఱకు తన తండ్రివలె వశవర్తి యైనపుత్త్రుని విడుచునా?" అనుమాటలలో నించుక నింద

స్ఫురింపకపోదు. ఇది యుద్దేశపూర్వక మైననిందయై రాముని పితృభక్తి కేమేని కలంక మాపాదించునా యనునదే విచారణీయము.

దశరథుఁడు సత్యబద్ధుఁడై తన్ను విడిచెనో కైకేయీవశుఁడై తన్ను విడిచెనో రాముఁ డెఱుఁగకపోలేదు. కాని, దేవాసురరణరంగమునకుఁ బోవునపుడు గూడఁ గైకేయిని విడువకుండుటయు, ప్రభు వయినవాఁ డందు దూరదృష్టి లేకుండ రెండువరము లిచ్చితి ననుటయు, అనిర్దిష్టములైన యావరములయుద్దేశ మిది గాక పోయినను వాని నీవిధమునఁ దీర్చు మని కైక కోపాగారమున భూశయ్యనుండి కోరినపు డెంతయు విచారించియుఁ దుదకు సమ్మతించి యూరకుండుటయు, కామార్తుఁడయిన యతని కైకేయీ వశ్యతను దెలుపుచున్న వని యాయవస్థలో మానవస్వభావమునుబట్టి రాముఁ డూహించుట యసంగతము కాఁజాలదు. ఇంతకును గవీంద్రుఁ డీపట్టునఁ గైకేయీ వరములకుఁ గాను దెచ్చి యతికినయతిమానుషమైన దేవాసురసంగ్రామ సాహాయ్యకథ యించుక యడ్డపడినది గాని లేకున్న దశరథపాత్ర మెట్టినిందపాలై యుండునో! కావున దశరథుని కైకేయీ వశ్యత్వ మిరుతెఱఁగుల సూచించిన కవివశమున రాముఁ డన్న పైమాటలు తండ్రి పుత్రవిరహదురవస్థకుఁ బరితాపము తెలుపునవే కాని నిందను సూచించునవి కావని సంతసింపవచ్చును. అందుచే రాముని పితృభక్తి యెంతమాత్రము కలంకితము కాఁజాలదు. ఇఁకనో—‘రాజ్యముకోస మింకఁ గైకేయి మహారాజు ప్రాణము తీయకుండుఁగాక’యని యిక్కడను, ‘కైకేయికోరిక ఫలించిన’దని సీతావియోగ సందర్భమందును, రాముఁడు కైక నుద్దేశించి రెండుమాట లన్నను, ఇవి యెంతటి యుదారహృదయునినోట నైనను గష్టదశలో నప్రియత్నముగా సహజముగా నాత్మదుఃఖము వెల్లడింప వచ్చునవేకాని యుపాలంభపరములు కా వనుట లోకానుభవసిద్ధము. కావున వీనినిబట్టి రాముని మాతృభక్తినిగూడ శంకింపఁ బనిలేదు. సకల సద్గుణపుంజమైన రామునిశీల మెవరికిఁ గ్రొత్త?

సీత—మహావిష్ణువు నాశ్రయింప భూదేవి కవతరించిన లక్ష్మి యైన యీమె కావ్యవశమునఁ బ్రాణము పోసిన పాతివ్రత్యరాశియై యయోనిజ యయ్యెను. చచ్చినా బ్రతికినా సతికిఁ బతియే గతి యఁట. భర్త కెట్టికష్టము కలిగింపక యతని నీడయై యడవుల నుండునఁట. మగనితో నున్నవనమే మగువకుఁ బుట్టిల్లఁట. భర్తలేని స్వర్గమైనను బాడుకొంపయఁట. అర్ధాంగియైన భార్య భర్తృ సుఖదుఃఖ భాగిని యఁట. వీరుఁడైన పురుషుఁడు తన పెండ్లామును బోషింప నన్యుల కప్పగించఁగూడ దఁట. ఆహా! అసూర్యంపశ్యయైన రాజకుమారి యరణ్యావాసదీక్ష!

ఏమి సౌశీల్యము! తనపెనిమిటి యభిషేకమున కంతరాయము కలిగించిన సవతి యత్తచర్యనైన స్మరింపలేదు. మామమాట యెత్తలేదు. కలిమి విడువఁ గలఁత పడలేదు. బంధువులకు దూర మగుదు నని పరితపింపలేదు. పతి ననుగమించుట తప్ప రెండవది యీమె డెందమునలేదు. పరనింద యీమె పాఠముననే లేదు. తన్నాదరించి మాటాడిన యనసూయతోఁ దనజన్మవృత్తమును వివాహోదంతమును జెప్పినది గాని లోకములోని యాఁడుదానివలెఁ దమవనసంచారమునకు మూల మైన యప్పటిమాట లేమైన నెత్తెనా? భరతునిరాక చూచి లక్ష్మణుఁ డైన మతి చెడినమాట లనెను గాని యీమె ముఖమున నసూయాచిహ్నమైన నగపడెనా? అట్టి యీ సతీమతల్లి మారీచమాయాసమయమునఁ గాఁగల కర్మమును బట్టి సౌమిత్రి నుద్దేశించి యించుక పరుషభాషణము గావించినది. ఆమాట లన రానివే కాని, తనభర్త నిజముగా నాపదపా లయ్యె నని నమ్మి దుఃఖమగ్నమానస యైన యీమె కెన్ని చెప్పినను విననిలక్ష్మణుఁ డిల్లు కదలి వెళ్లుట కంతకంటె వేఱుగతి కనఁబడలేదు. లోకములో నట్టియవస్థలో నున్నయెట్టి సుశీల హృదయమం దైనను సహజముగాఁ బుట్టఁదగిన యట్టిభావమునే పుట్టించి కవిచంద్రుఁ డీమెచే నట్లు పలికించెను. సీత లక్ష్మణునిభావ మెఱుఁగనిది కాదు. అతని సత్ప్రవర్తనము తెలియనిది కాదు. అయిననేమి? అతనిఁ బంపకున్న నీమె మనసులోని సంతాపము చల్లారదు. ఆమాట యన్నఁగాని యతఁడు కదలఁడు, అందుచే నీసందర్భ మందలి సీత నిష్ఠురోక్తు లనుచితములు కా వనియే భావింప నగును. ఇంతకంటె నీమె సౌశీల్యమున శంకింపఁదగిన విషయమే కనఁబడదు.

భరత లక్ష్మణ శత్రుఘ్నులు—సౌభ్రాత్రము సాకారమైన పాత్రము లివి. అన్నతోడిదే లోక మని భార్య నింట విడిచి బ్రహ్మచారియై సీతారాముల పాద సేవయే జీవితఫల మని వానప్రస్థుఁ డైన భక్తిమూర్తి లక్ష్మణుఁడు. లోకాపవాద మునపాలై తల్లి సంపాదించిన రాజ్య మొల్లక వానప్రస్థునివలె జటావల్కలధారియై ఫలమూలాశనుఁడై శత్రుఘ్నునింగూడి శ్రీరామపాదుకలు సేవించిన భక్తియోగి భరతుఁడు. ఇద్దఱు నిర్మలభక్తులే కాని, సౌమిత్రికంటె భరతుఁ డించుక యెక్కువ భక్తుఁ డని కథాస్థితిని బట్టియు "భరతుండు నీకంటె భక్తుండు నాకు" అని రామునిచేననిపించిన రంగనాథుని పరిశీలనమునుబట్టియు నమ్మవచ్చును. ఇరువురును సహృదయులే కాని, కైకను జంపెదను, భరతునిఁ బరిమార్చెద ననుచుఁ దాత్కాలికావేశమున నావేగము చూపిన సౌమిత్రికంటె, అపకీర్తిలజ్జితుఁడై యమ్మను నిందించినను; జరిగినదానికిఁ బ్రతిక్రియ చేయఁజాలక రామపాదుకలచే రాజ్యము చేయించిన భరతుఁ డెక్కువ దీర్ఘదర్శి. ఇట్టు లీషద్భేద మున్నను, వీర లన్నకుఁ

దగిన తమ్ము లనఁదగిన సుశీలు రనుట స్పష్టము. ఇఁకఁ గవితాగురుఁ డగ్రప్రతిమాన ప్రతిభచే నడపించిన పాత్రములయౌచితిని బరామర్శింపఁ గాలహరణము గావింపక గ్రంథవిశేషము లోకింత కనుఁగొందము.

రామాయణవిశేషములు

రాజవంశములు:—నేఁటికిని వివాహములందుఁ గనవచ్చు కన్యావరగోత్ర ప్రవరకథనరూపమైన సనాతన వైదికాచారమునుబట్టి జనకుని కన్యలను రామలక్ష్మ ణులకుఁ గోరిన విశ్వామిత్రుఁడు సూర్యవంశ పురుషక్రమమునుదెలిపెను. జనకుఁడు నిమివంశ పురుషక్రమము తెలిపెను. ఈసందర్భమునందును, వసిష్ఠుఁడుఁ శ్రీరాము నికి సనాతన కులధర్మ ముపదేశించిన సందర్భమందునుగూడ సూర్యవంశ మందలి జ్యేష్ఠపురుషులక్రమము చూపఁబడినది[1]. కాని మొదటి క్రమముననున్న యయాతి రెండవక్రమమున లేఁడు. అంబరీషునికి నహుషుఁడు నతనికి యయాతి యతనికి నాభాగుఁడు పుట్టినట్లు మొదటిపాఠమును, నహుషుని కొడుకు నాభాగుఁ డని రెండవపాఠమును జెప్పుచున్నవి. వాల్మీకియే యిట్లు రెండువిధములఁ జెప్పి యుండఁడు గావున నిందేదో యొకపాఠము ప్రక్షిప్త మనవలసి వచ్చుచున్నది[1]. అ దేదో నిర్ణయించుట కష్టసాధ్యమే కాని రెండవపాఠమే ప్రామాదిక మని తోఁచుచున్నది. ఇది యిట్లుండ, దిలీపునికొడుకు భగీరథుఁడు—అతని కుమారుడు కకుత్థ్సుఁడు అతనికొడుకు రఘుమహారాజు—అని రామాయణములో నాలుగైదు చోట్లఁ గనవచ్చుచుండఁగా భాసమహాకవిప్రతిమానాటకమందును, మహాకవికాళిదాసు రఘువంశమునందును, దిలీపుని కొడుకు రఘువు. అతని కొడుకు అజుడు—అతని కొడుకు దశరథుఁడు—అనుక్రమము కనఁబడుచున్నది[3]. ఇట్టి విరోధములు పౌరా ణిక రాజవంశక్రమములందు సర్వత్రకనవచ్చునవే కావున గ్రంథవిస్తరభీతిచే నిందేది సముచితమో నిర్ణయింపక యీవిషయము పాఠకలోకమునకు విడుచుచున్నాను.

సీతారామవయోవిచారము :— రాముఁడు విశ్వామిత్రునితో యాగసంరక్ష ణార్థము వెడలునాఁటి కూనషోడశవర్షుఁడు[4]. స్వయంవరకాలమునకు సీత పతి

---

1. బాలకాం. 70-71 అయో. 110.

2. చంద్రవంశమందలి నహుష యయాతు లాయువుపుత్ర పౌత్రులు.

3. దిలీపరఘువుల నడుమ నిద్దఱును, రఘువునకు నజునికి నడుమఁ బదునొకండుగురును, పురుషులుగలరు. మొత్తము బ్రహ్మ మొదలుగా శ్రీరామునివఱకు 40 తరములు, మనువు మొదలుగా 36 తరములు, రామాయణమునఁ గనఁబడును.

4. బాల. 20.

సంయోగసులభవయస్క[1]. అక్కడక్కడ మున్యాశ్రమములోఁ గొంతకొంత కాలము నివసించుచు సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణాశ్రమము చేరునాటికి వనవాస సంవత్సరములు పది గతించినవి[2]. జనస్థానమున సీత రావణునితోఁ జెప్పిన వృత్తాంతమునుబట్టి చూచినచో, ఆమె యత్తవారింట సకలభోగము లనుభవించిన కాలము పన్నెండు సంవత్సరములు. రాముఁ డడవికి బయలుదేఱునాఁటి కతని వయస్సు, ఇరువదియైదు వత్సరములు. అప్పటికిసీతవయస్సు పదునెనిమిదియేండ్లు[3].

ఎట్లు చూచినను నైమాటలు వీరివయస్సువిషయమునఁ బరస్పరవిరుద్ధములే. ఇవి ఋషివాక్యము లనుటకు మన సొప్పదు. ప్రక్షిప్తము లనుటకు వీలుకనఁ బడదు. కావున వీనిం గూర్చి చర్చింపక విడుచుటయే యుచితము.

రామాయణరచననాఁటిభాష :— అగస్త్య భ్రాత యాశ్రమమున బ్రాహ్మణ వేషధారులై యిల్వల వాతాపులనెడి యసురు లుండెడివారు. వారిలో నిల్వలుఁడు సంస్కృతమున మాటలాడుచు బ్రాహ్మణులను శ్రాద్ధభోజనమునకుఁ బిలుచుచు మేషరూపుఁ డైనవాతాపిని జంపి వానిమాంసము వండి వారికిఁ బెట్టి పిదప వాతాపీ! ర మ్మని పిలువ వాఁడు బ్రాహ్మణుల పొట్టలు చీల్చుకొని యీవలికి వచ్చెడి వాఁడు[4]. సుగ్రీవసచివుఁ డగుహనుమంతుని సంభాషణమునకు సంతోషించి రాముఁడు సౌమిత్రితో "వేదత్రయము చదువని వాఁ డిట్లు మాటలాడఁజాలఁడు. ఇతనికి వ్యాకరణజ్ఞానము పూర్తిగాఁ గలదు. ఇంతసేపు మాట లాడెనుగాని యొకయపశబ్ద మైన రాలేదు." అని పలికెను[5]. అశోకవృక్షముమీఁద నున్న యాంజనేయుఁడు క్రింద దుఃఖించుచున్నసీత నాశ్వాసింప నుద్యుక్తుఁడై "నేను వానరుఁడను. ద్విజాతివారివలె సంస్కృతవాక్కున మాటలాడిన యెడల నన్ను రావణునిగా భావించి సీతాదేవి భయపడునేమో! అయినను సంస్కృతముననే నేను దప్పక మాటలాడవలసియున్నది" అని తలంచెను[6]. ఇట్లున్న వాక్యములను బట్టి చూడఁగా నాకాలమున ద్విజాతివారు సంస్కృతభాషలో మాటలాడుచుం డెడివా రనియుఁ దక్కినవారు ప్రాకృతమున మాట లాడెడివా రనియుఁ దెలియక

1. అయో. 118.
2. అర. 11.
3. అర. 47.
4. అర. 11.
5. కిష్కిం. 3.
6. సుంద. 30.

పోదు. ఈ విషయము ప్రథమసంపుటమున విశదీకరింపఁడి యున్నది గావున నిందీ సూచనము చాలును[1].

నాఁటిభరతఖండస్థితి :— ఈవిషయము మొదట నించుక సూచింపఁబడినది. వేదములందు గనరాని కొన్ని జనపదములును బురములును ద్వీపములును నదులును బర్వతములును రామాయణమునఁ గనవచ్చుచున్నవి. కిష్కింధాకాండములోని వీనివర్ణనములనుబట్టి చూచిన[2]. రామాయణకాలమునాఁటి కార్యులు భరతఖండ మంతట నాక్రమించిన సూచనలు కనవచ్చును. ఇందు వర్ణింపఁబడిన జనపదాదులు చాలవఱకు, భరతఖండమునందును దీనిచుట్టుపట్టులను గన విన వచ్చుచున్నవి గాని, యందలికొన్నిటి పేళ్ళు మాఱిపోయినవి. కొన్ని రూపుమాసినవి. ఇందు కొక యుదాహరణము. పశ్చిమ సముద్రవేలాతటమునందు "మురచి–జటి–అవంతి–అంగలోప–" అనునగరము లున్నట్లు వర్ణన కలదు[3]. ఈపురము లిపు డున్నట్లు తెలియరాదు. అవంతి యుజ్జయిని యనఁ బరగిన దనవచ్చుఁగాని యిది పశ్చిమ సముద్రతీరమున లేదు. కిష్కింధాకాండము చదివినవారి కిట్టి యుదాహరణము లెన్నేని కనఁబడును. హిందూదేశము నలుదెసల నున్న జనపదాదులనే కాక, శాంత మహాసముద్రము లోహితసాగరము, ఆమమీనాశన మత్స్యజలచరమునై నరవ్యాఘ్ర మనఁబడు కిరాతజాతి, లోహముఖమై యతిజవనమైన యేకపాదజాతి, మొదలుగాఁ గల దేశాంతర ద్వీపాంతర ఖండాంతర విషయములను వర్ణించిన వాల్మీకి భూగోళ విజ్ఞాన మత్యాశ్చర్యకరమై కిష్కింధాకాండమునఁ బ్రతిఫలించుచున్న దనుట సత్యము. అరణ్యకాండమునం దానాఁటి యుత్తరదక్షిణహిందూదేశములు కన్నులకుఁ గట్టినట్లు వర్ణింపఁబడినవి. అంతకుమున్ను నిర్మనుష్యము నిర్మృగము తరుగుల్మ లతాహీనము తాపసహితము నైనవింధ్యపాదదక్షిణభాగ మగుదండకావనిలోఁ దరువాత దారుణకాంతార మేర్పడినది. అగస్త్యుఁ డచ్చటికి వచ్చునాఁటి కందు వానలు లేవు. సుఖప్రద మైనగాలి లేదు. హిమవచ్ఛిఖరమునుండి యతఁడు వచ్చిన పిదప సకృత్తుగా వాన కురియుట మొదలుపెట్టినది[4].

ఇత్యాదిబహువర్ణనలతో నిండియున్న రామాయణము కేవలము కావ్య ముగానే కాక దేశభూగోళచరిత్రముగాఁ గూడ నుపయోగించుచున్న దనవచ్చును.

---

1. సం. వా. చ. ప్ర. పుట. 61–64.
2. కిష్కిం. 40–43 సర్గలు.
3. కిష్కిం. 42-13, 14.
4. అరణ్య. 13.

రాజధర్మములు :—వీనిని చక్కఁగా వివరించినది కచ్చిత్సర్గ [1]. బహువిధమైనలోకజ్ఞానమును సకలమైనశాస్త్రజ్ఞానమును సంపూర్ణమైనరాజనీతిని స్వచ్ఛమైనశీలమును బోధించుచున్న యించలివిషయ మానాఁటినాగరికత కాదర్శమై యతిమనోహరముగా నున్నది. ఇందు గనవచ్చులోకాయతికనిందనుబట్టి వాల్మీకి నాఁటికే స్వభావవాదమత మంకురించినట్లు కనవచ్చును.

సాంఘికాచారములు :—సీత సహగమనమును బ్రశంసించుటనుబట్టి యాకాలమున నది యున్న దని యూహింప నగునుగాని, కౌసల్యాదులు దాని నాచరింపకపోవుటనుబట్టి యది యైచ్ఛికముగా నుండెనేమో యని తోఁచుచున్నది. కాని, మృతకళేబరముతో స్త్రీలు శ్మశానవాటికకుఁ బోవుటమాత్రము నాఁటి యాచార మని కౌసల్యాదులయనుగమనమునఁ దెలియుచున్నది. ఋశ్యశృంగుఁడు శాంతను బరిణయమగుటనుబట్టియు, దశరథవిద్ధుఁడైనమునిబాలుఁడు వైశ్యునకు శూద్రస్త్రీయందు జన్మించినవాఁ డగుటనుబట్టియు వేదములనాఁటి యనులోమ వివాహము లానాఁ డాచరణములో నున్న వనుట విదితము. ఆనాఁటికిఁ జతుర్వర్ణములును స్వస్వవిహితవృత్తుల స్థిరపడినవి. ఆవృత్తులే తరువాత స్మృతులలో విధింపఁబడినవి.

విద్యాజ్ఞానము :—మంత్రబ్రాహ్మణారణ్యకోపనిషత్తులనుండి యుద్ధృతమైన వివిధవిద్యాజ్ఞాన మాకాలమున ద్విజాతులయందు విస్తరించినట్లుగా, ఆయుర్వేద ధనుర్వేద గాంధర్వ ధర్మశాస్త్ర వ్యాకర ణాన్వీక్షకీ వార్తా దండనీ త్యాదిసంజ్ఞలవల్లఁ దెలియనయ్యెడి. అవి యేవిజ్ఞాన మేరూపమున నుండెడిదో చెప్పఁజాలము కాని తరువాత నేపేళ్ళ వెలసినగ్రంథములలోనివిషయముల కప్పటికి వెనుకటినుండియు నాఁటినుండియుఁ బారంపర్యోపదేశమున వచ్చునదియే యాధారమని చెప్పవచ్చును. అట్లే జాబాల్యాదిమహర్షులమాటలలోనితత్త్వజ్ఞానమే తరువాత వెలసిన వివిధమతసూత్రములకు మూల మని విశ్వసింపవచ్చును. ఇంత యేల ? భాసకాళిదాసాదిమహాకవులకావ్యములలోనివివిధవర్ణనలకును శబ్దార్థాలంకారములకును రసపాత్రపోషణాదిపద్ధతులకును రామాయణమే గురు వనియు దీని ననుసరించి బహువిధ కావ్యము లావిర్భవించినవనియుఁ జాటకలోక మెఱుఁగక పోలేదు. ఇఁక దేవతారాధనము.

1. అమో. 100

భారతీయుల కిది క్రొత్త కాదు. ఈశ్వరునికి రూపము కల్పించి స్తుతించుట వేదములనాఁటియాచార మని మున్ను చదివియుంటిమి 1. అట్లే, బ్రహ్మ విష్ణు రుద్రులు సృష్టి స్థితి లయ కర్తలుగా వర్ణింపఁబడుట రామాయణమందును గనఁబడును. ఈ యారాధనము కేవలస్తుతిరూపము గాక విగ్రహారాధనపరముగా మాఱె ననుటకు రామాయణములోని—

"కచ్చి చ్చైత్యశతై ర్జుష్ట స్సునివిష్ట జనాకులః
దేవస్థానైః ప్రపాభిశ్చ తటాకై శ్చోపశోభితః" 2.

అనుశ్లోక మొకటి కనఁబడుచున్నది. ఇందలిచైత్యశబ్దమునకు, యజ్ఞశాల రచ్చ్రమాను గుడి యనునర్థము లగును గాని, అప్పటికి బౌద్ధమతప్రసక్తి లేదు కావున బౌద్ధాలయ మర్థము కానేరదు. దేవస్థానశబ్దము వేఱుగా నుంటచే గ్రామములోనిపదిమంది యొకచోటఁ జేరి ముచ్చట లాడుచుఁ గూర్చుండురచ్చ్రమా ననెడియర్థమే దీనికి సముచిత మగును. ఇఁక దేవస్థానము ప్రతిష్ఠించినవిగ్రహముల యాలయమా ? లేక యీశ్వరుని ధ్యానించుపవిత్రస్థలమా ? అనువిషయ మజ్ఞేయముగా నున్నది. ఈశ్వరునికి రూపకల్పన మానాఁటి కెంతో పూర్వమే యున్నది గావున నిది విగ్రహస్థానపర మని చెప్పినను దోషము కాదు. ఇట్లే బాలకాండమున—

"వధూనాటకసంఘైశ్చ సంయుక్తాం సర్వతః పురీమ్"3.

అనుమాట యున్నది. ఇవి, రంగస్థలములరూపకములఁ బ్రదర్శించుసంఘములు గాక, నాట్యము లేక నృత్యము సలుపునట్టి స్త్రీసంఘము లని భావింప వలసియున్నది. ఛాందోగ్యోపనిషదాదులందు దేవజనవిద్య యనుపేర గాంధర్వవిద్య విదితమై యుండ రామాయణమునాఁడు నృత్యకల విస్తరించి యుండు ననుట కాక్షేపము లేదు. కాని, యీ వధూనాటకసంఘస్వరూపముమాత్ర మిట్టిదని నిరూపింప శక్యము గాకున్నది. ఆవధువులు సంసారిణులో గణికలో ! ఆసంఘములు పాడెడివో లేక యాడెడివో ! 4.

ఇట్లు సర్వలక్షణసంపూర్ణ మైనయిది పుట్టిననాఁటనుండి నేఁటివఱకు నొక్కరీతి నార్యజాతికి భజనీయమై వెలయుచున్నది. కావుననే బ్రహ్మాండపారాశర్యపురా

1. చూ. సం. వా. ప్ర. భా. 120—124. 208. పుటలు.
2. రామా. అయో. 100—43.
3. బాల. 5—12
4. ఈవిషయమింకను విచారణీయము.

ణాదులు దీనిమహిమను వేనోళ్లఁ బొగడినవి. అట్టిమహిమ కలది కావుననే తత్త్వసంగ్రహరామాయణము, పఠనశ్రవణంబులఁ నొక్కొక్కకాండమునకు నొక్కొక్క ఫలము కల దని నిరూపించినది. అట్టిఫలము కలిగించునది కావుననే షట్కాండము కాని సుందరకాండము గాని నియమపూర్వకముగాఁ బారాయణము గావించి యిష్టార్థసిద్ధిని బడయుచున్న భక్తులు నేఁడు గూడఁ గనఁబడుచున్నారు. అట్టి పరమపావనము వేదతుల్యము నైన దీని మహిమ నెంతని పొగడఁగలము? కావున నేతాదృశ మైన మహేతిహాసము రచియించిన వాల్మీకి మహర్షిని—

"కూజన్తం రామరామేతి మధురం మధురాక్షరమ్,
ఆరుహ్య కవితాశాఖాం వన్దే వాల్మీకికోకిలమ్"

అని స్మరించి, దీనివ్యాఖ్యానముల నించుక యవలోకింతము.

రామాయణవ్యాఖ్యలలోఁ బ్రసిద్ధి గాంచినది తత్త్వదీపిక. నారాయణ తీర్థుల శిష్యుఁ డగు మహేశ్వరతీర్థులు రచియించిన యిది తీర్థీయ మనఁబడును. ఈ యతీంద్రునికిఁ బూర్వము కొందఱు టీకలు రచియించినట్లుగా నవతారికలోని "నానాటీకాస్థవాక్యాని లిఖ్యన్తేఽత్రయథామతి" అను దానివల్లఁ దెలియును. దీని తరువాత గోవిందరాజకృతములయిన, మణిమంజీర—పీతాంబర—మణిమేఖల—అను వ్యాఖ్యలు విఖ్యాతములు. ఇతఁడు శఠకోపదేశికుని శిష్యుఁడు. ఇవి గాక, కందాళ రామానుజకృత రామానుజీయవ్యాఖ్య, వనము భవానీ నృసింహులపుత్రుఁ డగు బ్రహ్మవిద్యాధ్వరిరచించిన విరోధభంజని, అహోబలసూరికృత వాల్మీకిహృదయము, విద్యానాథదీక్షితకృతదీపిక, వాదిహంసవలాహ కాన్వయ గోపాలగురు శిష్యరంగాచార్యకృత రామాయణాన్వయి, వెంకటసూరికృతార్థప్రకాశిక, అను వ్యాఖ్యలును, చతురర్థీ విద్వన్మనోరంజ న్యమృతకతక టీకలును గన విన వచ్చుచున్నవి. ఇంక నజ్ఞాతము లైన వెన్నికలవో! ఇట్లు విద్వజ్జనహృదయాకర్షకము సకలజనరంజకము నైన వాల్మీకి రామాయణము మహత్త్వము చెప్పెడి దేమి? ఇంక—

మహాభారతము

దీని కర్తృత్వము మిక్కిలిసందిగ్ధముగానున్నది. వైయాసికీసంహిత యనెడి ప్రసిద్ధినిబట్టి దీనికర్త వ్యాసుఁ డందుమేని, వ్యాసుఁ డనునది బిరుదనామమై పెక్కండ్రకుఁ గనవచ్చుచున్నది. అట్టిబిరుదు గలపరాశరపుత్రుఁ డందుమేని, పరాశరులు ముగ్గురు నలుగురున్నారు. సత్యవతియందు పరాశరుఁ డనునొక

మహర్షికి కృష్ణద్వైపాయనుఁడను వ్యాసుఁ డని నిశ్చయించ వచ్చు. భారతకథావతారికనుబట్టి యతఁడు కురువంశము నిలిపిన వంశకర్త కావచ్చును గాని యతఁడే భారత గ్రంథకర్త యనుటకు వీలు గాకున్నది. అట్లు చెప్పినచోఁ గథాకాలమునకును గ్రంథకాలమునకు మహాంతరము కనవచ్చును. కొందఱిమత మునుబట్టి యాయంతర మెంత తగ్గినను, అతఁడు చిరాయువు మెయ్యేండ్లు జీవించి యుండె నని చెప్పవలసివచ్చును. అయితే, తనపుత్రుఁ డైన పాండురాజు మొమ్మ లుగా జనమేజయునివఱకు నైదుతరములు గడచినట్లువర్ణింపఁబడిన చిరకాలజీవియు మహాయోగియు నైన యా సాత్యవతేయుఁడు తరువాతఁగూడఁ గొంతకాలము జీవించి హిమాలయగుహలలో యోగనిష్ఠనుండి భారతము రచియించె ననుట యబ్బురమా యని కొందఱికిఁ దోఁచవచ్చును గాని, అంతకంటె వర్తిగ్రంథపద్ధతినిబట్టి, యాపారాశర్యవ్యాసుఁ డొకానొక శిష్యునికిఁ గౌరవపాండవసంగ్రామో దంతము చెప్పియుండఁ దచ్ఛిష్యపరంపరనుండి వ్యాసప్రోక్తముగా వచ్చినయాయు దంతమునే యొకశిష్యుఁడు వ్యాసప్రణీత మైనట్లే భారతసంహితఁగా రచియించి యుండు నని యూహించుట యెక్కువ సమంజస మగు నని పూర్వోక్త భారత కాలచర్చనుబట్టి నే నభిప్రాయ పడుచున్నాను. ఇందుకు, భారతయుద్ధకాలము ననేకు లనేకవిధములుగాఁ జర్చించి యిచ్చిన యభిప్రాయములనుబట్టి యెంత క్రిందికిఁ జూచినను, ఆకాలము క్రీ. పూ. పదునాఱవశతాబ్దిని దాఁటి యీవలికి రాకుండుట యొక కారణము. వైశంపాయనుఁడును[1] సౌతియు రచియించిన భాగము లనేకములు మహాభారతమునఁ గల వని పరిశోధకులు నిర్ణయించి యుండుట మఱియొక కారణము. ఇదేకాక, మిక్కిలి యర్వాచీనము లయిన యుపపురాణములలోఁ గూడఁ గొన్ని పరాశరునిపేరను గొన్నిపారాశర్యునిపేర నుండుట యింకొకకారణము.

జయ మనుపేరఁ జతుర్వింశతిసాహస్రిక వ్యాసరచిత మని కొందఱువిమర్శకు లని యున్నారుకాని, మనమొదటి పరిశీలనమునుబట్టి యదియు నుపపన్నముగాఁ గనఁబడదు. కాని, భారతకథాప్రవచన కర్తమాత్రము కృష్ణద్వైపాయనుఁ డని విశ్వసింపవచ్చును. అందుచే నతని శిష్యపరంపరలోనివా రెవరు రచియించినను, భారత సంహిత వ్యాసప్రణీతముగా వెలయుట సముచితమే యగును. ఇదే కాదు, పురాణము లన్నియు వ్యాసనిర్మితము లనెడి పౌరాణిక సంప్రదాయము సమర్థనీయ మగుటకుఁ బ్రధాన పురాణకథ లన్నియు వ్యాసోపజ్ఞము లన్నను సముచితమే.

---

1. పారాశర్యవ్యాసుని శిష్యపరంపరలోని యొక వైశంపాయనుఁడు భారత రచనము కొంత గావించి యుండును గాని, అతఁడు తైత్తిరీయారణ్యకములోని వైశంపాయనుఁడు మాత్రము కాఁడు.

భారతసంహితా కాలము క్రీ. పూ. దశమశతాబ్దిని దాటి యీవలికి రా దన్న చక్రవర్తి పండితులుగూడ భారతకర్తృత్వము వ్యాసుని కారోపింపఁబడిన దను భావమే సూచించిరి[1]. కావున వ్యాసునికర్తృత్వము మూలకథోపదేశరూప మనెడి నాయభిప్రాయమును పాఠకలోకమునకు విడుచుచున్నాను. ఇంక—

గ్రంథస్థితి

ఇది మిక్కిలి యవ్యవస్థముగా నున్నది. గ్రంథవిషయమున భరతఖండ మందలియొకదేశములోనిప్రతితో మఱియొకదేశములోనిప్రతి పోలకపోవుటయే కాదు, ఒకదేశమందలియొకమండలములోనిప్రతితో మఱియొకమండలములోని ప్రతి పోల దని కూడఁ జెప్పవచ్చును. భారత మాంధ్రీకరించిన నన్నయ తిక్కనల నాఁటికిని దరువాతను గూడ దీనిస్థితి యవ్యవస్థముగానే యున్న దనుట కనేక నిద ర్శనములు కనవచ్చును. భారతము వ్యాసవైశంపాయనసౌతికృతము లైనత్రివిధ భాగములతోఁ గలసియున్న దని యనుక్రమణికాధ్యాయములోనికొన్నిశ్లోకము లనుబట్టి విమర్శకులు కొంద ఱూహించిరి. ఇందుకు—

"మన్వాదిభారతం కేచి దాస్తికాది త థాపరే
త థోపరిచరా ద్యన్యే విప్రా స్సమ్య గధీయతే [2]."

అనుశ్లోకమును వా రుదాహరించి యున్నారు. వ్యాఖ్యాత వ్రాసినయర్థ మునుబట్టి 'మన్వాది' యనుదాని కిపుడు గ్రంథాదిని సర్వత్ర కనవచ్చు "నారా యణంనమస్కృ"త్యేత్యాదిశ్లోకము భారతారంభ మనియు, ఆస్తీకమునికథ కలి గిన 'కిమర్థం రాజశార్దూ' లేత్యాదిత్రయోదశాధ్యాయప్రథమశ్లోకము భారతా రంభ మనియు, ఉపరిచరకథగల 'రాజోపరిచరోనా' మేత్యాదిత్రిషష్టితమాధ్యాయ ప్రథమశ్లోకము భారతారంభ మనియు, పైశ్లోకమునర్థము తెలియవచ్చును [3]. ఇట్లుఱువదిమూఁడధ్యాయములలో మూఁడువిధములయిన యారంభము లున్నట్లు తెలియఁజేసెడిపైశ్లోకమునుబట్టి భారతారంభ మవ్యవస్థ మని తలంపనగును గాని, ఇందు మొదటియారంభము సౌతి దనియు, రెండవయారంభము వైశంపాయనుని దనియు, మూఁడవయారంభము వ్యాసుని దనియుఁ బైశ్లోకము సూచించు

1. చక్రవర్తిగారి S. H. S. Lit. P. 112.
2. ఆదిప. 1–59.
3. ఇవి మూఁడును, ఆదిపర్వములోనివే.

చున్నదని వారు తలంచుటమాత్ర ముచితము కాదు. ఏ మయిన నేమి ? అనేక ప్రతులలోఁ గనవచ్చుపైశ్లోకమునుబట్టి[1]. భారతారంభము చిరకాలము క్రిందటనే యవ్యవస్థస్థితి గాంచిన దని చెప్పవచ్చును. ఇది యిట్లుండ—

“నాలేఖిని యాఁప నక్కఱ లేకుండఁగా జెప్పినచో నేను లేఖకుఁడుగా నుందు”నని గణేశుఁ డంటే, ‘అర్థము తెలియకుండ వ్రాయవ’ద్దని వ్యాసుఁడు పలికి, అందుకై కుతూహలముతో గూఢార్థ మైనగ్రంథగ్రంథిగా నెనిమిదివేలయెనిమిది వందలశ్లోకములను జెప్పె ననియు ; పూజ్యుఁ డైనవ్యాసమహర్షి యుపాఖ్యానము లతోఁగూడ నూఱువేలశ్లోకముల యుత్తమభారతము (మహాభారతము) రచియించె ననియు ; ఉపాఖ్యానములు గాక యిరువదినాలుగువేలశ్లోకములతో భారతసంహిత రచియించె ననియు, ఏఁబదిశ్లోకములతో సర్వపర్వములయనుక్రమణికను సంగ్రహముగా రచియించె ననియు ; మొదటియధ్యాయము చెప్పుచున్నది. ఆదిపర్వాది స్వర్గారోహణికాంతము లయినపదునెనిమిదిపర్వముల తరువాత హరివంశ–విష్ణు–భవిష్యము లనెడిమూఁడు పర్వములు రచియించెననియు ; ఈ మూఁడును ఖిలసంజ్ఞితము లనియు,[2] అవాంతరపర్వములతోడిపదునెనిమిదిపర్వములు నవియుఁ గలసి మొత్తము నూఱుపర్వములు వ్యాసప్రోక్తము లనియు ; సూతపుత్రుఁ డైనరౌమహర్షణి నైమిశారణ్యమునఁ జెప్పినవి పదునెనిమిదిపర్వములే యనియు ; ద్వితీయాధ్యాయము చెప్పుచున్నది[3]. ఇందు ౮౮౦౦ వ్యాసుని

---

1. ఈశ్లోక మొకప్రతిలో ఆదిప. 1–59, ఇంకొకదానిలో 1–63.
మఱియొకదానిలో 11–52. ఇంక వేఱుప్రతులలో నెక్కడ నున్నదో !

2. పురాణం ప్రాక్ప్రవృత్తం. శాఖాంతరస్థంశాఖాన్తరేయత్
అపేక్షావశాత్పఠ్యతే తత్ఖిలమితి-వైదికేప్రసిద్ధిరితి నీలకంఠబుధః
విద్యారణ్యాస్త్వేవముక్తవాన్ యథా-కర్మోపాసనబ్రహ్మకాండేషు త్రిష్వపి
యద్యద్వక్తవ్యమవశిష్టంతస్య సర్వస్యాభిధానేన ప్రకీర్ణకత్వరూపం ఖిలత్వం.

3. ....గ్రంథగ్రంథిం తదా చక్రే ముని ర్గూఢం కుతూహలాత్....
అష్టౌ శ్లోకసహస్రాణి హ్యష్టౌ శ్లోకశతాని చ....
ఇదం శత సహస్రాఖ్యం శ్లోకానాం పుణ్యకర్మణామ్
ఉపాఖ్యానై స్సహ జ్ఞేయం శ్రావ్యం భారత ముత్తమమ్....
చతుర్వింశతిసాహస్రీం చక్రే భారతసంహితామ్,
ఉపాఖ్యానై ర్వి నైతావ ద్భారతం ప్రోచ్యతే బుధైః....
తతోధ్యర్ధశతం భూయ స్సంక్షేపం కృతవా నృషిః
అనుక్రమణికాధ్యాయం వృత్తానాం సర్వపర్వణామ్....
హరివంశ స్తతఃపర్వ పురాణం ఖిలసంజ్ఞితమ్.
విష్ణుపర్వ శిశో శ్చర్యా విష్ణోః కంసవధ స్తథా
భవిష్యం పర్వ చాప్యుక్తం ఖిలే ష్వే వాద్భుతం మహత్.
ఏతత్పర్వశతం పూర్ణం వ్యాసే నోక్తంమహర్షిణా
యథావ త్సూతపుత్రేణ రౌమహర్షణినా తతః
ఉక్తాని నైమిశారణ్యే పర్వా ణ్యష్టాదశైవతు........

వనియు, ఎనిమిది వేలు వైశంపాయనుని వనియు, తక్కినవి సౌతి వనియుఁ గొందఱి యూహ. ఈయూహ నిజ మందమన్నను, ఆ భాగములు విడఁదీసి చూపువారు లేరు. ఇది యిట్లుండ—

వేదములను విడఁదీసి (విన్యాసవేదాన్) వేదవ్యాసుఁ డనుబిరుదు గాంచిన పారాశర్యుఁడు పైల జైమిని వైశంపాయన సుమంతు లనుశిష్యులకుఁ గ్రమముగా ఋ క్సామ యజు రథర్వ సంహితలను బంచి యిచ్చెనని భాగవతాదిపురాణములు చెప్పుచున్నవి [1]. సుమంతు జైమిని పైల శుక వైశంపాయను లనువారికి మహాభారతపంచమము లైనవేదముల నుపదేశించె ననియు, వారు భారతసంహితలను వేఱువేఱుగాఁ బ్రకాశింపఁ జేసి రనియు నీభారతము చెప్పుచున్నది[2]. ఇట్లు పరస్పరవిరుద్ధములుగా నున్న వీనిమాటలనుబట్టి విషయము సందిగ్ధముగా నున్నను, కొందఱు భారత సంహితలే యై యుండె ననియు వానికి వీ రైదుగురు ప్రకాశకులుగా నుండి రనియు భావించుచున్నారు. ఇందుకుఁ గారణము జైమినిభారత మనుపేర నశ్వమేధపర్వ మొకటి మహాభారతాశ్వమేధ పర్వముకంటె వేఱుగాఁ గనవచ్చుటయే. సుమంతుఁడు మొద లగువారి భారతసంహితలు నశించిన వఁట. జైమినిభారత సంహిత యంతయు. బోఁగా నశ్వమేధపర్వము మాత్రము మిగిలె నఁట, మన కిపుడు లభించిన మహాభారతసంహిత వైశంపాయనుఁడు ప్రకాశింపఁ జేసినదఁట. ఈ యభిప్రాయ మంగీకరింత మన్న మొదటఁ బారాశర్యుఁ డైదు భారతసంహితలను వేఱువేఱుగా రచియించె నని సప్రమాణముగా నిర్ణయింపవలెను. కాని, యది శక్యము కాదు. తరువాత సామసంహితా ప్రవర్తకుఁడైన జైమినియే భారతసంహితా ప్రకాశకుఁ డని నిశ్చయింపవలెను. అదియు

1. చూ. సం. వా. ప్రథ. 177 పుట

2. వేదా నధ్యాపయామాస మహాభారత పంచమాన్,
సుమంతుం జైమినిం పైలం శుకం చైవ స్వమాత్మజమ్,
ప్రభు ర్వరిష్ఠో వరదో వైశంపాయన మేవచ
సంహితా స్తైః పృథ క్త్వేన భారతస్య ప్రకాశితాః—ఆది. 63–89, 90.

శక్యము కాదు. పిదప నిపుడున్న మహాభారత మంతయు వైశంపాయనుని నోటనే లోకమునఁ బ్రచారమునకు వచ్చె నని నిరూపింపవలెను. రోమహర్షణి యగు నుగ్రశ్రవసుఁడుకూడఁ గర్త యైనట్లును బ్రవక్త యైనట్లును గనవచ్చుటం జేసి యదియు శక్యము కాదు. ఎట్లయిన నేమి? మహాభారత గ్రంథ మంతయు నొకనోట వచ్చినది కాదు. ఒకకాలమునఁ బుట్టినదికాదు. అందుచేతనే గ్రంథ కర్తృత్వమును గ్రంథస్థితియుఁ గూడ నవ్యవస్థములుగా నున్న వని తలంప వలసి వచ్చినది. ఇఁక—

గ్రంథపరిమితి

అనుక్రమణికాధ్యాయములోని శ్లోకము లొక ప్రతిలో నున్నట్లింకొక ప్రతిలోఁ గనఁబడవు. దీనినిబట్టి యాయాకాలములందు తమలెక్కకు వచ్చినపర్వ శ్లోకసంఖ్యను బట్టి యనుక్రమణిలోని శ్లోకములను సవరించుచు వచ్చి రని స్పష్ట మగును. అట్లగుటచేతనే వావిళ్లవారి ప్రాచీనముద్రితప్రతినిబట్టి యష్టాదశపర్వశ్లోక సంఖ్య ౯౬,౮౩౬. వచ్చినది. ఆంధ్ర సాహిత్య పరిషత్తులోని తాళపత్రప్రతినిబట్టి ౯౫౦౪౨ వచ్చినది. నన్నయభట్టారకుఁడాదిపర్వమునఁ జూపిన లెక్కనుబట్టి ౧౦౦౨౦౦ వచ్చినది. ఒకతెలుఁగుదేశములోని ప్రతుల నిట్లుండ నితరదేశములలోని ప్రతులలో శ్లోకసంఖ్య యెట్లుండునో కదా! ఇందేది సత్య మన్నను లక్షశ్లోక సంఖ్య సరిపడదు. హరివంశాది పర్వత్రయితోడి శతపర్వములశ్లోకసంఖ్య లక్ష యేమో యందమన్న, ఆమూఁడుపర్వములలోని శ్లోకములు ౧౨ వే లని యొక పాఠము. సుమారు ౧౫ వే లని యొకపాఠము, కనవచ్చుటచే[1] అపుడును లెక్క సరిపడదు. నిజముగా ననుక్రమణియభిప్రాయము పదునెనిమిది పర్వముల లోని శ్లోకములు లక్ష యనియే. అయితే నేమి? లెక్క లిట్లు సిద్ధ మైనవి. దీనిని బట్టి గ్రంథపరిమితి గూడ నవ్యవస్థ మనియుఁ బర్వశ్లోకానుక్రమణి యసంగత మనియు విదిత మగుచున్నది. ఇఁక—

మహాభారతవిషయపరిశీలనము

పదార్థానుక్రమణి యర్వాచీన మైనను దానం దెలియవచ్చు బహువిషయ ములలో సంప్రదాయ సిద్ధములై ముఖ్యము లైనవి సత్యవతి నియోగమునఁ గృష్ణ

1. దశశ్లోక సహస్రాణి వింశచ్ఛ్లోకశతాని చ
ఖిలేషు హరివంశేచ సంఖ్యాతాని మహర్షిణా
అష్టాదశ సహస్రాణి శ్లోకానాం చ శతం తథా
ఖిలేషు హరివంశే చ సంఖ్యాతాని మహర్షిణా.

ద్వైపాయనుఁడు గావించిన కురువంశప్రతిష్ఠ పాండవుల సత్యశీలము ధార్తరాష్ట్రుల దుర్వృత్తము వాసుదేవుని మహాత్మ్యము, అనునవి. దానినిబట్టియు గ్రంథస్థితిని బట్టియుఁ బరిశీలించినచో భారతకథ కౌరవపాండవ మహాసంగ్రామముతో ముగిసినట్లు తెలియకపోదు. ఇందుకు స్త్రీపర్వాంతమున నున్న భారతఫలశ్రుతియే నిదర్శనము, స్వర్గారోహణపర్వము కడపటియధ్యాయములు విశేషఫలశ్రుతిపరము లైనను, అవి యర్వాచీనము లని తెలియకపోదు. స్త్రీపర్వముతుద నున్న—

ఇమం మహాయుద్ధమఖం మహాత్మనాం
శృణోతి నూనం పఠతే చ యః పుమాన్
స సమ్య గిష్టస్య మఖస్య యత్ఫలం
త దాప్ను యా ద్వంశవివృద్ధి మాత్మనః
మఖో హి విష్ణు ర్భగవాన్ సనాతనో
వహంతి తం చా గ్న్యనిలేందుభానవః
త ద్దివ్యచారిత్ర మిదం హి యః పఠేత్
సంప్రాప్తసంప త్స సుఖీ భవే దిహ.

అను శ్లోకములు భారతము మహాసంగ్రామరూపయాగ మని తెలుపుచుండ, నట్టియజ్ఞము సమాప్త మైన వెనుక నింకఁ గథాశేషమున కవకాశ మెక్కడిది? శాంత్యాదిపర్వములలోని విషయమునకు భారతప్రధానకథతోఁ గలయిక యెక్కడిది? కావున శాంతి మొదలుగా నేడుపర్వములును మహాభారతమున నధికముగాఁ దరువాతఁ జేరిన వనుట నిజము. ఈ పక్షమున మొదటిపదునొకండుపర్వములలోని యుపాఖ్యానములును భగవద్గీత మొదలుగాఁ గల ప్రధానకథాసంబంధము లేని విషయములును గాక తక్కినగ్రంథ మిరువదినాలుగువేలకు సరిపడి భారతసంహిత యగును. అనుక్రమణిలోని వాక్యములయభిప్రాయమును దీనికి సరిపడును. కాని, ఒకటిమాత్రము సత్యము కేవలకురుపాండవకథయే యైనచో దీని కింతయశస్సు రాదు. ఏవి ప్రక్షిప్తభాగము లని యూహింపఁబడుచున్నవో వానికి సంబంధించిన డెబ్బదియాఱువేలగ్రంథము చేరుటచేతనే యిది ధర్మశాస్త్రమై వేదాంతమై పురాణసముచ్చయమై నీతిశాస్త్రమై మహాకావ్యమై యితిహాసమై వేదపఠనాధికారము లేనివారికి శ్రవణపఠనంబులఁ దరణోపాయమై పంచమవేదమై జగద్వంద్యమై మహాభారత మనుప్రసిద్ధి వహించినది. తరువాత వెలువడినబహువిధకావ్యములకుఁ దల్లియైనది. వర్ణాశ్రమాచారధర్మము లుపదేశింపఁ బరమ గురువైనది.

తింటే గారెలే తినవలెను, వింటే భారతమే వినవలె నన్నసామెతకు గుఱి యైనది, సకలప్రపంచ మావరించినది. కావున నిది యెట్లు పుట్టిన నేమి ? ఎట్లు పెరిఁగిన నేమి ? ఈపంచమామ్నాయ మందలిపావనవిషయమే యాస్తికలోకమునకుఁ బెట్టి నది భిక్ష. ఇందలిప్రధాన విషయము లోకమున కావాలగోపాల ముగ్గుపాలతోఁ బెట్టి నదే కావున దానిని గూర్చి వివరింపఁ బని లేదు. అయినను గొంత—

కథాప్రరోచనార్థమై యిందలి కొన్ని ప్రధానపాత్రములజన్మవృత్తాంతము మహత్త్వబోధకముగా నున్నను. వాని తరువాతిచర్య యంతయు మానవాతీతము గాదు. భారతయుద్ధము నిజముగా జరిగినదే యని యెల్లవిమర్శకులు నంగీకరించు టయే యిందలిమూలకథ మానవోచితమై సత్యమైన దనుటకుఁ దార్కాణము. కురుపాంచాలదేశములకు రాజకీయమైనసహజవైర మంతరంగముల నంకురించి యున్నది. అది ద్రుపదునిచేఁ దిరస్కృతుఁ డైనద్రోణుఁడు, ద్రుపదుని బట్టి కట్టి తెండని శిష్యులను బంపుటతో రేఁగినది. అది తరువాతఁ గౌరవపాండవుల యంతఃకలహమునఁ బుట్టి మహాసంగ్రామములో లీన మైనది. తుద కిటు కౌరవులు నటు పాంచాలురును నశించిరి. పంచపాండవులు మిగిలిరి. పరీక్షిత్తుతో నర్జున వంశము భూమిపై నిలచినది. ఇదికథాసారము. ఇఁక గౌరవపాండవదాయ భాగము.

“ధృతరాష్ట్రుఁడు పుట్టుగ్రుడ్డి. విదురుఁడు పారశవుఁడు. అందుచే వారికి రాజ్యము లభించలేదు. కావునఁ బాండురాజు రా జయ్యెను—ధృతరాష్ట్రునకు మొదటనే రాజ్యము రాలేదు, అతఁ డిపు డెట్లు రా జగును ? పూర్వము రాజ్యము వదలుకొన్న భీష్ముడు మరల దానిని గైకొనఁడు కదా ! కావునఁ బాండవజ్యేష్ఠుని మూర్ధాభిషిక్తుని జేయుదము — నీవుజాత్యంధుఁడ వగుటచే మీతండ్రి రాజ్యము నీకు రాలేదు. పాండురాజునకు వచ్చినది. ఇపుడు దానిని ధర్మరాజు పొందె నేని క్రమముగా రాజ్య మతని వంశములోనివారికే లభించుచుండును. మేమును మావంశమువారును బరపిండోపజీవులమై యుండవలసివచ్చును— పాండు రాజు ధర్మపరాయణుఁడు నన్ను మన్నించుచుండెడివాఁడు. ధర్మరాజు నట్టివాఁడే. పితృపైతామహ మైనరాజ్యమునుండి యతనిఁ దొలగించుట యెట్లు శక్య మగును—” [1].

అనేకివైశంపాయన పౌరజన దుర్యోధన ధృతరాష్ట్రులమాటలనుబట్టి పైతృక రాజ్యము పాండురాజునకు సంక్రమించినట్లు తెలియుచున్నది గాని, యతఁ డెంతో

1. ఆది 109. 141, 142. అధ్యా.

కాలము రాజ్యము చేయలేదు. రా జయినవెంటనే జైత్రయాత్ర వెడలి ధనరాసులు గొనివచ్చి యొకనెలమాత్రము రాజధానిలో నుండి పిదప భార్యలతో వేఁట నెపమున నడవులకుఁ బోయెను. అతఁడు మరల రాలేదు. అతని కొడుకులు వచ్చు నాఁటికి ధృతరాష్ట్రుఁడు రాజుగా స్థిరపడియుండెను. ప్రకృతిరంజను లైనపాండవులను జూచి యతఁడు నంతకంటె నెక్కువగా దుర్యోధనుఁడు నసూయాగ్రస్తులైరి. అందుచేతనే వారిని జంపించునుపాయములు గావించిరి. ఇందుకుఁ గారణము పైతృకరాజ్యమునఁ బాండవులకు హక్కు కల దనెడిచింతయే కదా! పాండవులు ద్రౌపదిని బెండ్లాడి పాంచాలరాజు నింట సుఖులై యున్నా రని విన్నంతనే దుర్యోధనునిదుఃఖము దురంత మైనది. వారిని యుద్ధమునఁ జంపి రాజ్యము స్థిరముగా స్వాయత్తము గావించుకొనఁ గర్ణునియాలోచనంబున నిశ్చయించెను. అది తెలిసి భీష్ముఁడు "దుర్యోధనా! ఇది నీతండ్రిరాజ్య మని నీవు తలఁచునట్లే తమతండ్రిరాజ్య మని పాండవులును దలంతురు. నీతండ్రి యిపుడు రాజుగా నుండుటచే నీకు రాజ్యము వచ్చిన దని నీయభిప్రాయము గాని, కులక్రమాగత మైనయీరాజ్యమును బాండవులు పూర్వమే పొంది రని నాయభిప్రాయము. వారి కీరాజ్యము రా దేని నీకుమాత్ర మెట్లు వచ్చును? కావున నపకీర్తికర మైనదురాలోచనము చేయక వారి కర్ధరాజ్య మిచ్చుట శ్రేయస్కరము" అని ధృతరాష్ట్రునిసమక్షమున హిత ముపదేశించెను. ద్రోణవిదురులు గూడ నిది మే లని వానికిని గొడుకునకును జెప్పిరి. అంబికేయుఁడును వారిమాట కెదురాడ లేక పాండవులను రావించి యర్ధరాజ్య మిచ్చి వారిని ఖాండవప్రస్థమున నుండఁ బనిచెను[1]. పైమాటలనుబట్టి, పెద్దవాఁ డైనను అనర్హుఁ డగుటచే నాంబికేయునకు రాజ్యము సంక్రమింపనట్లును, రాజై రాజ్యము వృద్ధిపఱిచిన పాండురాజునకు రాజ్యమున హక్కు వచ్చినట్లును, అతఁ డడవికి వెళ్ళిన తరువాత భీష్మవిదురులసాహాయ్యమునఁ బ్రజకు నేలికయైన ధృతరాష్ట్రునకుఁ దాత్కాలిక మైనహక్కేర్పడినట్లును, దానిని స్థిరపఱచుకొన దుర్యోధనుఁడు కర్ణాదులతోఁ గలసి చేయుదురాలోచనములకు వగచి కురుపితామహుఁడు వంశహాని కలుగకుండుటకై రాజ్యము చెఱిసగ మనుభవింప నిర్ణయము గావించినట్లును, ఆనిర్ణయమే పాండవుల యర్ధరాజ్యప్రాప్తికిఁ బ్రమాణ మైనట్లును విదిత మగు. కావున నీవిషయము తరువాతి ధర్మశాస్త్రాదులనుబట్టి నిర్ణయింపఁ దగదు, ఇక్కడ భీష్మవచనమే ధర్మశాస్త్రము. ఇదియే కౌరవపాండవులదాయభాగమునకు మూలము. ఇంక—

1. ఆది. 202. 203. 207.

కథాపాత్రౌచిత్యాదులు

భారతయుద్ధమునకుఁ బ్రధానకారణము దుర్యోధనుని రాజ్యకాంక్షయే యైనను, దానికంగములై యనేక కారణములు కథాపోషణమున నౌచిత్యపారము గాంచినవి. ఈవిషయమున గ్రంథకర్త యేపాత్రము నెట్లు లేవనెత్తెనో, యట్లే యెందును దడఁబాటు లేకుండఁ దుదముట్ట నొక్కరీతిని నడపె ననుటయే యీ మహేతిహాసరచనలోని మహాద్భుతమైన విశేషము. రాజ్యమునుగూర్చి దుర్యోధనునికిఁ బాండవులయెడ నసహనము. విలువిద్యను గూర్చి కర్ణున కర్జునునెడ నసూయ. అట్టి యిద్దఱికిఁ గుమారాస్త్రవిద్యాసందర్శన సమయమున గాఢమైత్రి. దురభిమాను లగుటచే ద్రుపదానయనమున కేగి యోడివచ్చిన వీరిహృదయము మాఱలేదు. అర్జునుఁడు ద్రుపదుని బంధించుటయే పాంచాలపాండవుల బాంధవమునకు మూలమైనది. మత్స్యయంత్ర మేయలేక తిరిగివచ్చియుఁ బార్థుఁ డావని చేసెనని విన్నంతనే వీరిరువురి యీసును మితిమీఱినది. రాజసూయమునఁ బాండవేయుల విభవము చూచిన గాంధారేయుని హృదయము భగ్గు మన్నది. దానిపై ద్రౌపది నవ్వు నెయ్యి పోసినది. ఇఁకఁ జెప్పెడి దేమి? అది జూదము కల్పించినది. అది కౌంతేయుల రాజ్యలక్ష్మి నపహరించుటతోఁ బాంచాలిని సభ కీడ్పించి ఫలించినది. అపుడు భీమార్జునుల హృదయమున శౌర్యాగ్ని రగులుకొన్నది. కాని, ధర్మజుని సత్యమున నది నివుఱుగప్పినట్లయినది. అంతటితో వారిచల ముడిగినదా? పునర్ద్యూతమునఁ బాండవుల నడవులకుఁ దఱిమినది. ఘోషయాత్ర నెపమున వారిని బరిహసింపఁ గడంగినది. అందు గర్వభంగమైనను వారియసహనము చల్లారినదా? అపుడు గాకున్న మానె. ఉత్తరగోగ్రహణమందు గాని తుదకు శ్రీకృష్ణుని రాయబారమందుగాని యుపశమించెనా? అసహనము తొఱ్ఱలోనినిప్పు. అది తా నాశ్రయించినవారిని నశింపఁజేయకుండఁ దాను నశించునా? కడ కంతే యైనది. ఈ విషయమున నిట్లు పోషింపఁబడిన యీపాత్రములు త్యాగభోగ పరాక్రమంబులందు నెంతయు సముచితముగాఁ బోషింపఁబడిన వనుట విదితము. ఇంతయేల? పితృభక్తి పరాక్రమప్రతిజ్ఞాపరిపాలనంబుల భీష్ముఁడును సత్యధర్మపరిపాలనంబున ధర్మరాజును బలశౌర్యసౌశీల్యముల భీమార్జునాదులును రాజనీతిని శ్రీకృష్ణుఁడును నిరుపమాన విక్రమంబున నభిమన్యుఁడును, ఇంకను, వివిధగుణంబుల ద్రోణాదులును ప్రవర్తించినవిధ మెఱిఁగిన పాఠకలోకమునకు భారతకవి పాత్రపోషణవిధానము పట్టిచూపవలెనా? ఇతనిపాత్రపోషణకల కాద్యుదాహరణ మనఁదగినది ద్రౌపదీపాత్రము. పంచపాండవులలో నెవ్వరిమనను నొవ్వకుండ మెలఁగునపుడును ద్యూతసభకుఁ బోయి

ధర్మసందేహము తీర్చుకొని రమ్మని ప్రాతికామిని బంపునపుడును సభ కీడ్వఁబడి మానరక్షణార్థము గోవిందుని స్మరించుతఱిని వనములో సైంధవు నుద్రేకమణఁగించు తఱిని సుధేష్ణయింట సైరంధ్రియై యున్నపట్టున సింహబలునిచేత భంగపాటు తప్పించుకొనుపట్టున భర్తలకు వీరావేశము గలిగించుచు మనసులోని దుఃఖము వెడలఁగ్రక్కుచుఁ గృష్ణునితో మాటలాడునెడఁ బాతివ్రత్యము ధర్మజ్ఞత ధైర్యము చిత్తస్థైర్యము పరేంగితజ్ఞానము సమయస్ఫూర్తి లోకజ్ఞత రాజనీతిజ్ఞత యను సుగుణములు మూర్తీభవించినట్లుగాఁ బాంచాలీపాత్రమును బోషించిన భారత కవికి గాక పాత్రపోషణము మఱెవరికిసొమ్ము? ఇది యిట్టి దని విద్వల్లోకప్రసిద్ధమై యుండ, సెండర్ (Sehneider) అను పాశ్చాత్య విమర్శకుఁ డొకఁడు "మహాభారతము ముఖ్యోద్దేశ మేదో యొకవిధమున శత్రువులను సంహరించుటయే యనియు, ఇందలి పాత్రములు కొంతవఱకు బాగుగాఁబోషింపఁబడినను, మొత్తముమీఁద మానవశీలమున కుచితములుగా లేవనియు"[1] విమర్శించుట యెట్టిదో యూహింపుఁడు.

ఇందలి యష్టాదశ సంఖ్యానియమ మెందుకు వచ్చినదో సరిగాఁ దెలియ రాదు గాని, అష్టాదశద్వీపములకును, అష్టాదశ విద్యలకు నిది స్మారక మేమో యని తోఁచుచున్నది. ఈమహాకథలో యుద్ధము పదునెనిమిది దినములు జరిగినట్లు వర్ణింపఁబడినది. అందుకుఁ దగినట్లు రెండుపక్షములలోని సేనలమొత్తము పదునెనిమిదియక్షౌహిణులు. ఈసంఖ్యలకు సాటిగాఁ బర్వములు పదునెనిమిది. ఈమూఁడింటిని సమర్థించుటకో యన సకలవేదాంతసారమైన భగవద్గీతోపనిషత్తు పదునెనిమిదియధ్యాయము లైనది. ఇది యెపుడు పుట్టిననేమి? నిజముగా నీశ్వరుని నోటనే వచ్చినదేమో యనునట్లుగా ముముక్షువులకు జీవేశ్వరతత్త్వమును గరతలామలకము గావించు దీనివంటి యుత్తమమత గ్రంథము వేఱొండు లే దనుట సాహసముకాదు. దీనితరువాత నెన్నఁదగినది సనత్సుజాతీయము. ఐహిక జ్ఞానమున కాకరమైనది విదురనీతి. ఐహికాముష్మికములు రెంటిని సోదాహరణముగా బోధించునది శాంతిపర్వము. సుమారు పదునాలుగువేలగ్రంథ మయినశాంతివలెఁ జిత్తశాంతిని గలిగించుసాధనము మఱొకటి కానరాదు. ఏతాదృశమహత్త్వంబునఁ బరిఢవిల్లుపంచమవేదము వెలయుట భరతఖండముపాలిటి భాగ్యముగాక మఱేమి? ఇట్టిమహాభారతమున కనుబంధము వెలసినది హరివంశము. మూఁడుపర్వములతో విలసిల్లునిది శ్రీకృష్ణునిమహామహిమను దెలుపుచున్నది. దీనితోఁ గలసి మహాభారతము శతపర్వసంజ్ఞను గాంచిన దగుటచే నిది, యది వెలసినవెంటనే

---

1. The History of World Civilization Vol. II. P. 736.

యుదయించిన దనితోఁచుచున్నది. ఇందు భగవదవతారకథలు వర్ణింపఁబడినవి. భారతమందలి యుత్తమోపాఖ్యానములంబోలిన యుపాఖ్యానములు నిందు గలవు. ఇఁక—

"ధర్మార్థకామమోక్షార్థై స్సమాసవ్యాసకీర్తనైః,
తథా భారతసూర్యేణ నృణాంవినిహతం తమః
ఇతిహాసప్రదీపేన మోహావరణఘాతినా
లోకగర్భగృహం కృత్స్నం యథా వత్సంప్రకాశితమ్"

అనుచును, 'య దిహాస్తి త దన్యత్ర య న్నేహాస్తి న తత్క్వచిత్' అనుచును భారతమహిమను మనసార స్మరించి దీనివ్యాఖ్యానములను గూర్చి యించుక తెలిసికొందము.

దీనివ్యాఖ్యలలో సర్వజగద్వ్యాప్తమైనది భావదీపము. దీనికి నీలకంఠీయమనియుఁ బేరు కలదు. గోవిందసూరితనయుఁ డగునీలకంఠపండితుఁడు దీనికర్త. గోదావరికిఁ బశ్చిమమున మహారాష్ట్రదేశమం దున్నకూర్పరమను గ్రామమున నితఁడు నివసించినవాఁ డనితెలియవచ్చినది. అర్జునమిశ్రుఁ డితనికిఁ బూర్వము భారతమునకు వ్యాఖ్య రచియించిన ట్లితనిరచనలో నందందు గనవచ్చును. అభయానందపూజ్యపాదుని శిష్యుఁడును, విద్యాసాగరనామాంతరుఁడు నగునానందపూర్ణమునీంద్రుఁడు రచియించిన వ్యాఖ్యానరత్న మను మఱియొకవ్యాఖ్యయు. లక్షాభరణ మను నింకొకటీకయుఁ గలవు. మఱియు, సర్వజ్ఞనారాయణకృతమైన మహాభారతవ్యాఖ్య యొకటి కలకత్తాపుస్తకభాండాగారమున నున్నట్లును, అది నీలకంఠీయమువలెనే యుత్తమవ్యాఖ్య యైనట్లును దెలియవచ్చును. ఇంక నెన్ని యెందెందు కలవో !

మహాభారతము శతపర్వ మనెడి దృఢవిశ్వాసముతోనే, అర్జునమిశ్రుఁడు హరివంశముమూఁడుపర్వములకుఁ గూడ వ్యాఖ్యానము రచియించెను గాని, కేవలము శ్రీకృష్ణచరితము బోధించుదానికి భారతముతో నెట్టిసంబంధమును లేదు. అయినను మహాభారతకథలో ధర్మపక్ష మవలంబించి దానికి జయముకలిగించిన శ్రీకృష్ణునిమహత్త్వము హరివంశరూపమున మహాభారతమున కనుబంధముగా దానివెంటనే యుదయించి యుండు నని భావింపవచ్చును గాని జైమినిభారత మట్టిది కాదు. ఇది రామాయణము నుత్తరకాండ ముదయించినతరువాతఁ బుట్టిన

దనిఁ యిందలి కుశలవవృత్తాంతమే తెలుపుచున్నది. అందుచే సర్వాంశసకాలమును సుత్పన్నమైన యిది జైమినిపేరఁ బ్రసిద్ధి కెక్కినను భారతసంహితానమకాలిక మని తలంపరాదు. అట్టి యీరెంటికర్తృత్వముగూడ సందిగ్ధముగానే యున్నది. వీనిదే కాదు, తక్కినపురాణముల కర్తృత్వము నిట్టిదే. ఇఁక యుపురాణములు.

ఇది, ఆంధ్రమహావీరచరితోత్తరరామచరిత మాలతీమాధవ భీష్మప్రతిజ్ఞా
సత్యకీర్త్యాది రూపకకర్తయగు మల్లాది సూర్యనారాయణశాస్త్రి
నిర్మించిన సంస్కృతవాఙ్మయచరిత్ర ద్వితీయ
భాగమగు లౌకికవాఙ్మయచరిత్రయందు
ద్వితీయాధ్యాయము.

తృతీయాధ్యాయము

పురాణములు

చతుర్దశ విద్యలలో గణనకెక్కిన యివి జన్మచే నర్వాచీనము లయ్యును మిక్కిలి పురాతనము లయిన బహు విషయములను వర్ణించినవగుటచేఁ బురాణము లైనవి. రామాయణ మహాభారతములవలె శ్రవణపఠన వ్యవహారమున సార్వజనీనములై భరతఖండమంతట వ్యాప్తిగాంచిన యివి మిత్రసమ్మితము లని విఖ్యాతికెక్కినవి. సర్గ ప్రతిసర్గ వంశ మన్వంతర వంశానుచరితము లెందు వర్ణింపఁబడునో యది పురాణమను లక్షణమునకుఁ దగినట్లుగాఁ బురాణములందు పూర్వసృష్టి స్థితిలయములు పునస్సృష్టి దేవతా వంశక్రమము బ్రహ్మర్షిరాజర్షి గోత్రక్రమములు మన్వంతరములు సూర్యచంద్రవంశ రాజుల చరితములు మొదలగు బహువిషయములే కాక సంహితా బ్రాహ్మణారణ్యకోపనిషత్తులందును రామ భారతాఖ్యానములందును బీజరూపముననున్నవి విధేతిహాసములును సవిస్తరముగా వర్ణింపఁబడియున్నవి. అట్లని, యన్నిటియందును బై విషయము లన్నియు సక్రమముగా సంపూర్ణముగా వర్ణింపఁబడిన వని భావింపరాదు. ఒకదానియందు సంగ్రహముగా నున్నది మఱియొక దానియందు వివరముగా నుండును. ఒకచో లేనిది మఱొక్కచో నుండును. ఒకట నొకమార్గమున నున్నది మఱొకట వేఱొకత్రోవ నుండును. అయినను బౌరాణిక సంప్రదాయమున నట్టివెల్ల సమన్వయైక్యము గాంచు ననుటయే యిందలి విశేషము. ఇది వాయుప్రోక్తము, ఇది పరాశరప్రోక్తమిత్యాద్యవాంతరమతములతో నివియన్నియు వ్యాసప్రోక్తములనెడి మతము సుప్రసిద్ధమై యున్నదిగాని, ఇవియొకకాలమందు పుట్టినవియు నొకనొకటఁ బుట్టినవియుఁ గావనుట స్పష్టము గావున వీనికర్తృత్వ మజ్ఞేయ మనవచ్చును. ఇఁక, స్మృతులవలె దేని కద్దే యాద్య మని భ్రాంతి గొలుపుచున్న వీనికాలమందుమా, అది మఱియు దురవగాహముగా నున్నది. బ్రాహ్మణారణ్యకములందు పురాణశబ్ద మున్నది గాని, అం దది ప్రాచీన గాథాపర మని కొందఱు తలంచిరి. భారతమున నీ పదమున్నది. అదికూడఁ బురాణశబ్దవాచ్యమయినట్లు నందేయున్నది. ఆపస్తంబ ధర్మసూత్రము భవిష్యత్పురాణమును బేర్కొన్నది[1], అష్టాదశ పురాణములసారము సంగ్రహించి కృష్ణద్వైపాయనుఁడు భారత

1. ఇపుడు కనవచ్చునది యంత ప్రాచీనము గాదు. దీనికంటె నది వేఱై యుండును.

సంహిత రచియించె నని పారాశర్యోపపురాణము చెప్పినది. పదునెనిమిది పురాణములను వ్యాసుఁడే నిర్మించెనని సకల పురాణములు చెప్పినవి. పాద్మవారాహశ్వేతాదికల్పములందు బ్రాహ్మ పాద్మ వాయవ్యాది పురాణము లుత్పన్నములైన వని మాత్స్యాది పురాణములు చెప్పినవి. ఎట్లు చూచినను బురాణముల కాలము క్రీ. శ. ఆఱవ శతాబ్దినిదాఁటి యావలికిఁ బోఁజాల దని కొందఱు పాశ్చాత్య పరిశోధకులు వక్కాణించిరి. ఇ ట్లొకటి యేటికిఁ దీసిన నొకటి కోటికిఁ దీయుచున్నది. ఈ రీతి నిద మిత్థమనుటకు వీలు గాకున్న వీనికాలమునుగూర్చి చర్చించిన లాభము లేదు గావున నాకుఁ దోఁచిన యభిప్రాయ మిచ్చెదను.

రామ భారతాఖ్యానముల లోనివే కాక హరివంశములో వర్ణితము లైన విషయములు కూడఁ గొన్ని వాయు విష్ణు భాగవతాదులందు కనవచ్చుచున్నవి. కావునఁ బురాణముల మాటలను బట్టి యివి భారతాదులకుఁ బూర్వము లనుటకు వీలు లేదు. వైదిక గ్రంథములందు పురాణేతిహాస సంజ్ఞ లుండుటను, ఆపస్తంబాదులందు కొన్ని పురాణముల పేళ్లుండుటను జూచినచో, వ్యాసోపజ్ఞములైన వివిధ పురాణగాథ లిప్పటి పేళ్లతోనే తొల్లివ్యవహారమున నుండెడివని తోఁచక పోదు. వీని యుదంతము వేదాంగముల వృత్తాంతమువంటిది [1]. మఱియు, అమరసింహుని నాఁటికిఁ బురాణము పంచలక్షణ మని నిర్ణీత మగుటను భాసకాళిదాసాశ్వఘోషాదులు పురాణముల నెఱిఁగియుండుటను దెలిసికొన్నచో నివి క్రీస్తు శకారంభమున కీవలి వని చెప్పుట కవకాశము కనఁబడదు. కావునఁ గర్మ భక్తి జ్ఞానమార్గములను సులభముగ నుపదేశించుచు నడుమ నడుమ నాస్తిక మతముల నణఁగఁద్రొక్కుచు శైవవైష్ణవ మతములను విగ్రహారాధనమును విస్తరింపఁజేయుచు వచ్చిన యివి హరివంశమునకును గ్రీస్తుశకారంభమునకును మధ్యకాలమున నుదయించి యుండు నని తోఁచుచున్నది. తరువాత శైవ వైష్ణవాది మతములు పరస్పరము ప్రతిఘటించు కాలమం దనగాఁ గ్రీస్తు శక మాతేడు శతాబ్దుల లోపల నుపపురాణములును, ఆగ్నేయము స్కాందము మొదలగు పెక్కుపురాణములలోని యనేక భాగములును వెలసియుండును. ఈ విషయ మింకను బాతకలోకము పరిశీలించుఁగాక.

పురాణములు, మహా పురాణము లని యుపపురాణము లని రెండు విధముల నున్నవి. ఇవి పదునెనిమిదేసి యని సర్వత్ర కనవచ్చునుగాని, లెక్కింపవంత కెక్కువగా నే కనఁబడుచున్నవి. ఒక పట్టికలోని బ్రహ్మాండ పురాణమునకు

1. చూ. సం. వా. ప్రథ. పుట. 271, 272.

బదులుగా మఱియొక పట్టికలో వాయుపురాణ మున్నది. మహాపురాణములలో దేవీ భాగవతమును గొందఱు, భాగవతమును మఱికొందఱు పరిగణించిరి. ఒక చోటఁ జేరిన నారదీయ మింకొక చోటఁ జేరలేదు. ఇఁక ఉపపురాణము లందునా, వానికి లెక్కయే లేదు. ఇట్లవ్యవస్థముగా నున్న వీని లెక్కలను గూర్చి చర్చించక విష్ణు పురాణమును బట్టి ముందుగా మహాపురాణములను జూపుచున్నాను.

౧	౨	౩
వైష్ణవము	బ్రహ్మాండము	మాత్స్యము
నారదీయము *	బ్రహ్మకైవర్తము *	కౌర్మము
భాగవతము	మార్కండేయము	లైంగము
గారుడము	భవిష్యము	శైవము
పాద్మము	వామనము *	స్కాందము
వారాహము	బ్రాహ్మము	ఆగ్నేయము

ఇందు ౧ గుర్తుకలవి శ్రీమన్నారాయణుని బ్రశంసించునవి కావున సాత్త్వికములు మోక్షప్రదములు. ౨ గుర్తుకలవి సరస్వతీ చతుర్ముఖ కృపాణములను స్తుతించునవి కావున రాజసములు, స్వర్గప్రదములు. ౩ గుర్తుకలవి దుర్గా శివలింగ విఘ్నేశ కుమారులను జెప్పునవి కావునఁ దామసములు దుర్గతిదాయకములు. వీనిని గలలో నైనఁ జూడఁగూడదు. వీనిని విన్నవారికి మతిపోవును. అని పారాశర్యోప పురాణము నిర్ణయించినది. వీనిలో * పువ్వుగుర్తుగల వానికి బదులుగా వాయవ్య బ్రహ్మవైవర్త[1]. మహా (దేవీ) భాగవతములను బృహద్ధర్మ పురాణము చేర్చినది. నారసింహ పురాణమును మఱికొన్ని చేర్చినవి. ఇట్లు మహా పురాణము లిరువది రెండైనవి[2]. వీని వృత్తాంతము తెలుప నివియే గతి కావున మత్స్యవిష్ణు పురాణాదులనుబట్టి దాని నిందు సంగ్రహముగాఁ జూపెదను.

"కృతయుగమునందు బ్రహ్మ శతకోటి ప్రవిస్తరము బ్రాహ్మసంజ్ఞము నైన పురాణసంహితా స్కంధము నిర్మించెను. దాని సారమును వేదవ్యాసుఁడు నాలుగు

1. దీనినిగూర్చి ముందుతెలిపెదను.
2. కాని, వాయు పురాణము శైవపురాణముకంటె వేఱుకాదు.

లక్షల శ్లోకముల పరిమితిగల యష్టాదశ పురాణసంహితనుగా రచియించి సూతుఁడైనరోమహర్షణునికిఁజెప్పెను. అతఁడు తనకొడుకైనయుగ్రశ్రవసునికిబోధించెను. ఆ రౌమహర్షణి నైమిశారణ్యమందలి శౌనకాది మహర్షులకుఁ దెలియఁ జెప్పెను. అన్ని పురాణములలోను బ్రాహ్మము మొదటిది. మరీచికి బ్రహ్మ యుపదేశించిన యీ గ్రంథము పదివేలు. పద్మపురాణగ్రంథ మేఁబదియైదువేలు. సకల ధర్మముల నుపదేశించు విష్ణుపురాణములోని శ్లోకసంఖ్య, ఆఱు—ఎనిమిది—తొమ్మిది—పది—ఇరువదినాలుగు—వే లని పాఠాంతరములు కలవు. కాని, లోకములో శ్రీధరీయ విష్ణుచిత్తీయ వ్యాఖ్యలతో ముద్రితమైన యించలి గ్రంథ మాఱువేలు మాత్రమే. రుద్రమాహాత్మ్యబోధకమై వాయుప్రోక్తముగా ఖ్యాతి గాంచిన శైవ పురాణ మిరువది నాలుగువేల శ్లోకములు కలది. ఇందు గాయత్రి నధికరించి ధర్మవిస్తరము వర్ణింపఁబడినది. వృత్రాసురవధ వర్ణింపఁబడినభాగవతము పదునెనిమిదివేలగ్రంథము. నారదుఁడు బృహత్కల్పాశ్రయములైన ధర్మము లుపదేశించిన నారదీయగ్రంథ మిరువదియైదువేలు. జైమిని మార్కండేయ సంవాదరూపమైన మార్కండేయములోని శ్లోక సంఖ్య ముప్పదిరెండువేలు. భృగుమహర్షి, చయనములయుత్పత్తియు నిష్టకాగణనము మొదలగు క్రతువిషయములు తెలిపిన యాగ్నేయ మష్టసాహస్రము. వ్యాస శిష్యుఁడైన సుమంతుఁడు శతానీకున కుపదేశించిన ధర్మసారముతోడి భవిష్యమున ముప్పదియొక్కవేయి గ్రంథము కలదు. వసిష్ఠుఁ డంబరీషునకు వైష్ణవ ధర్మములను బ్రాహ్మసర్గము నుపదేశించినబ్రహ్మకైవర్తము ద్వాదశసాహస్రకము. నంది చెప్పిన యీశానకల్పవృత్తాంతముతోడిలైంగ మేకాదశ సహస్రకము. విష్ణుమూర్తి భూదేవికిఁ జెప్పిన వరాహావతార మాహాత్మ్యముగల వరాహ పురాణ మిరువది నాలుగువేలగ్రంథము. షణ్ముఖుఁడు చెప్పినమాహేశ్వరధర్మములు రుద్రచరితములు గలస్కాందము లక్షగ్రంథము. చతుర్ముఖుఁడు త్రివిక్రమమహత్త్వమును, త్రివర్గములను త్రిమూర్తులను వర్ణించిన వామనము చతుర్దశ సహస్రశ్లోకము. కూర్మరూపియగు జనార్దనుఁడు దేవేంద్ర సన్నిధిని ఋషులకు ధర్మార్థకామమోక్షములు బోధించిన కూర్మపురాణము షట్సహస్రశ్లోకము. మత్స్యరూపియగు మాధవుఁడు మనువునకు నరసింహోపవర్ణనముంగూర్చి చెప్పిన మత్స్య పురాణము చతుర్దశ సహస్రశ్లోకము. గారుడకల్పమున విశ్వాండ మంతయు గారుడోద్భవ మని విష్ణువు చెప్పిన గారుడపురాణము షోడశసహస్ర గ్రంథపరిమితము. బ్రహ్మ,యజాండమహ

త్త్వము వర్ణించిన బ్రహ్మాండపురాణమందలి శ్లోకములు పన్నెండువేలయిదువందలు[1]. ఇందు రాఁబోవు కల్పముల వృత్తాంతము వర్ణింపఁబడినది. అన్ని పురాణము లందును సర్గ ప్రతిసర్గాదికర్త శ్రీవిష్ణు వనియే చెప్పఁబడినది. యతోవా ఇమాని భూతా నీత్యాది శ్రుతివాక్యముల తాత్పర్యము నట్టిదే. విష్ణువే బ్రహ్మ, విష్ణువే శివుఁడు, విష్ణువే యాదిత్యుఁడు. సర్వము విష్ణుమయము. ఇదే పౌరాణిక వాక్యము. అష్టాదశ పురాణములందు నట్టియేకాద్వితీయ పురుషునే భావింపవలసినది. దీని నతిక్రమించినవారు నారకు లగుదురు."

ఇత్యాదిగాఁ దెలియవచ్చు పురాణ వృత్తాంత మందలి గ్రంథసంఖ్యలు సరిగా నిట్టే లేవు. అన్నిటిలోను బ్రక్షిప్తగ్రంథము చేరియున్నది. మఱికొన్ని విశేషములు.

వాయుపురాణము, శైవపురాణము:—ఇవి రెండును వేఱని కొన్ని యుప పురాణములలోని పురాణనామ పట్టికలు భ్రాంతి కలిగించినమాట సత్యము. వానిని బట్టి మహా పురాణములలోనిది శైవపురాణ మనెడి ప్రతీతి కలిగినది. ప్రాచీనముగాఁ గనవచ్చు వాయుపురాణము మహాపురాణములలో గణింపఁబడక పోవుటకుఁ గారణ మేమని పెక్కుండ్రకు సంశయమును గలిగినది. ఇందలివాస్తవ మరయఁగా నీరెండు నొకటే కాని వేఱుకా వని—

1. ఇట్లు మత్స్యపురాణ మిచ్చిన పురాణగ్రంథ సంఖ్యలు సరియని కావు. వాని నాఁటికే పదునెనిమిది పురాణములు సిద్ధమైన వని కాని తలంపరాదు. ఇట్టిలెక్కలును, అష్టాదశపురాణ నామములను గొంచె మెచ్చుతక్కువగా నన్నిపురాణములందును గనవచ్చుటనుబట్టి యవ్వారిసు లెవరో తమనాఁటికిఁ గనవచ్చిన గ్రంథసంఖ్యలతోఁ బురాణముల పేళ్లను బ్రతిపురాణమునందును జేర్చుచు వచ్చి రని విశ్వసింపనగును. ఇందుకు వాయుపురాణము చూపిన యీ క్రింది లెక్కలు పైవానిని బోలకుండుటయే నిదర్శనము.

పురాణము.	శ్లోకసంఖ్య.	పురాణము.	శ్లోకసంఖ్య.	పురాణము.	శ్లోకసంఖ్య.
మాత్స్యము.	౧౪౦౦౦	బ్రాహ్మము.	౧౦౦౦౦	పాద్మము.	౫౫౦౦౦
భవిష్యము.	౧౪౫౦౦	వామనము.	౧౦౦౦౦	కౌర్మము.	౧౭౦౦౦
మార్కండేయము.	౯౦౦౦	ఆగ్నేయము	౧౬౦౦౦	వారాహము.	౨౪౦౦౦
బ్రహ్మవైవర్తము.	౧౮౦౦౦	వాయవ్యము.	౨౩౦౦౦	స్కాందము.	౮౧౦౦౦
బ్రహ్మాండము.	౧౨౧౦౦	నారదీయము	౨౩౦౦౦		
భాగవతము.	౧౮౦౦౦	గారుడము.	౧౯౦౦౦		

ఇది, అష్టాదశపురాణగ్రంథ సంఖ్యలుచెప్పఁ బ్రతిజ్ఞచేసినదిగాని, విష్ణులింగ పురాణముల పేళ్లే ముద్రిత పుస్తకములో లేవు.

"యత్ర త ద్వాయవీయం స్యా ద్రుద్రమాహాత్మ్య సంయుతమ్
చతుర్వింశ త్సహస్రాణి పురాణం శైవ ముచ్యతే"

అను మత్స్యపురాణవచనము వల్లఁ దెలియ వచ్చినది. బొంబాయినగరమున ముద్రిత మైన వాయుపురాణములోని గ్రంథ సంఖ్య పంద్రెండువేలుమాత్రమే. అందు శైవసంజ్ఞ కనరాదు గాని వ్రాత ప్రతులందు—

"ఇతి శ్రీవాయుపురాణం శివాపరాహ్వయం సమాప్తమ్"
"ఇతి శ్రీవాయూక్తు చతుర్వింశతి సాహస్ర్యాం శివసం
హితాయా ముత్తరఖండే శ్రీనర్మదా మాహాత్మ్యే—"
"ఇతి శ్రీవాయుపురాణే లక్ష్మీసంహితాయా మానందకాననమాహాత్మ్యే"
"ఇతి శ్రీమహాపురాణే వాయుప్రోక్తే ద్వాదశసాహస్ర్యాం
సంహితాయాం బ్రహ్మాండావర్తం సమాప్తమ్"
"పంచదశ సహస్రాణి ఖండేఽ స్మిన్మునినా పురా,
గ్రంథసంఖ్యాని గదితా—ఇతి శ్రీవాయుపురాణం శివా
పరాహ్వయం సమాప్తమ్"

ఇత్యాదిగా భిన్నభిన్న దేశలిఖిత వాయవ్య గ్రంథాంతగద్య లనేకములు కనఁబడుచున్నవి [1]. వీనిని బట్టియు, గ్రంథవిషయ వివరణాదులను బట్టియుఁ జూడఁగా, పూర్వోత్తర ఖండములతో ముద్రితమైన వాయు పురాణములోని గ్రంథ సంఖ్య పన్నెండువేలు మాత్రమే యనియు, తక్కిన పంద్రెండువేల గ్రంథము ముద్రితము కాలేదనియు, తొలుత నిది యిరువదినాలుగువేలే యైనను మఱిమూఁడు వేల గ్రంథ ముత్తరఖండమునఁ బ్రక్షిప్తమైన దనియు, వాయుప్రోక్త మనెడి మాటను బట్టి యిది వాయుపురాణముగాఁ బ్రసిద్ధి గాంచినది గాని విషయమును బట్టి యిది శివపురాణమే యనియు, మత్స్యపురాణము చెప్పిన వాయు శైవ పురాణములు రెండు నొకటే యనియుఁ దేలినది. కాని, కొన్ని యుపపురాణములును మాగ్డోనలు మొదలగు కొందఱు విమర్శకులును వీనిని వేఱుగా గణించుటకు శివపురాణ సంజ్ఞ కల మఱియొక పురాణము కనవచ్చుటయే కారణము. ఎట్లయినను, అనేకములైన నదీవర్ణనములును బహుతీర్థవర్ణనలును ముద్రిత వాయుపురాణమున లేక లిఖిత

1. లండన్, ఇండియా ఆఫీసు సంస్కృత గ్రంథ విషయ వివరణ పట్టిక. Vol. VI

పుస్తకములం దుండుటయు, ప్రక్రియాపాదము – అనుషంగపాదము – ఉపోద్ఘాత పాదము–ఉపసంహారపాదము–అనుభాగములు క్రమముగా నుండవలసినట్లు సర్వత్ర కనవచ్చుచుండ ముద్రిత పుస్తకమనుషంగపాదమందలి సృష్టివర్ణనముతో సమాప్తిఁ గాంచుటయు వాయవీయ సంహితయను పేర ముప్పది యధ్యాయముల గ్రంథము దీని కధికముగాఁ శైవాపర నామమునఁ జేరుటయుఁ జూచినచో ముద్రిత గ్రంథ మసంపూర్ణ మనియు శివా పరాహ్వాయ వాయు పురాణము తొల్లి యిరువది నాలుగు వేల గ్రంథ మనియుఁ దెలియకపోదు. ఇంక—

భాగవత దేవీ (మహా) భాగవతములలో నేది మహాపురాణములలోని దను విషయమును గూర్చి రెండు శతాబ్దుల క్రిందటనే యుత్తరహిందూదేశమున వివాద ముదయించి గ్రంథరూపముదాల్చి యచ్చటనే యణఁగినది కాని, దాని వాసన దక్షిణహిందూదేశమునకుఁ గూడ రాకపోలేదు. ఈ రెండునుగూడ ఖ్యాతి కెక్కినవే యైనను. భాగవత మీ రెంటిలో నెక్కువ ప్రసిద్ధి గాంచినదను విషయము నెవరును మఱుఁగుపఱుపఁ జాలరు. అయితే నేమి? మతాభినివేశము కారణముగా భాగవత మనార్ష మంచు దేవీభాగవత మనార్ష మనెడి కలహము పుట్టినది. అందలి కారణములను జర్చించుచుఁ గాశీనివాసియు దక్షిణాచార ప్రవర్తకుఁడు నైనగదా కాశీనాథభట్టు, 'దేవీభాగవతమే ప్రమాణము, అదే మహా పురాణముల లోనిది, భాగవత మార్షమే కాదు,' అని నిర్ణయించుచు, దుర్జనముఖచపేటిక యను గ్రంథము రచియించి భాగవత పక్షవాదులను నిరసించెను. దాని కుపోద్బలకముగా "భాగవతము వ్యాసునిపేర వోపదేవుఁడు రచియించినది గాని వ్యాసుఁడు నిర్మించినది కాదనువాదము పుట్టినది. ఆ వాదమును నిరసించుచు భట్టోజీదీక్షితుల శిష్యుఁడగు రామాశ్రమ పండితుఁడు "భాగవతము వోపదేవ రచితము గాదు, అది యార్షమే, దేవీభాగవత మార్షము కాదు" అనుచు దుర్జనముఖచపేటికయను మఱియొక ఖండన గ్రంథము రచియించి దేవీభాగవత పక్షవాదులను ధిక్కరించెను. అంతట మఱియొక పండితుఁడు దానిని ఖండించుచు దేవీభాగవతార్షత్వము స్థిరపఱుచుచు దుర్జనముఖపద్మపాదుకయను ఖండన గ్రంథము రచియించెను. దీనిని బట్టి మనదేశములోఁ గూడ నీరెంటిలో నేది యార్షమనియు, భాగవతము వోపదేవ నిర్మితమా యనియుఁ గొందఱు సంశయించుట కలదు. ఈ పెద్దచర్చ కిం దవకాశము తక్కువ గావున నా యభిప్రాయము సంగ్రహముగాఁ దెలిపెదను.

బృహద్ధర్మ పురాణాదులు కొన్ని యీ రెంటినిగూడ నష్టాదశపురాణములలోఁ జేర్చియుండ వీని మహాపురాణత్వము మనము చర్చింపఁ బనిలేదు. తక్కిన

పురాణములవలె నివియు నార్షములే యని బహుకాలముగా విద్వల్లోక మెల్లను విశ్వసించినది గావున వీని యార్షత్వమును మనకుఁ జర్చనీయము కాదు. ఇఁక భాగవతము వోపదేవనిర్మిత మనెడి నవీన సిద్ధాన్తము మాత్రమే మన కిపుడు విమర్శనీయము.

క్రీ. ౧౨౬౧-౧౩౦౯ నడుమ యదువంశ సంజాతుఁడును రామచంద్రాపర నాముఁడు నగు రామరాజు దేవగిరిరాజ్యము పాలించెను. అతని యాస్థానమున మహామంత్రి హేమాద్రియను ద్విజవరుఁడు. అతఁడు కటకపుర నివాసియు, కామదేవనామాంతరుఁడు నగు కామరాజ పుత్రుఁడు. స్మృతీతిహాసపురాణవేత్త, గణకాగ్రణి, వదాన్యుఁడు. అతని పండిత మిత్రుఁడు వోపదేవుఁడు. ఇతఁడు సకలశాస్త్రవేత్తయగు ధనేశపండితుని శిష్యుఁడు, భిషగ్వరకేశవుని పుత్రుఁడు. వ్యాకరణ వైద్య సాహిత్య జ్యోతిర్విషయకములైన బహు గ్రంథములు రచియించిన మహాకవి, విద్వద్వరిష్ఠుఁడు. ఈమహాపండితుఁడు భాగవతమునెల్లస్కంధములలోని విష్ణులక్షణ విష్ణుభక్తి విష్ణుతత్త్వ ప్రతిపాదకములైన పద్యముల నుద్ధరించి ముక్తాఫల మను పద్యాత్మక గ్రంథమును దానికిఁ గైవల్యదీపిక యను వ్యాఖ్యానమును రచియించి హేమాద్రి పేరు పెట్టెను. ఈ విషయము మూల వ్యాఖ్యలలోని యీ క్రింది మాటల వల్ల స్పష్ట మగుచున్నది.

"విద్వద్ధనేశశిష్యేణ భిషక్కేశవసూనునా
హేమాద్రి ర్వోపదేవేన ముక్తాఫల మచీకరత్"
"చతురేణ చతుర్వర్గ చింతామణి వణిజ్యయా
హేమాద్రి ణార్జితం ముక్తాఫలం పశ్యత కౌతుకాత్"
"తేన ముక్తాఫలం తేనే యల్లోక మనుగృహ్ణతా
తత్రి టీకాం యథాబుద్ధి కుర్వే కైవల్యదీపికామ్"
"ఇహచ స్వకర్తృకేఽపి యదురాజమహామంత్రిణాఽభ్యర్థిత ఆచార్యః
(వోపదేవః) తత్కర్తృకత్వం(హేమాద్రికర్తృకత్వం)ఖ్యాపితవాన్"
"ఇతి శ్రీవోపదేవకృతా ముక్తాఫలటీకా సమాప్తా"
"ఇతి శ్రీహేమాద్రికృతా ముక్తాఫలటీకా కైవల్యదీపికా సమాప్తా"

ఇట్లిద్దఱి పేళ్లను రెండు గ్రంథములు కనఁబడుచున్నను రెంటికర్త వోపదేవుఁ డనుట స్పష్టము. దీనినిబట్టి భాగవతముతో వోపదేవునికిఁ గల సంబంధ మందలి

పద్యము లుద్ధరించి వానితో ముక్తాఫల ప్రకరణము రచియించుట తప్ప వేఱే యేమియు లేదని విదిత మగుచున్నను, ఇతఁడే భాగవతముకూడ రచియించి వ్యాసునిపేరు పెట్టె ననెడివాదము లేవనెత్తుట యెట్టిదో యూహింపవలసినదే. ఇతరుల పేర గ్రంథములు రచియించు స్వభావము వోపదేవునికిఁ గలదు గదా యనియు, నితని కేదో కొంత భాగవతముతో సంబంధము కలదుగదా యనియు నూహించి, భాగవతమును గాదని దేవీ భాగవతమునకు మాత్రమే యార్షత్వము దృఢపఱుప నిది శాక్తేయు లెత్తినయెత్తు గాక, యిందే మయిన నౌచిత్య మున్నదా? భాగవత పురాణ మహత్త్వము బహువిధముల గరుడమత్స్యస్కంద పురాణములు ప్రశంసించి యున్నమాట యటుండ, క్రీ. శ. ఎనిమిదవశతాబ్ది కడపటనున్న శంకర భగవత్పాదులు భాగవతమునకు వ్యాఖ్య రచియించి యున్నారని, దీనికి ద్వైతవ్యాఖ్య రచించిన విజయధ్వజాచార్యులు చెప్పుచుండ నేఁటి కాఱువందల యేళ్ళ క్రిందటి వోపదేవుఁడు భాగవతము రచియించె ననుట కంటె ననంగత మయినమాట వేఱుండునా? కావున బహువిధముల హరివంశ విష్ణు పురాణముల ననుసరించిన యిదికొన్ని యితర పురాణములవలెఁ బ్రాచీనమే కాని మొన్న మొన్నటిది కాదని విశ్వసింపవచ్చును. ఇఁక దీనిఘనత యందుమా, నిరుప మానము. రామాయణ మహాభారతముల తరువాతఁ బ్రేలు మడఁచి చెప్పఁదగిన యుత్తమ గ్రంథము భాగవత మని భరతఖండ మంతయు నెఱుఁగును. త్రిమతముల వారికి నవలంబనమై బ్రహ్మసూత్రములవలె జీవేశ్వరతత్త్వ మావిష్కరించు పద్య గ్రంథము దీనిని బోలినది లేదనుట యతిశయోక్తి కాదు. ఇపుడు ముద్రితములై లభించుచున్న త్రిమతవ్యాఖ్యలే కాక, సారార్థదర్శిని — వైష్ణవతోషణి — సుబోధిని — భాగవత ప్రకాశము — మొదలగు మఱికొన్ని వ్యాఖ్యానములు గూడ దీని సర్వాతి శాయిత్వమును దెలుపుచున్నవి. ఇఁక నిది యాధారముగా జన్మించిన భాగవతా మృత భాగవత సందర్భాది గ్రంథము లందుమా, అసంఖ్యములుగా నున్నవి. ఇట్టి సుగుణసంపద కాకరమైన భాగవతము నెంతని పొగడఁగలము? వృత్ర వధాశ్రయ మైన దీనివలెనే శుంభవధాశ్రయ మైనదేవీభాగవతము గూడఁ జిర కాలమునుండి ప్రశంస కెక్కినదే కాని వేఱుకాదు. దీనివలె నదియును ద్వాదశ స్కంధము, అష్టాదశ సహస్ర గ్రంథము. దీనికి శ్రీ కారమున్నది. దానికి దేవీ శబ్దము. ఇది భాగవతము, అది మహాభాగవతము, ఇది కృష్ణలీలాశ్రయము, అది పార్వతీ పరమేశ్వర విలాసాశ్రయము. ఈదృశమైన పోలికలను జూడఁగా భాగవతమును జూచి మహా (దేవీ) భాగవత ముదయించిన దని తోఁచుచున్నది. ఇఁకఁ దక్కిన వానినిగూర్చి యొకింత.

ఆంధ్రీకృతములు ప్రసిద్ధములు నైన విష్ణు పద్మ వరాహ మార్కండేయాదులను గూర్చి వ్రాయఁదగినది లేదు. వానిలో, సృష్టి భూమ్యాది పంచఖండముల విలసిల్లు పద్మపురాణమున నపూర్వము లైన యుపాఖ్యానములును దీర్ఘమాహాత్మ్యములును గొన్ని కలవు. తక్కిన మాత్స్యాదులు కొన్ని భగవదవతారపరములు. శైవ పురాణములలో నుత్తమము స్కాందము. ప్రసిద్ధము లైన కాశీ భీమాది ఖండములు దాని యేఁబది ఖండములలోనివే. అందలి బ్రహ్మోత్తర ఖండాదులును సూతసంహితాదులును బ్రత్యేక పురాణములవలెనే దేశమున ఖ్యాతి కెక్కి యున్నవి. భవిష్య భవిష్యత్పురాణములు రెండు నొకటే కాని వేఱుకావు. ఇందు బ్రాహ్మ వైష్ణవ శైవ త్వాష్ట్ర ప్రతిసర్గము లనుపేరఁ దత్తద్వర్ణనలతోడి పంచపర్వములు గలవు. సౌరమత ప్రవర్తకుఁడగు భోజకునిమహత్తు వర్ణించు నిందలి తుది యధ్యాయము ప్రక్షిప్త మేమోయని తోఁచుచున్నది. బ్రహ్మపురాణ మాద్య మనెడి ప్రశంస కొన్నిటఁ గనవచ్చును గాని విషయమును బట్టి యది యర్వాచీనముగానే యున్నది. నదీతీర్థ మాహాత్మ్య వర్ణనముల నిండియున్న యందలి మణిమండప వర్ణనము కాశీ క్షేత్రము కంటె సత్యభామా శ్రీకృష్ణుల కావాసమైన మణిమండప మెక్కువ యని తెలుపుచున్నది.

బ్రహ్మవైవర్త బ్రహ్మకైవర్తములు రెండునొకటే కాని వేఱుకావు. కాని, వైవర్త మని యుత్తర దేశీయులును, కైవర్త మని దక్షిణ దేశీయులును వ్యవహరింపఁ జొచ్చిరి. కొన్ని వ్రాఁతప్రతులను బట్టి చూడఁగాఁ గడపటి ఖండమునఁ గొంత గ్రంథము దక్షిణదేశ పుస్తకముల నధికముగాఁ జేరినట్లు కనఁబడును. బ్రహ్మ—ప్రకృతి—గణేశ—కృష్ణ—సంజ్ఞలుగల నాలుగు ఖండముల విలసిల్లు నీ పురాణము విష్ణుపద్మ పురాణముల సమకాలికమని తోచుచున్నది. ఇఁక నీవిషయము ముగించుటకు ముందుగాఁ బురాణములను గూర్చి స్కాంద మిచ్చిన యభిప్రాయము నీక్రిందఁ జూపుచున్నాను.

శైవ—భవిష్య—మార్కండేయ—లైంగ—వారాహ—స్కాంద—మాత్స్య—కౌర్మ—వామన—బ్రహ్మాండ—సంజ్ఞలుగల పదియును శివునే ప్రశంసించు చున్నవి. శివుఁడే యందు ప్రకాశించు చున్నాఁడు. ఈ పది పురాణముల గ్రంథసంఖ్య మూడులక్షలు. వైష్ణవ—భాగవత—నారదీయ—గారుడములు నాలుగును విష్ణుని బ్రశంసించు చున్నవి. బ్రాహ్మ పాద్మములు రెండును బ్రహ్మను, ఆగ్నేయ మగ్నిని, బ్రహ్మవైవర్తము సవితను జెప్పుచున్నవి. ఈ యెనిమిదింటి గ్రంథ సంఖ్యలక్ష. మొత్తము పురాణ గ్రంథ సంఖ్య నాలుగులక్షలు" ఇట్టివానిం గూర్చి లోకమున వ్యాప్తమై యున్న యార్యోక్తి యిది—

"అష్టాదశ పురాణేషు వ్యాసేన కథితం ద్వయమ్
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్"

ఉపపురాణములు

ఇవి పదునెనిమిది యని ప్రతీతియే కాని, కొన్ని పురాణములలోని పట్టికలను బట్టి చూడ లెక్కకు మిక్కిలిగానే కనఁబడుచున్నవి. వీనిలోఁ గొన్ని నామమాత్రావశేషములే కాని, అనేకములు ముద్రితములు గాక లిఖితపుస్తక భాండాగారములఁ బడియున్నవి. కొన్ని, మహాపురాణముల పేళ్ళతో నున్నవి. వీనిలో శైవవైష్ణవ మతప్రతిపాదకములే కాదు, సౌర శాక్త గాణాపత్యాది మతప్రవర్తకము లైనవియుఁ గలవు. మొత్తమివి యన్నియు నర్వాచీనము లనుట స్పష్టము. తెలిసినంతవఱకు వీనినామము లిందు చూపుచున్నాను.

నారదీయ	దేవీ	ధర్మ	ఆది
బృహన్నారదీయ	కాళికా	శివధర్మ	ఆదిత్య (సౌర)
నందీశ్వర	చండికా	బృహద్ధర్మ	నాంద
బృహన్నందీశ్వర	వాసిష్ఠ	విష్ణుధర్మ	దౌర్వాస
శివ	మారీచ	విష్ణుధర్మోత్తర	కాపిల
సాంబ	వారుణ	నారసింహ	మానవ
గణేశ	పారాశర్య	భార్గవ	ఔశనస
లైంగ	వామన	బ్రహ్మాండ	భవిష్యోత్తర
కల్కి	సనత్కుమారీయ		

సంజ్ఞలు కలవి ముప్పదినాలుగు. ఇంక నెన్ని యెందెందడఁగి యున్నవో! ఇట్లు పురాణవాఙ్మయము సమృద్ధిగా విస్తరించినది. భరతఖండమందలి యెల్ల దివ్యక్షేత్రముల మాహాత్మ్యములను దెల్పు స్థలపురాణము లన్నియుఁ జాలావఱకు స్కాందాదులలోనివే కాని, కొన్ని స్వతంత్రములుగా నుదయించినవియుఁ గలవు. ఉపపురాణముల గ్రంథసంఖ్య యంతయు నొక లక్ష యని స్కాందము చెప్పుచున్నది.

శ్రుతులు స్మృతులు పురాణేతిహాసములు, అనునవి క్రమముగా ధర్మనిర్ణయమునఁ బ్రమాణము లని యార్యులు విశ్వసించిరి. సార్వజనీనోపయోగపరములు పురాణేతిహాసములు అట్టివాని ననుసరించి యివి దేవతాభక్తి విజృంభింపఁజేయ

నవతరించినవి. ఇం దనేకములు పంచాశత్ఖండ మండితమైన స్కాందమునందలి సనత్కుమార–సూత–శాంకరీ–వైష్ణవీ–బ్రాహ్మీ – సౌరసంహితలలోని వివిధోపాఖ్యానస్థల మహత్త్వతత్తద్దేవతా మాహాత్మ్యము లాధారములుగా నావిర్భవించి భరత ఖండ మంతయు నావరించినవి. కొన్ని రామాయణ మహాభారత బ్రహ్మ భాగవతాదులలోని గాథ లాధారముగాఁ బుట్టినవి. వీనిలోఁ గల్కిపురాణ మను భాగవత భవిష్య మనఁబడును. ఇది ముప్పదియైదధ్యాయముల గ్రంథము. కలియుగాంతమున శ్రీవిష్ణువు శంభలగ్రామమున సుమతీవిష్ణుయశుల పుత్త్రుఁడై యుదయించి జగము నుద్ధరించు విషయ మిందు వర్ణింపఁబడినది. ఇనుక పాఁతబంటి యీ పురాణ వాఙ్మయమున కిఁక స్వస్తిచెప్పి యీ సందర్భముననే తంత్రాగమాదు లించుక పరిశీలింతము.

తాంత్రికవిద్య

భరతఖండమున వ్యాపించిన మత విద్యలలో నొకటై సనాతన సంప్రదాయ సిద్ధమయ్యుఁ గొన్ని పురాణముల కించుక సమకాలికముగా సారస్వతరూపము దాల్ప నారంభించి క్రీ. పదునేడవశతాబ్ది కడపటివఱకును గూడ శాఖోపశాఖలుగా విస్తరిల్లుచు వచ్చిన దీనికి సంబంధించిన గ్రంథములు సంహితాగమయామల తంత్ర సంజ్ఞలతో నున్నను, తంత్రసంజ్ఞ కలవి యెక్కువగా నుండుటంబట్టియు విషయైక్యము బట్టియు నిది యిందు తాంత్రికవిద్య యనఁబడినది. లోకమున మంత్రశాస్త్రమని ప్రసిద్ధి కెక్కినది యిం దంతర్భూతమే కాని యన్యము కాదు. తంత్రశబ్దమున కెందును సరియైన వ్యుత్పత్తి కనఁబడలేదు కాని, ఉద్దిష్టార్థము సాధింప నద్భుతము లైన వివిధోపాయము లిందు వర్ణింపఁబడుటచే నిది తంత్ర మనఁబడె ననవచ్చును.

వేదోపదిష్టము లైన కర్మజ్ఞానోపాసనా కాండములలో నిది కడపటిదాని ననుసరించినది. కాని, వేదప్రతిపాదిత మైన దానికంటె నిందలి యుపాసనావిధాన మత్యంతము భిన్నము సవిస్తరము. మంత్రతంత్రవిద్య కథర్వవేద మాధార మను మతము కలదు గాని, అందలి మంత్రము లట్టే యిందు కనరావు సరిగదా! యీ రెంటింటి మార్గములే వేఱు. అయినను, వేదవిహితమైన గాయత్రీ విష్ణు రుద్రాది దేవతారాధన విధాన మిందు సవిశేషముగాఁ గనవచ్చుటం బట్టియు, ఉపాసన మాత్మతత్త్వజ్ఞానమునకు హేతువై పరమ పురుషార్థసాధన మగు నని యిది యుపదేశించుటం బట్టియు, ఇది వైదికమతమునకు సన్నిహిత మనవలసివచ్చినది గాని, నిజముగా వేదవేదాంతముల కనుకూలమును బ్రతికూలమును గాని